నవశక్తి

Vol. 2, no. 1

(Dec. 14, 1938)

బెజవాడ, 1938

Record no. 682

Navaśakti

Vol. 2, no. 1

(Dec. 14, 1938)

Bejavāḍa, 1938

Record no. 682

[illegible] **Regd. No. M. 3824**

నవశక్తి

[illegible]

[illegible] 2 | [illegible] | [illegible] 12 38 | [illegible] 1

[illegible]



[illegible]

క థ.

రంగని స్వానుభవం

[illegible] శేషయ్య

ఆ రోజు సంక్రాంతి పండుగ. పల్లెలలోను పట్టణాలలోను గూడా పెద్దా చిన్నా అందరు ఉత్సాహంగా పండుగ జరుపుకొంటారు. నేను క్రొత్త బట్టలు కట్టి మా అమ్మకు తెలియకుండా నాకిచ్చిన నాలుగు కాసులతో కొంత [illegible] మా అమ్మ [illegible]. అప్పటికి [illegible] సాగుతున్నాయి. [illegible] వచ్చేయి, [illegible] చాలా ఉన్నాయి. నేను [illegible] వేస్తేను, [illegible] పై [illegible] కానేను. [illegible] చాలా [illegible]. నేను చెప్పిన [illegible] నవ్వుతున్నాయి. [illegible] కాని [illegible]. [illegible] మా అమ్మకి [illegible]. తరువాత యింకో గంటకో చేతులోని [illegible] పెట్టేను. అయినా నా చేతులో కాని మిగలలేదు. [illegible] మా అమ్మ [illegible] ప్రారంభించేను. నేను యిచ్చిన [illegible] వాటి చేతులో అల్లాగేవుంది. అవి తిని [illegible] దానిని సముదాయించి నేను ఇంటికి పరుగెత్తేను. ఇంటిలో [illegible] లేరు. [illegible] అమ్మ [illegible] మా చెల్లెలు. మా పొలానికి [illegible] మా అమ్మ కొంత [illegible]. [illegible] తోవ [illegible] చిన్న [illegible] మూటను చేతులో [illegible] బయటికి వచ్చేను. [illegible] మా అమ్మ [illegible]. నా [illegible] తెలియని [illegible]. నా [illegible] మా అమ్మ [illegible] మొహం [illegible] ప్రయాణం [illegible] ఉన్నారు. [illegible] కాని [illegible] నాకు [illegible] చేసినా [illegible] ఉన్నాను. అప్పటికి నా చేతులో [illegible].

[illegible] మనస్సు [illegible]. [illegible] బెజవాడ [illegible] రైలు [illegible]. [illegible] నేను [illegible] వున్నాను. బెజవాడ స్టేషనులో [illegible] నేను [illegible] దగ్గర [illegible]. [illegible] లేక నేనక్కడనే [illegible]. ఆ [illegible] నన్ను కొంచెం దూరం తీసుకుపోయి 'యేమి నీ దగ్గర ఏ మాత్రము డబ్బు వుందో తీయ్' మన్నాడు అన్నాడు. నా చేతులో వున్న [illegible] తీసి అతని చేతిలో పెట్టాను. ఇంతేనా అంటూ అతను నా మొలమట్టూ [illegible] వెతికా అని [illegible]. [illegible] ఒక [illegible] వున్నాను. [illegible] నుంచి [illegible] వున్నాను. ఆ [illegible] వారంతా [illegible] వేస్తున్నారని [illegible] వున్నాను. [illegible]

[illegible] బాలా [illegible] సంపాదించేను. అయిన [illegible] గురించి [illegible] ఉంటాను. [illegible] నాకు [illegible] బుద్ధి పుట్టింది. ఆ [illegible] విచారిస్తే నాకు [illegible] పోతున్నారని తెలిసింది. ఆ మరునాటి రోజు బెజవాడలోనే వున్నాను. [illegible] భోజనం పెట్టేరు.

అని [illegible] యుద్ధం [illegible] రోజులు. [illegible] సైన్యాలలోకి చేర్చుకుంటున్నారు. ఆ రోజు సాయంకాలం [illegible] మొదటి బెజవాడలో ఆగింది. వారితో [illegible] నుంచి [illegible] వున్నారు. యుద్ధంలో [illegible] పోతున్నామనే [illegible] ఎంతో సంతోషంతో అనుభవించేరు. ఆ [illegible] వారి [illegible] మాత్రం వారితో స్నేహాలు చేస్తాను. వారితో కలిసి యుద్ధానికి పోదామని నాకు [illegible] పుట్టింది; వారిలో ఒకర్ని కలిసికొని మాట్లాడేను. బెజవాడలో రిక్రూటింగ్ ఆఫీసు వున్నదని అక్కడికి పోతే చేర్చుకుంటారని కొంతమంది చెప్పేరు. వయస్సు యిరవై సంవత్సరాలని చెప్పు [illegible] మాకు [illegible].

[illegible] మరునాటి రోజు రిక్రూటింగ్ ఆఫీసుకు పోయేను. ఆఫీసు యిచ్చిన ఫారం మీద సంతకం చేయడం అన్నీ జరిగినాయి. [illegible] క్రొత్తగా చేరిన [illegible] చాల మంది వున్నారు. [illegible] బూట్లు, మేజోళ్ళు, [illegible] యిచ్చేరు. [illegible] గాని అన్నీ [illegible] వేస్తున్నాయి. నేను [illegible] వేసుకున్న తరువాత [illegible] వున్నానో అంటూ [illegible] చూసేను. బూట్లు [illegible] అవి క్రొత్తగా [illegible] చాలా శ్రమపడేవాణ్ణి. తరువాత వారం రోజుల వరకూ బెజవాడలోనే వున్నాము. మా వాళ్లెవరైనా అనుసరిస్తారేమోనని చూసేను కాని అనుసరించలేదు.

పటాలాలతో నిండిన [illegible] బయలుదేరింది. చిన్న స్టేషన్లలో [illegible] చాలా [illegible] పోతోంది. నేను కిటికీ దగ్గర [illegible] చూస్తున్నాను. [illegible] వచ్చిన పొగ [illegible] క్రమంగా [illegible]. [illegible] పొలాలలోవున్న పైరులు, [illegible] కనిపిస్తున్నాయి. [illegible] మా పొలము, యిల్లు, బంధువులు అంతా జ్ఞాపకం వచ్చేయి. మా అమ్మకి నేను చిన్నవయస్సు [illegible] నుంచి [illegible] నేనే చేసేవాణ్ణి. నేను లేకపోవడంవల్ల మా అమ్మ [illegible] చాలా [illegible]. [illegible] నుంచీ మమ్ములను [illegible] మా అమ్మ [illegible]. నేను [illegible] పోయానని ఆమె [illegible] వుండదు. కాని తెలిస్తేమాత్రం చాల విచార పడుతుంది మా అమ్మ. యీ ఆలోచనతో నా తల [illegible] అవమానంగా [illegible]. మొహానికి చేయి [illegible] వెక్కి వెక్కి యేడ్చేను. ప్రక్కనేఉన్న [illegible] "అది యేమి రంగయ్యా అల్లా యేడుస్తున్నావు. [illegible]" అన్నాడు. "అవ్వ [illegible] వచ్చిందేమో" అన్నాడు యింకొకడు [illegible].

పైన వున్న [illegible] నిద్రలో [illegible] ప్రేమతో నాను [illegible], యూరపులో [illegible] యుద్ధంలో [illegible] మన అందరికి [illegible] లేదు అన్నాడు. రెజిమెంటు అంతటికి నేనే చిన్నవాడిని అగుటచే అందరు నన్ను ప్రేమతో చూచేవారు.

అరుమాసాల వరకు [illegible] లోనే వున్నాను. హిందూస్థాని [illegible] నేర్చుకొనడము, [illegible] కొంత [illegible] వచ్చేయి. [illegible] అభ్యాసము చేస్తున్నాము. [illegible] సైన్యాలతో నిండిన యుద్ధ [illegible] యూరపు ప్రాంతాలకు [illegible]. అటునుండి వచ్చిన ప్యాసెంజరు స్టీమరులో ఒక రోజున వికలాంగులైన [illegible] యిండియన్ సిపాయిలు తిరిగి వచ్చేరు. కాళ్ళో, చేతులో, కళ్ళో పోయినవారే వారందరూను. మాలో యెవరినీ వారి దగ్గరకైనా పోనియలేదు. ఆ మరునాటిరోజే వారంద రిని వారివారి ప్రదేశాలకు పంపివేశారు. నేను మొదటిసారి యింటికి ఉత్తరం వ్రాసి జవాబు కొరకు నిరీక్షిస్తున్నాను. ఒకరోజు మా [illegible] వచ్చి అరగంటలో అందరు ప్రయాణానికి సిద్ధంగా వుండవలసిందని చెప్పేరు.

ఇంగ్లీషు ఇండియన్ పటాలాలతో నిండిన స్టీమరు బొంబాయి రేవు వదలింది. యుద్ధాలలో అనుభవమున్న సిపాయిలు కొందరు తిరిగి భారతదేశం చూడగలమా అని కన్నీరుకార్చేరు. ఇండియన్ పటాలాలకు స్టీమరుయొక్క అడుగు భాగం ఇవ్వబడింది. అక్కడికి గాలి వెలుతురు వచ్చే అవకాశాలు చాల తక్కువ. దానికితోడు [illegible] బట్టలు [illegible] వాసనతో నిండి ప్రాణం ఉక్కిరిబిక్కిరి అయినట్టుండేది. మొదటి రోజునే నాకు వాంతులు ప్రారంభమయి [illegible] చాలా బాధ పడ్డాను. స్టీమరు యొక్క పై భాగం 1, 2 క్లాసులు [illegible] తెల్లవాళ్ళు, ఆఫీసర్లు ఆక్రమించి వున్నారు. అక్కడ [illegible] గాలి వెలుతురు అన్ని సౌకర్యాలు వున్నాయి. మా ప్రయాణం నాలుగు రోజులలో ముగించవలసి యున్నప్పటికి సముద్రం మీద కూడా [illegible] (attacks) సాగుతూండడంచేత పదిరోజుల వరకూ స్టీమరులోనే వున్నాము. ఇండియా పటాలాలకు వచ్చే భోజనం [illegible] అసంతృప్తి బయలుదేరింది. ఒక నాడు మామూలుగా మధ్యాహ్న భోజనం తీసి [illegible]. అన్నం సరిగా ఉడకలేదు. [illegible] చాలా [illegible]. [illegible] మంచి [illegible]. ఇండియా పటాలానికి [illegible] మంచి పేరు సంపాదించేను. [illegible] అన్ని భాషల [illegible] మాట్లాడగలను. అతను మరి యిద్దరు [illegible] సార్జెంటు జనరల్‌తో భోజనం [illegible] చేయడానికి వెళ్ళేను. ఆ [illegible] మరునాటి రోజునుంచి మంచి ఆహారం వచ్చే [illegible] మాత్రమే ఆఫీసర్ల నుండి సమాధానం వచ్చింది. మరునాటి రోజు భోజనం కూడా ఏమీ మార్పులేక మామూలుగానే ఉంది. [illegible] మిగిలిన వారందరు భోజనం [illegible]. తరువాత రెండు గంటలకు సార్జెంటు జనరల్ నలుగురు ఆఫీసర్లతో మా దగ్గరకు వచ్చి ఈ విధంగా అన్నాడు.

"ఈ యుద్ధం రోజులలో యింతకంటె మంచి ఆహారం దొరుకుట కష్టం. [illegible] సరిగా [illegible]. వున్నదానితో సంతృప్తి పడాలి. లేదా [illegible] కఠినంగా [illegible]"

శ్యామలాల్ "[illegible] తిని యీ [illegible] పని చేయడానికి మేము పశువులము కాము" అన్నాడు.

"తెల్లవాళ్ళకి [illegible], మాంసము, గ్రుడ్లు, [illegible], బ్రాండీ యిస్తున్నారు. [illegible] సదుపాయాలన్నీ అవసరం లేదు" అని మా మధ్య నుండి యెవరో [illegible] అరచేరు.

"[illegible] ఎవరది" అంటూ సార్జెంటుజనరల్ ముందున్న వారిని తోసుకువచ్చి అతని చేయి పట్టుకొని ముందుకు లాగేను.

అతను మా రెజిమెంటుకు చెందిన నిహారేన్ బాబూ మంచి యువకుడు. చాలా అందమైన వర్చస్సు. ఆ గుండ్రని ముఖం. పెద్ద కన్నులు. ఆ నమ్రత ఒక్కసారి చూచిన వారతనిని మరచిపోలేరు. అతి మధురంగా పాడే అతని పాటలు వినడానికి వందల కొలది అతని చుట్టూ మూగేవారు.

నిహారేన్‌బాబును, శ్యామలాల్‌ను తీసుకొని ఆఫీసర్లు పైకిపోయారు. నిచ్చెన మెట్లమీద నిహారేన్‌బాబు కాళ్ల తడబడటం చూచేను.

తెలుగువాళ్ళలో పెద్దవాడైన అప్పలస్వామి దగ్గరకు పరుగెత్తి వీళ్ళను యేమిచేస్తారని అడిగేను.

'యేమో! యెల్లా తెలుస్తుంది. అన్నాడు అప్పలస్వామి ఆలోచిస్తూ.

తరువాత పది నిముషాలకు ఒక ఆఫీసరు నోటీసొకటి పుచ్చుకొని క్రిందికి దిగివచ్చి మా అందరిని సమావేశపరచి ఆ నోటీసు చదివి వినిపించేను.

(మిగతా 20 వ పేజీలో)

మన రాజకీయాలు

తటస్థ సిద్ధాంతాన్ని తగలబెట్టాలి.

స్పెయిన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమయిన నాటినుంచి, ఇటలీ—జర్మనీ దేశాలు అక్కడి జాతీయ ప్రభుత్వాన్ని నిర్మూలించటానికి తిరుగుబాటుదార్లకు బహిరంగంగా ఆయుధ సామగ్రిని సప్లయి చేస్తూన్నప్పటికీ, "తటస్థ విధానం; తటస్థ విధానం!" అంటూంది, ఇప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వం.

కామ్రేడ్ బాట్లీవాలా రాజద్రోహ నేరం క్రింద ఎరస్టు చేయబడినప్పుడు, ఇతర రాష్ట్రాల నుంచి అల్లరి చేయటానికి మనరాష్ట్రం వస్తూన్నవారిలో ఈయన ఒకడని వాదించారు, అనాడు మనకాంగ్రెస్‌ప్రధాని, రాజగోపాలాచారి.

శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ గారు ఆమధ్య తిరువాన్కూరు యువజన మహాసభకు అధ్యక్షత వహించటానికి వెళ్ళితే, ఈమె తిరువాన్కూరు సంస్థానానికి చెందిన వ్యక్తి కాదంటూ ఎరస్టు చేయించారు సి. పి. రామస్వామి అయ్యర్, తాను తిరువాన్కూరు నివాని అయినట్టు!

విద్యార్థి ఉద్యమంలో బయటివారు ప్రవేశించి పాడుచేస్తున్నారని గర్జించారు. శ్రీ కట్టమంచి రామలింగా రెడ్డిగారు. ఈ మధ్య తాను విద్యార్థులపై ప్రయోగించిన ఆర్డినెన్సుల్ని సమర్థిస్తూ.

మహాత్ముడు జర్మను యూదుల సమస్యను గురించి హరిజన పత్రికలో వ్రాసిన వ్యాసానికి జవాబిస్తూ, జర్మనీకి చెందని బయటివారెవ్వరూ జర్మనీ సమస్యల్ని చర్చించరాదని హుంకరించారు, నాజీలు.

హైదరాబాద్, రాజకోట, సంస్థానాలలో జరుగుతూన్న ప్రజాపోరాటానికి బయటివారు వెళ్ళి సహాయం చేయటం సత్యాగ్రహ సూత్రానికి విరుద్ధం అని ఆ గాంధిగారే ఇప్పుడునిద్ధాం తీకరిస్తున్నారు.

ఒరిస్సా రాష్ట్రంలో, ఢెన్‌కనాల్ సంస్థాన ప్రజల పోరాటంలో బ్రిటిష్ ఇండియా ప్రజలు పాల్గొనవద్దని వార్నింగ్ యిచ్చింది ఒరిస్సా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ, అక్కడి సోషలిస్టు నాయకులకు.

ఇట్టి తటస్థ సిద్ధాంతాన్ని తగలపెట్టితేనేగాని ప్రజా పోరాటాలు వృద్ధికావు.

పోవాలి పరప్రభుత్వం!

ఇండియా ప్రభుత్వంచే నియమించబడ్డ డాక్టర్ గ్రిగరీగారు, 1937—38 వ సంవత్సరములో దేశంయొక్క వ్యాపార స్థితిగతులను గురించి ఒక నివేదికను ప్రకటించారు. దాని ప్రకారం, మన వివిధ సరకుల ధరలు, ఆర్థిక మాంద్యం ప్రారంభమైన 1929 లో రూ 100 లు ఉంటే, 1937 ఆగష్టునెలలో రూ 75 లు మాత్రమే. అంతేకాదు. పత్తి ధరలు 1937 మార్చిలో కంటె 1937 అక్టోబరులో 100 కి 33 వంతున పడిపోయాయి. గోధుమల ధరలు 1937 మేలో కంటె 1938 మార్చిలో నూటికి 35 వంతున; వేరుశనగలు 1937 ఆగష్టులో కంటె 1938 మార్చి నెలాఖరుకు 100 కి 41 వంతున పడిపోయాయి. ధాన్యం ధర 1929 నుంచి నేటివరకూ 100 కి 60 వంతున పడిపోయానే ఉంది! అమెరికా వంటి స్వతంత్ర రాజ్యాలు పత్తిధరపై వ్యవసాయ దార్లకు బోనాలిచ్చి, మార్కెటింగు సదుపాయాలు కల్పించి, ఇంకా ఎన్నో పద్ధతులవలం బించి, వివిధ సరకుల ధరల్ని కాపాడుతోంటే, మన ప్రభుత్వానికి మాత్రం మనమీద సవతి తల్లి ప్రేమ!

మరొక విషయం, గత సంవత్సరంలో మన దిగుమతుల కంటె ఎగుమతుల విలువ రూ 52 కోట్లు ఎక్కువ అయిఉండగా 1937—38 లో రూ 16 కోట్లు మాత్రమే! దీని అర్థం మనం యిదివరకు కంటె దిగుమతుల మీద ఎక్కువ ఆధారపడి యున్నాం అన్నమాట.

దేశంలో పరరాజుల పెత్తనం సాగుతూన్నంతకాలం, అంటే పన్నుల విధానం—ఎగుమతి దిగుమతి సుంకముల పద్ధతి—మారకపు రేటు—ఋణముల పద్ధతి యిప్పటి మాదిరిగానే విదేశ ప్రభుత్వానికి ఊతగా ఉంటూన్నంత కాలం, మన రైతులకుగాని—కార్మికులకుగాని, దేశీయ వ్యాపారానికిగాని, మోక్షం ఉండదు. ఆర్థికంగా దేశం అభివృద్ధి చెందాలంటే, పోవాలి పర ప్రభుత్వం!

మదరాసులో మిలిటరీ శిక్షణ

మదరాసు రాజధానిలో, ప్రతి కాలేజీ విద్యార్థికీ, అభిలషించే ప్రతి పౌరునికీ, ప్రభుత్వం ఉచితముగా మిలిటరీ శిక్షణ ఈయాలంటూ మదరాసు ఎసంబ్లీలో వి. యం. రామస్వామి మొదల్యార్‌గారు తీర్మానం ఒకటి ప్రతిపాదించారు. చర్చ ప్రారంభమయింది. కాంగ్రెస్ శాసనసభ్యులలోనే భేదాభిప్రాయాలు ప్రకటితమయ్యాయి. గద్దె రంగయ్యనాయ్డు, బయ్యా సూర్యనారాయణమూర్తి గారలు, ఇతర కాంగ్రెసు సభ్యులు, ఈ తీర్మానంలో అహింసా సిద్ధాంతానికి విరుద్ధమైనదేదీ లేదని ఉత్సాహపూరితమైన ఉపన్యాసాలిచ్చారు. కాని, యస్. యస్. వరదాచారి గారివంటి పార్లమెంటరీ కార్యదర్శులు, యీ తీర్మానంవల్ల అహింసా సిద్ధాంతం మంట కలుస్తుందని వాదించారు. ప్రధాన మంత్రి రాజాజీకి మాత్రం తీర్మానములో ఆక్షేపణ యేమీ కనపడలేదు.

ఇంచుమించు 20 సంవత్సరాల అనుభవము సంపాదించిన మన హేమా హేమీ లంతా, అహింసా సిద్ధాంతం అంటే ఎంత చక్కగా అర్థం చేసుకున్నారో ఆరోజున ఈయబడ్డ భేదాభిప్రాయాన్ని బట్టి తెలుసుకోవచ్చు.

దేవాలయ ప్రవేశ బిల్లు దిగజారిపోయింది!

మొట్టమొదట మన రాజగోపాలాచారిగారు ఎసంబ్లీలో ప్రవేశపెట్టిన మలబార్ దేవాలయ ప్రవేశ బిల్లులో ఎన్నో లోపాలు, జరగవలసిన మార్పులు, ఉన్నాయి, తరువాత సెలక్టు కమిటీ వారు యీ బిల్లును యింకా దిగజారవేశారు, వీరి సవరణంతో బిల్లు ప్యాసయింది. దీని ప్రకారం, మలబార్‌లోని ప్రయివేటు దేవాలయాలకు యిది వర్తించదట. అంటే, 100కి సుమారు ముప్పాతికవంతు దేవాలయాలలో హరిజన ప్రవేశానికి వీలుండదన్నమాట. మరో విషయం. సవర్ణుల అందరి అభిప్రాయం తెలుసుకొనుటకు వోటింగు పెట్టేముందు ప్రభుత్వం అనుమతి యివ్వాలి. తీర్మానాన్ని ఆచరణలో పెట్టడానికి ముందు, మళ్ళీ, ప్రభుత్వం అంగీకరించాలి. ఇన్ని కట్టుదిట్టాలతో బిల్లు ప్యాసయింది. సనాతనుల గందరగోళం చాలావరకు అణగిపోయింది.

కాని, హరిజనులకు మాత్రం బిల్లు ముక్కాలి ఆశాభంగం కలిగిస్తోంది.

అస్సాం మంత్రివర్గానికి గండం తప్పింది.

అస్సాం శాసనసభలో, యూరపియన్ మెంబర్ల సహాయం తీసుకొని, కాంగ్రెసు మిశ్రమ మంత్రివర్గం మీద కాంగ్రెస్ ప్రతిపక్షము ప్రతిపాదించిన విశ్వాస రాహిత్య తీర్మానం ఓడిపోయింది. మంత్రివర్గానికి గండం తప్పింది. మంత్రివర్గం కొద్ది మెజారిటీతో గెల్చినా, కాంగ్రెసు ప్రణాళికను ధైర్యంగా అమల్లో పెట్టడానికి పూనుకుంది. రాష్ట్రంలో ఉన్న రాజకీయ ఖైదీలందర్నీ విడుదల చేయడానికి ఆర్డర్లు పంపించారు. పక్కనే ఉన్న బెంగాల్ మంత్రివర్గాన్ని ఈ విధంగా 'ఛాలెంజ్' చేశారు.

కాని, నూటికి నూరుమంది కాంగ్రెసు మంత్రులున్న చోట కూడ కొత్త రాజకీయ ఖైదీలు ఉన్నారు. బీహార్ రాష్ట్రంలో, హరినగర్ పంచదార మిల్లు సమ్మె సందర్భంలో, ప్రభుత్వము సుమారు 134 మందిని అనేకమంది సోషలిస్టులతో సహా, ఎరస్టు చేయించింది. బొంబాయి రాష్ట్రంలో, 128 అహమ్మదాబాదు అచ్చు పనివారిని, పికెటింగు చేసినందుకు, ఎరస్టు చేసి శిక్షించారు.

కాంగ్రెస్ రాష్ట్రాలలోనే యీ విధంగా ప్రజా సేవకులపై ఎరస్టులు శిక్షలు జరుగుతోంటే, బెంగాల్ మంత్రివర్గం దత్తు మజుందారు, శివనాథ బెనర్జీలవంటి కార్మిక నాయకుల్ని ఎరస్టు చేయడంలో ఆశ్చర్యం ఏముంది? ఢిల్లీ చెరసాలలో 1932 నుంచీ బంధించబడియున్న రాజకీయ ఖైదీలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయుటకు బహిరంగముగ నిరాకరించడంలో అబ్బురం ఏముంది?

కట్టమంచివారి కాంగ్రెసు అభిమానం.

కాంగ్రెసు కమిటీవారు ఆరోజున తనను ఎసంబ్లీఅభ్యర్థిగా సెలక్టుచేయనందుకు కాంగ్రెస్ సంస్థ నుంచి రాజీనామా యిచ్చిన కట్టమంచి రామలింగారెడ్డిగారు (ఆంధ్ర విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సెలర్) యీరోజున కాంగ్రెసు మంత్రుల్నీ, కాంగ్రెసునూ, ఆకాశంపైకి ఎత్తివేస్తున్నారు. నాగపూరులో ఈయన ఉపన్యాసము ఇస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వాలతో పోల్చదగిన ప్రజాప్రభుత్వం ప్రపంచంలో మరెక్కడా లేదనీ, ముఖ్యంగా రాజగోపాలాచారి గారి పాలనవిధానం మిక్కిలి ప్రశంసనీయమనీ, స్తోత్రం చేశారు.

ఔను, తన విశ్వవిద్యాలయంలో విద్యార్థుల మీద ఈయన ప్రయోగిస్తున్న ఆర్డినెన్సులకూ, నిరంకుశ పద్ధతులకూ, రాజగోపాలాచారి గారు కిక్కురుమనకుండా, గప్‌చిప్ మని మౌనముద్ర వహిస్తోంటే, స్తోత్రం చేయక ఏమి చేస్తారు? వాటి ప్రకారం, రాజకీయ సభలకు విద్యార్థులు పోవడం కూడదని కాలేజి ప్రిన్సిపాల్ నిషేధించవచ్చు, ప్రభుత్వము చేత గుర్తింపబడని ఏ సంస్థలలోను విద్యార్థులు, సభ్యులుగా చేరరాదు. విద్యార్థులు వీటిని తిరస్కరిస్తే జుల్మానా, అడ్మిషను నష్టం, సర్టిఫికేట్లు రద్దు, సస్పెన్షన్, వెళ్ళగొట్టడం — యీ శిక్షలు విధించవచ్చు. సమ్మెలలో పాల్గొన్న విద్యార్థుల ఉపకార వేతనాలు రద్దు చేయబడతాయి.

ఈ ఆర్డినెన్సులు సెనేట్ సభలో చర్చకు వచ్చినప్పుడు, యిద్దరుతప్ప మిగిలిన కాంగ్రెస్ సభ్యులంతా కట్టమంచి వారికి వోటుచేశారు.

ఇట్టి పరిస్థితుల్లో, కాంగ్రెస్ అంటే ఆయనకు అభిమానం ఉండదూ?

రాజాజీ, సుభాష్‌బోసులు

ఇండియా సహాయ కార్యదర్శి కలనల్‌మూర్‌హెడ్ మదరాసు వచ్చినప్పుడు, అతనికీ మంత్రులకూ మధ్య ఫెడరేషన్ సమస్యను గురించి చర్చలేమైనా జరిగినాయా అని మదరాసు ఎసంబ్లీలో హుస్సేన్‌గారడిగిన ప్రశ్నకు జవాబిస్తూ "ఆ ప్రశ్నకు నేను జవాబు చెప్పజాలన"ని మన కాంగ్రెసు ప్రధాని రాజాజీ చెప్పాడు.


కాంగ్రెసు అధ్యక్షుడైన సుభాష్‌బోసును మూర్ హెడ్ కలకత్తాలో కలుసుకొన్నప్పుడు, ఫెడరేషన్‌ను గురించి సుమారు ఒక గంటసేపు చర్చ జరిగిందనీ, ఆచర్చలో తాను స్పష్టంగా కాంగ్రెసు దృక్పథాన్ని వివరిస్తూ, ఫెడరేషన్‌వస్తే భారతీయులు ప్రతిఘటిస్తారనీ, చెప్పినట్లు బోసు పత్రికా విలేఖరులకు తెలియజేశాడు.

ఇంతే భేదం, రాజాజీకి—సుభాష్ బోసుకూ!

హెచ్చరిక

ఆంధ్రరాష్ట్ర ప్రెస్ వర్కర్సు యూనియన్ మహాసభలో చేసిన తీర్మానము ప్రకారము స్థానిక ప్రెస్ వర్కర్ల నందరను రాష్ట్ర సంఘములో సభ్యులుగా చేర్పుటకుగాను రశీదు పుస్తకములు అన్ని స్థానిక యూనియన్‌లకు పంపబడినవి. ఈ నెలాఖరు లోపల చేర్చాలిసిన గడువు. గాన సాధ్యమైనంత త్వరలో స్థానిక యూనియన్‌లు పనిచేసి విరివిగా సభ్యులను చేర్చి సభ్యత్వ రుసుముతో సహా జనవరి మొదటి వారంలో రాష్ట్ర యూనియన్ ఆఫీసుకు పంపవలెనని తెలియచేయు చున్నాము.

ఇట్లు
మున్నంగి మల్లిఖార్జునరెడ్డి,
సహాయ కార్యదర్శి.



14—12—38 బుధవారం

స్వవిషయం

నవశక్తికి సంవత్సరము నిండింది. రెండవ సంవత్సరము ఈ సంచికతో ఆరంభమయింది. అందుచే ఒక పర్యాయము గతాన్ని సింహావలోకనం చేస్తామంటాం. మొదట ఆరు నెలలు పత్రికలో స్త్రీ సమస్యలనుగూర్చి, విద్యార్థి పోరాటాలనుగూర్చి, కార్మిక కర్షక సమస్యలనుగూర్చి వ్యాసాలు మాత్రమే వేయగలిగాము. విదేశాలలోని పరిస్థితులను గూర్చి, అందునూ ముఖ్యంగా రష్యా, స్పెయిను, చైనా, జపానుల గూర్చి వ్యాసాలు ప్రజలకు అందచేయ గలిగాము. పత్రిక ఆరంభమునుండి కూడ "నేటి ప్రపంచము" ఏలా వారానికి వారానికి పరిణామము చెందుతూ ఉందీ తెలియజేయడానికి ప్రత్యేక కృషిచేసి సఫలీ కృతులమయ్యాము. కాని వివిధ రంగాలలో జరుగుతూ ఉన్న పోరాటాలనుగాని, దేశములోని రాజకీయ వాతావరణమును ఘటనలను సమగ్రంగా నవశక్తిలో ప్రతిబింబింపజేయలేక పోయాము. దీనికి కారణము చాలినంత స్థలములేక పోవడమే. అందుచే 16 పుటలనుండి 24 పుటలవరకు పత్రికను వృద్ధి చేశాము.

"కార్మిక సమస్యలు" "రైతులోకం" "మనరాజకీయాలు" "నేటి ప్రపంచం" అనే శీర్షికల క్రింద ప్రతి వారము జరిగే ఘటనలు, పోరాటాలన్నీ క్రోడీకరించబడుతున్నాయి. ప్రతి విషయ మందునూ పార్టీ దృక్పథమును తెలియజేస్తూ చిన్న కామెంటుకూడ మిళితమై ఉంటూ ఉంది. వివిధ సంఘ వార్తల కొక పుట, వివిధ ప్రజా సామాన్యము తమ కష్టాలను తెలుపుకుంటూ వ్రాసిన లేఖలకు ఒక పుట ఇస్తూ ఉన్నాము. కాని కార్మిక కర్షక పోరాటాలను గూర్చి, సమస్యలను గూర్చిన ప్రత్యేక వ్యాసాలు, ఘటనలకు తగినన్ని ప్రకటించబడలేదనియే చెప్పాలి. వివిధ రంగాలలో పనిచేసేవారు అచ్చటి పోరాటాలనుగూర్చి వ్యాసాలు రిపోర్టులు మునుపటికన్న చాల ఎక్కువగా పంపినచో ఈ లోపములు తొలిగించడము సాధ్యపడుతుంది.

విద్యార్థి సమస్యలను గూర్చి గత ఆరు మాసాలలోను నెల కొక వ్యాసము వంతున ప్రకటించ గలిగాము. కాని స్త్రీ యుద్యమమును గురించిగాని, స్త్రీ సమస్యలను గూర్చిగాని ఏమీ ప్రకటించలేదనియే చెప్పాలి. స్వదేశ సంస్థానాలలో ప్రజా పోరాటము విజృంభించే కొలదీ ప్రతి వారం ఒకటి రెండు పుటలు, దానిని వివరించడానికి ప్రత్యేకించ బడినాయి. గత ఆరు మాసాలలో కథను తప్పిపోకుండా వేస్తూ వచ్చాము. గ్రంథావలోకనములోని విమర్శనలలో కొంతవరకు పుస్తకాలలోని వర్గ దృక్పథమునుకూడ తెలియజేయడానికి ప్రయత్నించాము.

సమకాలిక ఘటనలను గూర్చిన వ్యాసాలు, రాజకీయ వ్యాసాలు కొద్దిగానే వేయగలిగాము. ఇట్టి వ్యాసాలు ఇంకా చాల కావాలి. కాని ప్రజా రంగాలలో పని చేసేవారు వారి వారి అనుభవాలనుగూర్చి తెలియచేయనంత కాలమూ, వ్యాసాలు వ్రాయనంత కాలమూ, ఈ లోటును తొలిగించలేము. వ్యాస కర్తలు అఖిల భారత రాజకీయ ఘటనలు, నాయకుల సంభాషణలు, అంతర్జాతీయ మార్పులవల్ల తమ తమ ప్రాంతాలలో ఎట్టి ఫలితాలు గలిగిందీ, స్థానిక రాజకీయ వాతావరణము ఎలా మారిందీ, వివిధ స్థానిక రాజకీయ నాయకులు, పక్షాలు ఒక్కొక్క సమస్యను ఏవిధంగా పరిష్కరిస్తున్నదీ, వివిధ రంగాలలో తమ తమ అనుభవాలనుగూర్చి వ్రాస్తే ఉద్యమానికి, పత్రికకు చాల ఉపయోగకరంగా ఉంటుంది.

పత్రికను మరింత ఆకర్షణంతముగా చేయడానికి వీరుల చరిత్ర లివ్వడానికి ప్రయత్నించాము. కాని విఫలుల మయ్యాము. వార్తాలహరి అని, రాజకీయేతర విషయాలను క్రోడీకరింపడానికి ప్రయత్నించాము. స్థలాభావముచే దీనిని తరచు విడిచివేయవలసి వచ్చింది. సమగ్రంగా రష్యాను గూర్చి తెలియపరుస్తూ రష్యా సంచికను ప్రకటించ గలిగాము.

వ్యక్తుల ఫొటోలు చాల వేస్తున్నాము. కాని ప్రజా సంరంభములయొక్కగాని, ప్రజా పోరాటాలయొక్క దృశ్యాలనుగాని వేయడములేదు. వేసినవికూడ ఇతర రాష్ట్రాలవేగాని మన రాష్ట్రానివిగావు. అట్లే కార్టూనులనుకూడ నవశక్తిలో తృప్తికరంగా వేయలేము. వేసిన కార్టూనులన్నా విదేశ రాజకీయాలపైనగాని లేక అఖిల భారత, సమస్యలపైనగాని ఇతర పత్రికలనుండి సేకరించినవే. ఆంధ్ర సమస్యలపై కార్టూనులను ప్రకటించాలి. మ్యాపులుకూడ వేయవలసినది. కాని వేయలేకపోయాము. ఈ లోపము అంతర్జాతీయ వ్యాసాలలో మరింత ఎక్కువగా కన్పడుతూ ఉంది. విదేశ పటములువేయక విదేశ రాజకీయాలనుగూర్చి వ్రాయడము వల్ల పాఠకులకు పూర్తిగ లాభము చేకూరకున్నది.

పార్టీ పత్రిక ప్రజా పోరాటాలకు, ఆందోళనకు అంకురార్పణ వేయాలి. వానిని ప్రతిబింబింప జేయాలి. పెంపొందించాలి. నడపాలి. పార్టీ పత్రికకు ఉండవలసిన ఈ ప్రధాన లక్ష్యము నవశక్తికి వచ్చినదా అంటే ఇంకనూ రాలేదనియే చెప్పాలి. కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణ వగయిరాలపై డిసిప్లినరీ చర్యల సందర్భమునా, కొంతవరకు కాశీపట్టణ రైతు సమస్య, పౌరసత్వ హక్కుల సమస్యపైనా తప్ప మరెట్టి ఆందోళనకు గాని, పోరాటానికి గాని అంకురార్పణ వేయలేము. పెంపొందించనూ లేము. పార్టీ సరిగా పనిచేయనంతకాలము, చేసిననూ రిపోర్టులు పత్రికకు తప్పక పంపనంతకాలమూ, పార్టీ పత్రికలోని ఈ లోపాన్ని సవరించడము అసంభవము. ఆఫీసులో నుండి ఆందోళన తయారు చేయలేము.

పార్టీ పత్రికకు వ్యాసాలు, రిపోర్టులు పంపడమేగాక దానిపై విమర్శనలుకూడ రెగ్యులరుగా పంపించవలసినదని పాఠకులను కోరుచున్నాము. ఎప్పుడో ఒకనాడు విమర్శన పంపించిన చాలదు. ప్రతి వారమూ, ప్రతి వ్యాసమూ, విమర్శన చేస్తూ తప్పు ఒప్పులు చూపించవలసినదిగా పాఠకులను కోరుచున్నాము.

నవశక్తి ఒక దినపత్రిక వలె, న్యూస్ పేపరుగా (వార్తలను తెలియజేసే పత్రికగా) ఉండవలసి వస్తూ ఉంది. లేనిచో దిన పత్రికను చదువని గ్రామస్థులకు ఎక్కువగా రుచించడము లేదు. అందుచే వ్యాపకము తగ్గుతుంది. నవశక్తి కేవలం వార్తాపత్రికగా ఉండజాలదు. కేవలము కార్మికుల పత్రికగా ఉండజాలదు. కేవలము రైతు పత్రికగా ఉండజాలదు. ఈ మూడు పత్రిక లక్షణాలు కల్గి, పార్టీ పత్రికగా కూడ ఉండవలసి వస్తున్నది.

స్థానిక, జాతీయ, అంతర్జాతీయ కార్మిక వార్తలను సమగ్రంగా గాని లేక ప్రాధాన్యంగా గాని ఇస్తూ రాజకీయ చైతన్యాన్ని మరాటీలో వెలువడే కార్మిక పత్రిక 'క్రాంతి'వలె కలుగజేయవచ్చు. అదేవిధంగా రైతు వార్తలను సమగ్రంగా గాని లేక ప్రాధాన్యంగా గాని ఇస్తూ, రాజకీయ చైతన్యాన్ని హిందీలోని "జనతా" వలె కలుగ జేయవచ్చు. లేదా, కార్మిక కర్షక ప్రధాన పోరాటాలను మాత్రము వర్ణిస్తూ ఇంగ్లీషులోని 'నేషనల్ ఫ్రంటు,' హిందీలోని 'నయాహిందూస్తాన్' పత్రికలవలె రాజకీయ చైతన్యానికి ప్రయత్నించవచ్చు. కాని కార్మిక కర్షక వార్తల రెంటిని వార్తాపత్రికవలె సమగ్రంగా ఇస్తూ, రాజకీయ వ్యాసాలు కూడ విరివిగా ఉండాలంటే ఒక వారపత్రికకు అలవి కాని పని. 'నేషనల్ ఫ్రంటు'లో లాంటి వ్యాసాలే వారపత్రికకు ఆదర్శం. కాని కేవలము 'నేషనల్ ఫ్రంటు'ను అనుసరిస్తే నేటి ఆంధ్ర రాజకీయ చైతన్యాన్ని పోషించుకో జాలదు.

అందుచే నవశక్తి, ఒక వారపత్రికకు అలవికాని పనిని చేయవలసి వస్తున్నది. గత సంవత్సరము ఈ ప్రయత్నమునకై 16 పుటలనుండి 24 పుటలు చేశాము. కాని ఈ ప్రయత్నములో సఫలీ కృతులము కావాలన్నా 32 పుటలు చేయలసి ఉంటుంది. గత సంవత్సరము 8500 రూపాయలు నవశక్తికి ఖర్చయింది. గత సంవత్సరము పత్రికాభి వృద్ధికి సాయపడిన వారందరికి మా కృతజ్ఞత తెల్పుతూ ఈ సంవత్సరముకూడ వారు మునుపటివలె సాయము చేయుటయేగాక పత్రిక తన ఆదర్శాన్ని చేరగల్గుటకు కావలసిన మరింత హెచ్చు సాయమునుకూడ పాఠకులు, పార్టీ సభ్యులు చేయుదురని ఆశిస్తు పాఠక లోకానికి ఈనూతన సంవత్సర అభివందనాలు అందజేస్తున్నాం!



ఈనాందార్ల దౌర్జన్యాలు

శ్రీపాద జగన్నాథరావుగారు (ఒక కాంగ్రెస్ ప్రచారకుడు) జాడువ (ఉ. విశాఖపట్నం జిల్లా) నుంచి యీ క్రింది విషయాలు మాకు తెలియజేశారు:

మదరాసు జమీందారీ విచారణ సంఘము వారు తమ రిపోర్టును ప్రకటించినందుకు ధన్యవాదములు. కాని, ఆ రిపోర్టులో ఒక్క జమీందారీ రైతులకే కొత్తచట్టము వర్తించేటట్టుగా సూచించ బడింది. ఈనాం రైతులు ఇందులో చేర్చబడలేదు. ఇది చాలా అన్యాయం. రైతులను చీల్చి సంఘములను చెడగొట్టుటలోను, దావాలు—జప్తులుచేసి రైతులనుబాధించుటలోను, అనేక దుండగాలు చేయుటలోను, ఈనాందార్లు జమీందార్లకు తీసిపోరన్న సంగతి విచారణ సంఘంవారికి తెలియకపోదు.

లోగడ నా ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనందున, శ్రీకాకుళంలో ప్లీడర్ ప్రాక్టీసు చేయుచున్న మా బావగారి యింటికి వెళ్ళితిని. కోర్టు పనులపై వారి యింటికి అప్పుడప్పుడు యీనాందారీ రైతులు వస్తూ—పోతూ ఉండేవారు. వారి కష్టసుఖములు తెలుసుకొనుచూ ఉండేవాణ్ణి, వారి స్వగ్రామాలకుపోయి అప్పుడప్పుడు వారికి సలహా యిచ్చుచుండేవాడిని. ఆవిధముగా నా మనస్సుకు కొంత తృప్తి కలిగేది. 28-11-38 వ తేదీ రాత్రి సుమారు 8 గంటలకు, పై గ్రామములకు చెందిన కొందరు యీనాందార్లు వారితో కొందరు సహచరులు (1. పారేపాక వెంకట జగన్నాథంగారు 2. శ్రీపాద గోపాలకృష్ణమ్మగారు 3. కన్నేపల్లి చినవెంకట చలమయ్యశాస్త్రిగారు 4. ఏలేశ్వరం రామమూర్తిగారు) కలిసివచ్చి, మా బావగారి యింటివద్ద నాతో తీవ్రమైన ఘర్షణకు దిగినారు. మా రైతులప్పుడ దావాలుచేస్తే నీకెందుకు, యికపైని అట్టి ప్రసంగంగాని ప్రచారంగాని చేస్తే జాగ్రత్త! అని నన్ను బెదిరించినారు. "ఈ వెధవకు తినుటకు తిండిలేదు; ఈలాంటి వెధవలు దేశసేవచేస్తారా? ఇక్కడే నాలుగు తన్నితే, యీవెధవ ఏమిచేస్తాడు?" అని ఏలేశ్వరం రామమూర్తిగారు కుర్చీమీద కూర్చున్న నామెడమీద చెయ్యివేసి తోసివేసిరి. నేను ఆదుకోకుంటే నెత్తురువచ్చే దెబ్బ తగిలి యుండేది. "ప్రకాశంగారు యీనాందార్ల మాట వినేటట్లు చేసుకుంటాం. ముష్టివెధవలు మీ మాటల్ని విననియ్యము" అని సా॥ జ॥ (సారెపాక జగన్నాధంగారు) పలికారు. వ్రాయుటకు వీలులేని మాటలు, దూషణ ప్రారంభించారు.

ఇంతలో మా బావగారు (గొర్తి లక్ష్మీనరసింహం) వచ్చి యుండకపోతే, ఏమి జరిగి యుండేదో!

29-11-38 ఉదయమే ప్లీడరుగారిని నష్టపెట్టడం యిష్టంలేక, నా యిష్టంవచ్చిన చోటికి వెళ్ళుతానని చెప్పి నేను వెళ్ళిపోయాను.

తుపాను భీభత్సం.

భీమవరం తాలూకాలో సాగు అవుతున్న మొత్తం భూమి 1,67,061 యకరములు. గవర్నమెంటుకు రూ. 9,09,662 లు సాలీనా పనూలు అగుచున్నది. గత మాసం, 25, 26 తేదీలలో జరిగిన తుపాను భీభత్సం వల్ల, తాలూకా మొత్తం మీద ఈ క్రింది విధంగా నష్టం వచ్చినది.

41,615 యకరములలోని సస్యం కోసిన పన మురుగువల్ల చాలా భాగం కొట్టుకుపోయి, నిల్వ ఉన్న సస్యం కుళ్ళిపోయినది. నూటికి నూరు నష్టం, అనగా, రూ. 20,80,750 ల నష్టం.

31,209 యకరములలోని సస్యం కుప్పల మీద ఉండగా నీటి ముంపువల్ల చాలాభాగము (నూటికి 50 వంతులు) నష్టపోయింది. నష్టం విలువ, రూ. 6,24,225 లు.

83,230 యకరములలోని సస్యము, కోయకుండా నిల్వ ఉన్నది (100 కి 75 వంతు) నష్టం రూ. 24,96,900 లు.

360 యకరముల అరటి తోటలకు 100కి 100 నష్టం, అనగా, రూ. 1,05,000.

250 యకరముల చెరకు తోటలకు నూటికి 10 వంతుల నష్టం, రూ. 12,500 లు.

3000 బస్తా జనుము, బస్తా 1కి రూ. 20—0—0 ల చొప్పున నష్టం, రూ. 60,000.

5,000 పశువులకు, పశువు 1కి రూ. 25 ల చొప్పున నష్టం, రూ. 1,25,000.

10,000 గొర్రెలకు, గొర్రె 1కి రూ. 4 ల చొప్పున, నష్టం రూ. 40,000 లు.

10,000 యిండ్లకు మొత్తం సుమారు రూ. 68 లక్షల రూపాయల నష్టం.

ఈ విధంగా, నష్టపడిన అన్ని తాలూకాలలో లెక్కలు తయారుచేసి, ప్రభుత్వానికి పంపవలసి యుంటుంది. రెమిషన్ల కొరకు, ప్రభుత్వ ఋణముల కొరకు, ఆందోళన సాగించాలి.

సహకార బ్యాంకుల కర్తవ్యము.

శ్రీ కిడాంబి వెంకట కృష్ణమాచార్యులు గారు యీ విధంగా వ్రాయుచున్నారు:

యీమధ్య నవంబరు 25, 26 తేదీల్లోని ప్రకృతియొక్క ప్రళయ తాండవంవల్ల సస్యాలు తుడిచిపెట్టుకు పోవడం, పేదల గుడిశెలు గాలి దేముడు ఎత్తుకువెళ్ళడం, 1939 సంవత్సరానికి మానవులకి తినడానికి గింజలూ, పశువులకిగడ్డి లేకుండా పోవడం, జరిగింది. రైతుకి ప్రాణతుల్యమైన వ్యవసాయానికి ఆయువుపట్టయిన పశుగణము కొంత పరలోకానికి వెళ్ళాయి, మొత్తముమీద భీభత్సం చేసేశింది. మనుష్యులనికూడా కొంచెంగా బలి తీసుకుంది. యిల్లా వున్నప్పుడు, రైతు బ్యాంకులకి కట్టవలసిన బాకీలు ఏంకటతాడు? సర్కారుకు పన్ను ఎలా కడతాడు? బ్రతికున్న పశువులని ఎట్లా పెంచుతాడు? తాను ఏం తింటాడు? తుపాను తాకిడీ తిన్న ప్రదేశాల్లో పన్ను పూర్తిగా ప్రభుత్వము రిమీషను యివ్వాలె, బ్యాంకుల అప్పు వాయిదాలు యీ సాలుతో చెల్లింపాలసినవి, వాయిదా పొడిగించాలె. రెండవ పంట సాగు తుపాను ప్రవేశానికి మంజూరు చేయాలె. యీ సాలు వ్యవసాయానికి, గృహకృత్యానికి, పెట్టుబడి విధిగా బ్యాంకులు పెట్టితీరాలి. యీ కష్ట సమయములో, మా భీమవరం తాలూకాలో భూమి తనఖా బ్యాంకి కార్యదర్శి డాక్టరు శర్మగారూ, లోకల్ కో ఆపరేటివ్ యూనియన్ కార్యదర్శి రామమూర్తి రాజుగారూ, బ్యాంకులకి ఈ సాలు వాయిదాలు విధిగా పొడిగించి తీరాలె అని, పెట్టుబడికి తిరిగి డబ్బు సరఫరా చేయాలనీ, ప్రయత్నించడం ముదావహము, యీ విషయములో ప్రభుత్వం కూడా తగిన సహాయము చేయాలె కేవలము సహకార బ్యాంకుల అప్పుల వాయిదాలు పొడిగించటం, తిరిగి పెట్టుబడులు యివ్వటమే కాకుండా, తమ తమ బ్యాంకుల్లో, సంఘాల్లో, వున్న సాముదాయక నిధిని పూర్తిగా రిలీఫ్ కమిటీలకు యిచ్చి ప్రజలకు తోడ్పడాలి. రైతు, కాంగ్రెసు యువజన, సామ్యవాద సంఘాలు యిందు విషయంలో తీవ్రాందోళన జరపాలె. అని కోరుతున్నాను.

తుపాను నష్టం.

దివి తాలూకా రైతు సంఘం తరపున, చల్లపల్లి నుంచి, సంఘాధ్యక్ష, కార్యదర్శులు ఈ క్రింది ప్రకటన చేయుచున్నారు:—

గాలివాన నష్టమును పరికించుటకు మా తాలూకాలో సముద్రతీరము వెంట సంచారము జేసితిమి. సముద్రతీరమున మన్న గ్రామములలోని ఇండ్లన్నియు నేలమట్టమగుటయే గాక, పంటలు పాడగుటయు; సముద్రతీరమున నివసించుచూ, గొర్రెలే జీవనముగా గల రైతులు వేనకువేలు గలరు; ఈ గాలివాన కేవలమూ వారి జీవనోపాయముల నశింపజేయుటకై వచ్చినదా యనునట్లు కనుపించినది. మేము ఈ గాలివాన నష్టమును పరికించుటకై తాలూకాలో నున్న గ్రామములకు పోవ, అటనున్న ఊళ్ళకు రోడ్లులేవు సరికదా, చుట్టూ పర్రలు, అవి దాటుటకు రెండు మైళ్లలోపుగా నీటితో నిండిన బురదలో నడక, మధ్య ఉప్పెన గాలి గుండములు, అవిదాటి ఊరిలోకి తినుట కన్నము సహితములేని సోదరులు మా కన్నము పెట్టుటకై వారుపడ్డ పశ్చాత్తాపమునకు కంట నీరు ప్రవహించక తప్పదు. ఇట్టి దురవస్థలో నున్న మాసోదరుల ఇండ్లు, పశువులు, గొర్రెలు చనిపోవుట చూచి లెక్కింప, 2000 యిళ్లు, 4000 పశువులు, 3500 గొర్రెలు, సముద్రతీర సోదరులవి చచ్చినవి. పాడు మార్గములను రహదారిగా మార్చుటకు అనువైన రోడ్లు, సముద్రపు వైపున అనకట్ట మురుగు వసతిని, కలిగించు వరకూ రైతు, కాంగ్రెస్, యువజన, సోషలిస్టు సంఘముల ద్వారా ఆందోళన జరి ఈ జలెంతు నుద్ధరింపుడని జిల్లాలోని సోదరులను కోరుచున్నాము.

ఆత్మకూరు తాలూకాలో రైతు ప్రచారం.

శ్రీ గంగా కొండయ్యగారు వాసిలి గ్రామం నుంచి ఈ విధంగా వ్రాస్తున్నారు:—

కోవూరు తాలూకా రైతు సంఘాధ్యక్షుడున్నూ, నేనున్నూ కలసి 1—12—38 నుండి ఆత్మకూరు తాలూకా (నెల్లూరు జిల్లా)లో వీర్లగుడిపాడు, కప్పురుపాడు, కొండమూడు, జంగాలదర్పి, పెరమన, అప్పారావుపాలెం, బిస్తేపాడు, సలపరెడ్డిపల్లె, ముదుగుళ్ళ, దేపూరు, నాగులపాడు, యడవల్లి, సుబ్బారావుపాడు, కోలగొట్ల, ఈ గ్రామాదులు తిరిగి, స్థానికంగా రైతులకు, కూలీలకు ఉంటున్న యిబ్బందులు యేలావున్నాయో అవి ఏవిధంగా యిద్దరు కలసి, ఒకరికొకరు ద్రోహం చేసికొనక, పోగొట్టుకోవలెనో చెప్పి, రైతు సంఘాలు కూలీ సంఘాలు, పెట్టుకొని వాటి ద్వారా యిద్దరి యొక్క ఆర్థిక చిక్కులను ఏ విధంగా పోగొట్టుకొనవలెనో, ప్రబోధించితిమి. రెవిన్యూ మంత్రిగారి జమీన్దా రైతు బిల్లును, నవశక్తి సవరణలతోటి, ది 28—11—38 నుంచి అమలు జరుగునట్లు అందరూ కోరుచున్నారు. 2, 3, గ్రామాదులు తప్ప తక్కిన గ్రామాదులలో నీటి వసతులు లేక పైర్లు ఎండిపోవుచున్నవి. రోడ్లుగాని, దొంకగాని, స్కూలుగాని, వైద్య సహాయంగాని, లేక ప్రజలు యిబ్బంది పడుచున్నారు. కొద్ది ఖర్చుతో పెన్నలోనుంచి కాలువ తీసిన, అన్ని గ్రామాదులకు యెక్కువ నీటి వసతి కలుగును.

లంచపు కేసులు.

బెజవాడ తహస్సీలు దారుగారు పుల్లూరు గ్రామకరణం గారిపై రైతులు పెట్టిన కేసును సుమారు నాలుగు మాసముల నుంచి పెండింగులో వుంచి, వాయిదాలపై వాయిదాలు వైచుచున్నారు. ఇది వరికోతలు కోసుకొను కాలము, పుగతోటల తరుణము. రైతుకు తీరని పని ఉన్న యీ కాలములో దాదాపు గ్రామమందరి, వద్దనుంచియు ప్రత్యేక స్టేటుమెంటులు అందినసూ, లోగడ మోతుబరు సాక్ష్యములను విచారించియు, యింకనూ పర్యవసానము తేల్చుటకు అలక్ష్యం జరుగుచున్నది. లోగడ ప్రచురపరచిన గవర్నమెంటు ఉత్తరువు ప్రకారం, ప్రజావాదుక పైన, తగు సాక్ష్యము లేకున్ననూ, లంచగొండి యని నిర్ధారణ చేయవలయునని చెప్పుచున్నది. తిరిగి 29-11-38 తేదీ ప్రధాన మంత్రిగారు ప్రశ్న పరంపరకు జవాబొసగుచూ, సంబంధం లేని పెద్దమనుష్యులు నడవడికను రుజువు పరచినచో లంచగొండిని శిక్షించవలెనని హెచ్చరించినారు. కాని పైమోపబడిన కరణముగారి లంచపు కేసు ఇంకనూ విచారణలోనేయున్నది.

మైలవరం రెవెన్యూ యినస్పెక్టరుగారిపై నందిగాం హరిజనులు పెట్టిన కేసు కూడా యీ విధంగానే పెండింగులో యున్నది.

(ఒక విలేఖరి)

★ ఫిర్యాదులు ★

పెక్కలి పంచాయితీబోర్డు—కంద్రజాతివారి కష్టాలు

పెక్కలి గ్రామంలో సుమారు రెండు వేల మంది కంద్రజాతివా రున్నారు. వీరు ఎల్లప్పుడూ పదిమైళ్ళ దూరము నున్న సముద్రతీరం నుండి వల్లెకావులనుండి చేపలుకొని కావిళ్ళతో మోసి తెచ్చి అమ్ముకొని జీవయాత్ర గడుపుతారు. నీరు పేదవారగుటచే ఇంటిపన్ను లే కట్టుకోలేని స్థితిలో వున్నారు. వీరింక్సువుూస్తే పంటలగుడి సెలతన్నా అన్నాహ్నము. వీరికి చేపల వ్యాపారమువల్ల వచ్చే లాభం చూస్తే బోర్డు స్వీపరు జీతము పాటి చెయ్యదు. ఇందులో ప్రతి రోజు బజారుకు ఆసీలు కట్టుకోవాలి. పోలీసులకు, ఉద్యోగులకు, బోర్డు నౌకర్లకు చేపలు ఉచితముగా ఇవ్వకపోతే వీరిగతి కోరి కష్టినం తెచ్చుకొన్నటులే వుంటుంది.

ఇట్టి పరిస్థితుల్లో పంచాయితీ బోర్డు వారు కంద్రజాతివారు తమకు ఓట్లివ్వ లేదను కక్షతో, వారిపై చేపల లైసెన్సు పన్ను విధించారు. లోకల్‌బోర్డు ఇనస్పెక్టరు గారికి అపీలు చేసుకొన్నా ఇంతవరకు దర్యాప్తేలేదు. బోర్డు ప్రెసిడెంటుగారు 10 రోజుల్లో పీజు చెల్లించకపోతే దావా వేస్తామని నోటీసిచ్చారు. దానితో కంద్రజాతివా రంతా భోరుమని యేడుస్తున్నారు. ఈ పన్ను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మలిపెద్ది కృష్ణమూర్తి
పెక్కలి తా. కాం. కార్యదర్శి.

* * *

కోడేరు లోకలుఫండు డిపో

ఈ డిపో కోడేరు నల్లచెర్ల రోడ్డు 0/1 మైలులో ఎడమవైపున సుమారు 3 ఎకరముల విస్తీర్ణము గలిగి రోడ్డునకు చేరియున్నది. దీనిని గత 5 సంవత్సరముల నుండియు కోడేరు గ్రామమునకుగారి పెద్దకాపునైన జాపిరాజు తన స్వార్థమునకై ఉపయోగించుకొనుచున్నారు. యీతడు L.F.P.W.D. లోను P.W.D. లోను కూడ కంట్రాక్టరు. ప్రతి సంవత్సరము 5, 6 లక్షల యిటిక 4, 5 లక్షల పెంకు ఆ డిపోలోనే తీసి దానియందే ఆములువేసి కాల్చి విక్రయించుచున్నారు. యీ యిటిక పెంకు తీసేరోజులలో యీ డిపో నలుమూలల ఆక్రమింపబడి మట్టు కంచె వేయుటవలన రైతులకు చాల యిబ్బందిగా నున్నది. ప్రతి సంవత్సరము దీనిని గురించి మొరపెట్టు కొన్నప్పటికిని అధికారులు తగు చర్య తీసికొనలేదు. ప్రతి సంవత్సరము యీ డిపోలో గోతులుపెట్టి మన్నుతీసి యిటిక తీతకుపయోగించు చున్నారు. యిప్పటికిని గత సంవత్సరము తీసిన 5 పెద్దగోతులు (విస్తీర్ణం 15, 20, 25, 30, 40 చదరపు గజములు 1 గజము లోతుగలవి) గలవు. యీ సంవత్సరము యిటిక తీతకు సుమారు 500 బండిమట్టి డిపోకు ఆగ్నేయమూలగా నిలువ చేసియున్నారు. ఐన్ల గేటునకు యిచ్చిన డిపోస్థలంను కూడ మట్టి గుట్టలతో నింపినారు. యిటికాములు కాల్చేటప్పుడు వచ్చే వేడిమికిని పొగకును కొన్ని మామిడి మొక్కలు చచ్చిపోయినవి. ఆములు కాల్చుటకు చెట్లను చెట్ల కొమ్మలను కొట్టివేయించినారు. ఈ సంగతి రెవిన్యూ రిష్టుచూచిన అధికారులకు బోధపడగలదు. యిదివరలో డిపోలోఉన్న చెట్ల ఫలసాయము గ్రామములో పాటవేసేవారు. కాని గత మూడు సంవత్సరముల నుండియు అట్టి పాట గ్రామములో జరుగుటలేదు. దీనికంతకును అధికాలు మొక్క కమ్మియే కారణమని తోచుచున్నవి. వీనినిగురించి గ్రామస్థులు 11-10-38 నిటీసు పెట్టగా అసిస్టెంటు యింజనీయరు వారు సర్వాపురం పెనుగొండ ఓవరుసీయరు వారు వచ్చి చూచి తనిఖీచేసినారు. గ్రామస్థులు వారికి డిపోలో మిగిలియున్న యిటిక పెంకు గుట్టలను, బూడిద గుట్టలను మట్టి గుట్టలను గోతులను చూపించిరి. కాని నిటీషనుదార్ల వద్ద స్టేటుమెంట్లు తీసుకొనలేదు. పైగా ఓవరుసీయరువారు రహస్యముగ యిటికాములను తీసివేయవలసినదిగా సలహా నిచ్చియున్నారు. 16-10-38 తేదీని సదరు ఓవరుసీయరుగారు పెళ్ళికొడుకు అనే గొంగు కూలీని పంపి సంగతులు ఎట్లున్నది వాకబు చేయించినారు. అద్దె చీటిమీద యీమధ్యనే సృష్టింపబడినట్లు కూడ యీమధ్య బయలుదేరినవి. అద్దె చీటి ఉన్న యెడల యిప్పుడు ఆగుట్టలను రహస్యముగ తీయుటకు కారణమేమిటో తెలియకున్నది. గత సంవత్సరము యీడిపో విషయమై ఒక సాహెబు గుమాస్తాగారిని సన్నెంటుచేసి, తదనంతరము కొప్పావరు ట్రాన్సుఫరు చేసియున్నారు. యిప్పటికిని యిట్టి చర్యలు అధికారుల సలహామువల్లనే జరుగుచున్నవి. ఒకవేళ అడిపోను అద్దెకిచ్చేయెడల గ్రామస్థులకు అ రేటునకే యిచ్చినయెడల వారి కష్టములు తొలగును. గత 5 సంవత్సరముల నుండి ఉన్న అసామి యొక్క అన్యాయాక్రమణకు నష్టమునకు తగు చర్య తీసికొన వలసినదిగా అధికారులను కోరుచున్నాము.

ఇట్లు
నెక్కలపూడి రామారావు.

* * *

లంచగొండితనము
(డి. పి. డబ్ల్యులో)

ది 3—12—38 తేదీన ఈమని (తెనాలి తాలూకా) గ్రామములోని రైతుల నుండి, దుగ్గిరాల సెక్షను సంబంధించిన ఓవర్‌సీయరుగారు డి.పి.డబ్ల్యు శాఖవారికి అనగా తనకు, బోపాచ్ గుమాస్తా, లాకు కలాసులు వగైరాలకు ఇవ్వగలందులకుగాను నేను మా ఊరువచ్చి, గ్రామస్తులు ఈ సంవత్సరము మామూలు లంచము తప్పించుకొన జూచినను, సదరు ఓవర్‌సీయరుగారు "మీరు మావలనను, మా శాఖవలనను, యిక్కట్లు పొందగలరని" లోపాయికారిగా బెదరించుచూ, అందుకుగాను షుమారు నెలరోజుల నుంచి రైతులకు నీరు అవుసరము లేనప్పటికి కాలువలు పూర్తిగా వదలుచుండెను. ఇదివరకు రెండు రిపోర్టులు మునసబు ద్వారా చేయించినప్పటికి కాలువలు కట్టివెయ్యక చివరకు గ్రామస్తులచేత మామూళ్ళు ఇచ్చేలాగున యేర్పాటు చేసుకొని కాలువలు కట్టివేసినారు.

ఈరోజున ఓవర్‌సీయరుగారికి రు. 100 లు గుమాస్తాకు రు. 19 లు, కలాసీలు వగైరాలకు రు. 7 లు పుచ్చుకొని అమాయకులగు రైతులను మోసపుచ్చి దుగ్గిరాలకు వేంచేసిరి.

కాంగ్రెసు హయాములో గూడా ఇటువంటి చర్యలను బహిరంగముగా జరిపి లంచములు పట్టినందుకు సదరు ఓవర్‌సీయరుగారి చర్యలను గర్హించుతూ ఈ సంగతిని తాలూకా, జిల్లా, కాంగ్రెసు సంఘములవారికి తెలియచేసి తగినచర్యను తీసుకొనవలసినదిగా తీర్మానించిరి

ఇట్లు
అంచె రామలింగయ్య
ఈమని గ్రామ కాంగ్రెస్ సంఘము
ప్రెసిడెంటు.
3—12—38

* * *

క్షయరోగ నివారణ నిధి.

ఆంగ్లదేశాన్నుండి మహోన్నతాధి కారంతో భారతదేశానికి విచ్చేసిన లార్డు లిన్‌లిత్‌గో సతి భారతీయుల దీనత్వాన్ని గమనించి క్షయరోగ నివారణ నిధిని ప్రారంభించడము భారతీయుల భాగ్యమే.

అయితే ఏతత్ నిధికి ధనాన్ని కూర్చుతున్న విధానాన్ని గూర్చి చిన్న మనవి.

వారు కొన్ని జండాలను తయారు చేయించి ఇనస్పెక్టింగు ఆఫీసర్లద్వారా ప్రతి పాఠశాలకు పంపుచున్నారు. ఒక్కొక్కటి అణా ఖరీదు. ఆదయినా ఆకర్షణీయముగా లేదు. ఆ జండాలను పాఠశాల విద్యార్థులకు విక్రయించ మన్నారు. ఆజండాలను అణా యిచ్చి కొనే వాళ్ళేవరూ సదరు జండాలు ఖర్చుకాలేదు అనగూడదట, తిరిగి పంపించనూ కూడదట.

ఆగస్టునెల మొదటి వారములో ఇద్దరు పంతుళ్ళున్న ఒకబడికి 30 జండాలను పంపారు నిజంగా ఎంత ప్రయత్నము చేసినా ఒక్కటీ ఖర్చుకాలేదు. సదరు జండాలధనాన్ని పంపించమంటూ ఇప్పటికి అప్పుడే రెండు రిమైండర్లు యిచ్చారు. అందు రెండోదానిలో "The money is long over due అన్నారు. 30 జండాలు రూ 1-14-0 మనియార్డరు కమీషన్ 2 అణాలు మొత్తము రు 2-0-0 లూ ఆ ఇద్దరు పంతుళ్ళ నుండి వసూలు చేయడానికి తలపడ్డారు.

కాంగ్రెసు మంత్రివర్గము వారి పాలనలో కూడ సామాన్య వేతనాలతో కాలము గడుపుతున్న బడి పంతుళ్ళనుండి ఇంతింత మొత్తాలను బలవంతముగా వసూలుచేయ తలపడడము ఆలోచింపతగ్గ విషయము. ఈ విషయములో ప్రజా ప్రతినిధులైన M. L, A లు తగు విధముగా ఆలజడిని కలిగించి మమ్మీ బెడద నుంచి తప్పింప ప్రార్థన.

"ఒక ఉపాధ్యాయుడు"

* * *

వెంకటగిరి తూర్పు రేంజి సాల్టు యినస్పెక్టరు జవానుల దౌర్జన్యము.

3-12-38 తేదీన సా. 6¼ గంటలకు యానాది కొండూరు సుబ్బడు. వాని భార్య ఇరువురు బజారుకు పోయి తూర్పు వీధిన వచ్చుచుండగా, సాల్టు యినస్పెక్టరు వారి వాకిట ముందు, షేక్ దస్తగిరి, పేరు తెలియని మరొక జవాను యిరువురున్ను నిలబడియుండి యానాదివారి దంపతులను యిరువుర్ని పిలిచి నిలువబెట్టిరి. తరువాత వారి యింటిలోపలి వుంచు యానాది పాపడిని పిలిచి ఒకే యీ యానాదివానిని పిలుచుకొని లోపలికి పొమ్మని కలవిచ్చిరి. వెంటనే యానాది దిగ్భ్రమ జెందియుండ వానితో పై జవాన్లు యిరువురు మరియొకతూరి హుకుమ్ యిచ్చి తీసుకొని పొమ్మనిరి. అదే మేరకు యానాది పాపను తీసుకొని పోవుచుండు నిజ భర్త యానాది సుబ్బడు భార్యను విడనాడలేక భార్యవెంట పోవ సాహసింపగా దస్తగిరి అనునతను తప్పత్రాగివుండి వానిని మెడతోపులతో ముష్టిఘాతములతో కాలి తన్నులతో రక్తాపై బడద్రోసెను. ఈ దృశ్యం కన్నులార గాంచుచుండిన, గురునాథం సుబ్బరామయ్య నేనున్ను సాల్టు యినస్పెక్టరుగారితో తన జవాన్ల అక్రమమును తెలియపర్చగా వారి చర్యనే బలపరచుచూ మీకు శక్తివున్న ప్రతిక్రియ జరుపుకొమ్మని జవాబు చెప్పిరి. ఇంకను అధికారుల సమర్థింపులు చాలించనందులకు చింతిలుచున్నాను.

ఇట్లు.
పి. రామకృష్ణయ్య.
యువజన సంఘ కమిటీ మెంబరు.

* * *

ఎస్టేటు ల్యాండ్ రివెన్యూ బిల్లు నిధి.

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి శ్రీ చెలసాని వాసుదేవరావుగారు యీ క్రింది సర్క్యులర్ (నెంబరు 3) ను ప్రకటించుచున్నారు:—

ది 4 12—38 తేదీన బెజవాడలో సమావేశమైన ఆంధ్రరాష్ట్ర రైతు సాధారణ సంఘ సమావేశములో జమీదా రైతు ఆందోళన కొరకై 'ఎస్టేటు ల్యాండు రివెన్యూ బిల్లు నిధి'యను పేరిట ధనమును వసూలుచేయుటకై తీర్మానింపబడెను. కాని యిదివరకే అనేక కపటదారులు జమీందారీ ఈనాందారీ గ్రామాలలో రైతుల కాశలు కల్పించి, రైతు సంఘాలపేరిట ధనమును వసూలు చేస్తున్నట్లు తెలియవచ్చింది. కాబట్టి యిట్టి మోసమును అరికట్టుటకై ఆ యా జిల్లా రైతు సంఘముచే అధికార మీయబడిన బాధ్యతగల రైతు సంఘాధికారులే వసూలు చేయునట్లు నిష్ణయింపబడినది. ఆవిధముగ చందా రశీదులు అచ్చువేయించి అధ్యక్షుని చేవ్రాలు ముద్రనువేసి జిల్లా రైతు సంఘములకు పంపుచున్నాము కాబట్టి మీరు (జిల్లా రైతు సంఘములు) చందాలు వసూలుచేసిన ఆ ధనములో నూటికి 75 చొప్పున మినహాయించుకొని ప్రతి వారమున్ను మిగిలిన 25 మాకు ఆఫీసునకు పంపవలెను. సంఘ సాధారణ సమావేశములో వాగ్దానమొసగిన వాటి క్రింద వసూలు కాబడు మొత్తాలు మాత్రం పూర్తిగా పంపవలెను. జిల్లా సంఘ వద్ద ధనమును పూర్తిగా జమీన్ రైతు ఆందోళనకే వినియోగించి సంఘ పక్షమున ప్రకటింపబడు కరపత్రములను, ఆందోళన రిపోర్టులను, ఋజువులను ప్రతి 15 రోజులకును రాష్ట్ర ఆఫీసునకు పంపవలెను.

మన సహకారోద్యమము

నేడు ప్రభుత్వానికి ఊతగొమ్మగా ఉంది.

(ఒక అనుభవజ్ఞుడు)

మన కాంగ్రెసు మంత్రివర్గం వారు సహకారోద్యమాన్ని బాగుచేయడానికొక కమిటీని నిర్మించి, నివేదికను వ్రాయించి, యీ వుద్యమ సంస్కరణకు పూనుకొంటామని నిర్ణయించారు, సహకారోద్యమం ప్రజల యుద్యమాలలో నొక యుద్యమం. సామాన్య పీడిత ప్రజలు, పెట్టుబడిదారీ పద్ధతినుండి పరుతూవున్న బాధల నుండి కొంతవరకు వారిని కాపాడుటకు నిర్మింపబడే యుద్యమమిది. కార్మికులు తమ హక్కులను స్థాపించుటకును, తమ యార్థిక పరిస్థితులను బాగుచేసి కొనుటకును, యేవిధముగా ట్రేడు యూనియను ఉద్యమ ముపకరించునో ఆటులనే కార్మిక కర్షకులకు సహకారోద్యమము కూడ ఉపకరించును. వారి యార్థికావసరములకును పెట్టుబడిదార్ల పీడింపు మార్గముల వల్లగాక, కొంతవరకు సౌకర్యములను వారికి అనుకూలించు మార్గముల ద్వారా కలుగ జేయును. పెట్టుబడిదారీ పద్ధతిలోని పీడనా పద్ధతులనుండి కొంతవరకు వారిని రక్షింపగల్గు నుద్యమములో ప్రాముఖ్యత జెందిన యుద్యమము సహకారోద్యమము. అందువల్లనే ట్రేడు యూనియన్‌లకును, సహకార సంఘములకును సౌభ్రాత్ర సంబంధములు, పెక్కు దేశములందున్నవి.

పేదలకు సాయము చేస్తాయి.

సహకార సంఘములు, పెట్టుబడిదారీ పీడ నుండి, సంఘ సభ్యులను కొంతవరకు రక్షించుట కనుకరించును. వారికి వలయు సరకులను చౌకధరలతో, సరఫరాచేయును కార్మికుల బీదతనము వలన, హెచ్చు ధరలకు తక్కువ తూకముతో చాల చెడ్డరకమగు సరకులను వారికి దద్ది, వారికి వచ్చిన స్వల్ప కూలిలో చాలవరకు హరించి వేయునట్టి వ్యాపారస్థుల పద్ధతినుండి రక్షించును. వారి బీదరికము వలన వారికి హెచ్చు వడ్డీలతో, అప్పులనిచ్చి, వారి తక్కువ కూలీలో చాల వరకును ఋణదాతల వడ్డీలకే పారబోయునట్లు చేయు పద్ధతినుండి తప్పించి, చాల స్వల్ప వడ్డీలకే అప్పులను సహకారోద్యమము సరఫరాచేయును. అందువలన వారు పెట్టుబడిదారీ పద్ధతిని నిర్మూలించుటకు చేయు పోరాటములో వారికీ యుద్యమము సహకారి కాగలదు. ఈ యుద్యమము ప్రజాస్వాతంత్ర్యముపై నడువబడును. సంఘములోని లాభమును, సభ్యులే పంచుకొందురు. ఆ లాభములలో కొంత భాగం విద్యా విషయములకును, వారి సమిష్టి లాభమున కనుసరించు పనికి, ఉపయోగించుట కవకాశము గల్గును. ఇకముందు రాబోవు సోషలిస్టు పద్ధతులకు, చాల స్వల్ప పరిమాణములలో మార్గదర్శి కాగలదు. ఇప్పుడు సోవియటు యూనియన్‌లో సహకారోద్యమమే గొప్ప ప్రజా యుద్యమమైనది. సోవియటు యూనియన్ ఒక గొప్ప సహకార సంఘమువలె నడుపబడు చున్నది. అందువలన సహకారోద్యమము పెట్టుబడిదారీ పద్ధతికి వ్యతిరేకమైన నిర్మాణముగల యుద్యమము. అందువల్లనే పెట్టుబడిదారీ పద్ధతియొక్క అంత్యరూపమగు ఫాసిస్టు పద్ధతి అమలుకు తేబడిన ప్రతి దేశములోను ఈ ఫాసిస్టులు సహకారోద్యమమును అణచివేసినారు. నిర్వీర్యముగ చేసినారు, ఇట్లే ఇటలీలో చేసినారు, జర్మనీలో ద్విగుణీకృతమగు క్రూరతతో నష్టే యొనర్చినారు. ప్రజాశక్తులు బలముచెందిన స్పెయినులో సహకారోద్యమము చాల బాగుగ నడుపబడు చున్నది, సహకారోద్యమాభివృద్ధి కెన్నియో సౌకర్యముల నిచ్చుచున్నారు.

రాజకీయ తాటస్థ్యము హానికరం

సహకారోద్యమము, పీడిత వర్గము యొక్క యుద్యమ మయ్యును నేడు దానిని సరియైన పద్ధతులపై నడుపుట కెన్నియో యాటంకములు గల్పింప బడుచున్నవి. ప్రజలను, విప్లవ మార్గముల వైపు బోకుండా, త్రిప్పి వేయుటకీ యుద్యమము నుపయోగించుచున్నారు. బూర్జువా యనుకరులు సత్రదారులు. వీరు కేవలము సహకారోద్యమమే, లోకమునకు విప్లవముతో నిమిత్తము లేకనే సర్వ సౌఖ్యములను, చేకూర్చ గలదని ప్రచారము చేయుదురు. సహకారోద్యమము, పెట్టుబడిదారీ పద్ధతికిని, సోషలిజంనకును మధ్య మార్గమని చెప్పెదరు. సహకారము లాభము కొరకి వస్తూత్పత్తి జరుగు పెట్టుబడిదారీ పద్ధతినుండి శాంతి యుతంగా లోకమును తప్పించి, సహకార పద్ధతిలోకి, లోకమును క్రమముగా మెల్లగా, శాంతి యుతముగా మార్చి వేయుదురనియు మీరు ప్రచారము చేయుదురు. రాజకీయ తాటస్థ్యమను నియమముకూడ విపరీతము గవినియోగించెదరు, సహకార సంఘములో రాజకీయములేవి కాని జొరబడ కూడదని వీరాదేశింతురు. అట్లు జొరబడుటవలన, అన్ని పక్షములవారును యీ యుద్యమములోనికి రారట, కాని వర్గ కలహమును వర్గ భేదమును కలిగి అతి స్వల్ప సంఖ్యాకులగు పీడించు వర్గంవారు, అత్యధిక సంఖ్యాకులగు పీడిత వర్గములనణగ ద్రొక్కి యుంచెడు పరిస్థితులలో రాజకీయ తాటస్థ్య మనునది అర్థము లేని మాట. ఈ రాజకీయ తాటస్థ్య మనునది కార్య రూపములో అభివృద్ధి నిరోధకమగు విధానముగ మారినది. కాని యీ సహకార సంఘములోని సభ్యులలో, నత్యధికసంఖ్యాకులు కార్మిక సభ్యులైయున్నారు. వీరిని తృప్తిపరచుటకు, నామ మాత్రమున కొన్ని యభివృద్ధి సూచకములగు తీర్మానములను యీ యుద్యమ నాయకులు, ఆమోదింపజేసియు కార్యరూపమున మాత్రముపై రాజకీయ తాటస్థ్యమను మిషచే యెట్టి అభివృద్ధిని సూచించు కార్యక్రమమును నడపుట లేదు. ఈ వైకారణము వలననే సహకారసంఘములు కొన్ని దేశములలో చాల మితవాద పద్ధతుల నవలంబించుట కలిగినది. అభివృద్ధి నిరోధకములై, కార్య సాధనమును వ్యక్తీకరించు సంస్థలై, ఛాందసమును మసిలింప జేయు సంస్థలై యీ ఉద్యమము యొక్క నిజమగు నాశయముల నీ సంస్థలు కార్య రూపమున ఎదుర్కొనట్టి పరిస్థితు లేర్పడినవి.

మన దేశంలో ఇది బ్రిటిషువారి రక్షణ కొరకే

ఈ పై విధమగు పరిస్థితులు ప్రజా స్వాతంత్ర్యముగల దేశములోని సహకారోద్యమమును మనము చూడగలుగుచుండ, విదేశ సామ్రాజ్య తత్వము క్రింద నణగద్రొక్కబడు, మన దేశములోని సహకారోద్యమం ఏవిధముగ నుండునది మనము తెలుసుకోవాలి. ఈ మన దేశములో దక్కను ప్రాంతాలలోను మరికొన్ని ప్రదేశాలలోను, షాహుకార్ల హెచ్చు వడ్డీలవల్లను, కర్షకుల ఫలసాయం చాల భాగము అప్పులకోసకి చెల్లుగా వారే బలవంతముగ తీసికొనిపోవుటయు జూచి, ఈ షాహుకార్ల పీడనుండి కలుగు బాధను భరింపలేక, బీదకర్షకులు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటులో షాహుకార్ల యిండ్లను దోపిడిచేశారు. వారి ప్రాంసరీ నోట్లను ఇతర ఋణపత్రాలను కాల్చివేశారు, ఈ తిరుగుబాట్లు చాల తీవ్రరూపం దాల్చాయి. ఈ తిరుగుబాట్లను, బ్రిటిషు సామ్రాజ్య ప్రభుత్వము అణచి వేసింది. ఈ తిరుగుబాట్లనుండి, వారి ప్రభుత్వాన్ని, పెట్టుబడిదార్లని, రక్షించడానికి, తక్కువ వడ్డీతోను సులభమైన పద్ధతులతోను. అప్పులు, కర్షకులకు సరఫరా చేయించడానికి, ఈ సామ్రాజ్య ప్రభుత్వం కొన్ని చట్టాలను చేయించింది, ఈ విధంగా నిర్మించిన చట్టాలలో ఒక చట్టమే, సహకార సంఘాల చట్టం, దీనివల్ల ప్రభుత్వం, శాంతిని, భద్రతను సంస్థాపించడానికే చేసిన యీ సహకార చట్టము చేయబడింది.

స్వాతంత్ర్య వాసన తగలకుండా ఉండే
• నిర్మాణాన్ని రద్దు చేయాలి.

ఈ విధంగా ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని ఒక గవర్నమెంటు డిపార్టుమెంటు మాదిరిగా సంస్థాపించారు. అందువల్లనే, ఈ ఉద్యమం ప్రజాశక్తులపై యాధారపడకుండా, ప్రభుత్వం హుకుముపై, ఆధారపడింది. ప్రజా ఉద్యమముగా నడువవలసిన దానిని ప్రభుత్వమువారే ఈ యుద్యమాన్ని నిర్మించి కేవలము ప్రభుత్వపు నాయకత్వము క్రింద నడపుచున్నారు. ప్రజాశక్తులపై యాధారపడకుండ నుండుట వలననే, ప్రభుత్వ హుకుముల ననుసరించి, నడుపుటకు, తగిన యవకాశము లుండుటకు వీలగునట్లు, ఈ ఉద్యమము పెరిగినది. ఆ విధంగా పెరుగుట కనుకూలించు యాకారమునే ఈ ఉద్యమము తాల్చినది. అందువలననే ఈ ఉద్యమం కేవలం, ఋణముల నిచ్చునట్టియు, ఋణముల వసూలు చేయునట్టియు. ఒక విచిత్ర నిర్మాణము కలదిమైనది. అట్టి ఋణములు సరఫరా చేయు నిర్మాణమే, యీ యుద్యమము యొక్క ముఖ్యాకారమై ఉన్నది. ఋణముల నిచ్చు సంఘములే, యత్యంత ప్రాధాన్యత వహించినవి. ఈ సంఘములే, సహకారోద్యమాభివృద్ధి, సహకారోద్యమము యొక్క విధానము ప్రభుత్వపు హుకుముల ననుసరించి, ఏర్పాటు చేయుటకు అధికారము కలిగియున్నవి. దీని ఫలితముగా, యిప్పుడున్న సంఘము లన్నిటియును, చాలకరకును, ఋణముల నిచ్చు సంఘములే. లేని యెడల, ఋణములనిచ్చు సంఘముల యొక్క యంగభాగములు, వాని అప్పులను సులభముగా వసూలు చేయుట కనుకూలించు సంఘములు మాత్రమే, సహకారోద్యమములోని యత్యధిక సంఘములై యొప్పుచున్నవి. మన దేశమందు ఈ ఋణముల నిచ్చు సంఘములతో ప్రజల దైనందిన యవసరము లంతగా సంతృప్తిజెందివారందులో నిరంతరము పాల్గొనుట కవకాశం లేదు. ఆవిధముగ పాల్గొని తమ జీవితావసరములకు వారు తగు కట్టుదిట్లు చేసికొనుటకు గాని, వారి జీవన సౌకర్యములకు ఏదైన యాటంకము కలిగినయెడల అద్దాని నతిక్రమించుటకు ప్రజా పోరాటములు సాగించుటకు గాని వీలులేదు. అవకాశము లేదు. ఆ నిర్మాణము అట్టి పరిస్థితులపగాని, అట్టి ప్రజా పోరాటములకు వలయు సౌకర్యములను కలిగించు ఎట్టి అవకాశములనుగాని కలుగనీయదు. ఈ విధముగ సహకారోద్యమము ప్రజా యుద్యమమగుటకు, బ్రిటిషు సామ్రాజ్యమునకు ఏమాత్రము ఇష్టములేదు. ప్రజల దైనందిన పోరాటములకు సహకారోద్యమము సహాయం చేయునెడల యట్టి పోరాటములలో సహాయము చేయకలుగు నిర్మాణమును దాల్చిన ప్రజా ప్రాథమికావసరములకు వారు నడుపవలసిన పోరాటములకు నిర్మాణాకారముల నిచ్చి, నిర్మాణ సహాయమును కల్గించును. ఈవిధముగ ప్రజా పోరాటములకీ విధముగనైనా సహకారోద్యమము చేయూత కల్పించిన యెడల, ఈ ప్రజా పోరాటములు సహకారోద్యమ సహాయమున స్వాభావికముగా బలపడును. ప్రజా యుద్యమము సామ్రాజ్య వ్యతిరేక పోరాటముగ పరిణమించి సామ్రాజ్యాధికారమును పారద్రోలి, దేశ స్వాతంత్ర్యమును స్థాపించు ఈ ప్రజా పోరాటము యొక్క గతియందు సహకారోద్యమమే చాల సహకారియై ప్రజాశయములను నెఱవేర్చుటకు సహాయము నిచ్చును. అందువలన సహకార చట్టముల నిర్మించుటలోగాని సహకార యుద్యమముల నడుపుటకు ప్రభుత్వము హుకుముచేయు ఫర్మానులోగాని ప్రజాస్వాతంత్ర్యాశయముల కేలాటి వ్యక్తతగాని. ప్రోత్సాహముగాని సహకారోద్యమము వలన కలుగకుండునట్టి నిర్మాణమును ప్రభుత్వము వారుకల్పించిరి. అట్లు భద్రంగాను స్వాతంత్ర్య వాయువులుగాని, యున్నతాదర్శపు వాసనలు గాని సోకకుండునట్లు సహకారోద్యమమును సామ్రాజ్య ప్రభుత్వం కాపాడుచున్నది.

సహకారోద్యమం, షాహుకారీపనికే అనడం బూటకం

యీవిధముగా సహకారోద్యమం, ప్రజల యభివృద్ధి కరమగు యితర యుద్యమములకు, ఏమాత్రము సహాయము చేయకున్నది. సహాయముగాని, సహకారముగాని కల్గించుట కవకాశమే మాత్రము లేకపోవుట యొక యనివార్యమగు విషయమునకై యీ యుద్యమము

నడుపబడినది. యీ యుద్దేశ్యము నెరవేర్చుట కీయుద్యమములో పరపతికిని ఋణముల నిచ్చుటకు మాత్రమే ప్రాధాన్యత నిచ్చి ఋణముల నిచ్చు సంఘములే నాయకత్వమునకు ముఖ్యము నగు పాత్రతను వహించి యుండుటకు తగిన కట్టుబాట్లు ప్రభుత్వం మొనర్చినది. ఈ యుద్యమములో పరపతి సంఘములే ముఖ్యపాత్రతను వహించుటచే సహకారోద్యమమనిన ఋణముల నిచ్చుట ఋణములను వసూలు చేయుట మాత్రమే యనియును, మన దేశమునకు కావలసిన స్వదేశీ సహకారము లేదలము పరపతి సహకారమే నని యును యిదియే మన సాంప్రదాయమునకు సరిపోవు సహాయమనియును, నొక బూటకపు ప్రచారము సాగించబడినది.

అప్పునిచ్చే సంఘాలే ఎక్కువ

యిక మనకు సహకార ప్రాధాన్యత ఎలన. ఋణముల నిచ్చు సహకార సంఘములే హెచ్చుగా స్థాపించబడినవి. తనఖామీద కానిండు నమ్మకం హామీ మీద గానిండు, పంట హామీ మీద గానిండు ఎట్లు చూచినను అప్పులిచ్చుట తీర్చుటయే పనిగా గల్గిన సహకార సంఘములు స్థాపించబడుట వలన అప్పులు తీసికొనుట వాయిదాలు చెల్లించివేయుటయే సహకారము మంచి యున్నత ధర్మములనియును అట్టి ధర్మము ను అవలంబించువారే సహకారులనియును, అభిప్రాయము నెలకొల్పబడెను. వాయిదా నాటికి కిస్తీలు చెల్లించ కుండుట వలన, మన దేశపు ప్రజలు సహకారోద్యమము యొక్క మూలసూత్రములను పొందుట కనర్హులని యున్నారను నభిప్రాయము ప్రజలలో నాటుకొని పోవునట్లు చేసిరి.

కాని మన దేశంలోని కర్షకులలో నత్యధిక సంఖ్యాకులు చాల దుర్భరమగు దారిద్ర్యములో బాధపడు చుండుటచే వారు తమ తెచ్చిన అప్పులు తీసికొనుట జరుగుచున్నది. వారికి నిచ్చు పరిమాణము వారి కనీస ఆర్థికావసరములకు సరిపోక యున్నది. అందువలన వారు సకాలమున యీ సహకార సంఘములలోని యప్పు తీర్చలేకున్నారు. పైజెప్పిన రీతి బీద కర్షకులు యీ సహకార ధర్మముల నాచరింపలేకున్నారు. అందువలన యీ బీదరైతులు హెచ్చుగా సభ్యులైన సంఘములు సహకార ధర్మమని మన దేశపు సహకార వేత్తలచే జెప్పబడు గొప్ప ధర్మములను వారి సభ్యులచేత ఆచరణ యందుంచునట్లు చేయుటచే కష్టతరమై యున్నవి. సభ్యులు తమ బాకీలు వాయిదా నాటికి తీర్చలేకుండుటచే యీ వాయిదామీరిన బాకీలై వాటి సంఖ్యయు, పరిమితియు హెచ్చుచున్నది. సంఘములలో వాయిదామీరిన అప్పులు వృద్ధియగుటయు, యీ యప్పులకు దావాలువేసి డిక్రీలు పొంది, ఋణగ్రస్తుల యాస్తుల నమ్మివేయుట మొదలగు పనులను సహకార సంఘములు చేయుచున్నవి. యీ విధముగా జరుగుచున్నప్పుడు సహకార సంఘములు సకాలమునకు కర్షకుల కప్పులనిచ్చి ఎప్పుడును ఈ స్వల్ప పరిమితి వరకైన యిచ్చు ఋణముల నిల్పివేయవలసి వచ్చుచున్నది. వాయిదామీరిన బాకీలు హెచ్చుచుండ తిరిగి వీరి కప్పులనిచ్చుట నిల్పివేయుట ఈ యిప్పుల వసూళ్లకు కఠిన విధాన మవలంబించబడుట తప్పక జరుగవలసిన కార్యక్రమమే. అందువల్ల మన సహకార సంఘములు పరపతి సంఘములే యగుటవలన ఈ పై జెప్పిన విధంగా, పరపతి సంఘంలనే సహకారోద్యమ మంచలి ప్రధానాంగముగా చేయుటచే, యీ సహకార సంఘములు, కేవలము హెచ్చుపరిమాణములుగల్గి, అప్పులను తీర్చగల్గు పెద్ద భూస్వాములకే మేలుగల్గింప వీలు కలిగియున్నవి. అప్పులను సకాలమునకు చెల్లింప వీలు కల్గినట్టి పెద్ద యాస్తిపరులకే. యీ తగిన వసతుల గల్గించునట్టి యుద్యమముగా మారిపోయినది. యిప్పుడు సహకార సంఘములలోని మూర్పుల నిర్మాణమును మనము జూచినచో, పెద్ద భూస్వాముల కిచ్చునట్టి భూమి తనఖా బ్యాంకులే యెక్కుయుండుట, గాననగును. ఏది రైతులకును, బీద గ్రామిక వర్గములకును, అప్పులనిచ్చు సంఘములు. నామమాత్రావశిష్టములై, యిప్పుల నిచ్చుట మానివేసి, దావాలలోను డిక్రీలలోను అమ్మకాలలోను నిండి, జీవచ్ఛవములవలె ఉన్నవి. అట్టి సంఘము లెన్నియో యెత్తివేయబడినవి. అందువలన యీ సహకారోద్యమముగా చేయబడుటచే, యీ సంఘములు గాని, యీ యుద్యమముగాని, బీద వర్గములకు నిరుపయోగ మగుచున్నది. ఈ యుద్యమము యొక్క నాయకత్వము, పెద్ద భూస్వాముల యొక్కయు పెట్టుబడిదార్ల యొక్కయు హస్తగతమైనది. యిక నీ సహకార పరపతి సంఘములు బ్యాంకుల యొక్కయు, పెద్ద ధనవంతుల యొక్కయు దివాళి సైనను, అప్పులనైనను ఆధారపడియుండుటచే, యీ ధనికవర్గము యొక్కయు, బ్యాంకుల యొక్కయు, అధికారము నకు, నియంతృత్వమునకు, ఈ పరపతి సంఘముల కప్పునిచ్చు జిల్లా బ్యాంకుల ద్వారా సహకార సంఘములపైనను, సహకారోద్యమము పైనను చలాయించ బడుచున్నది. ఈ విధంగా నడుపబడుచుండ, సహకారోద్యమము ప్రజా యుద్యమమై ప్రజాశయములకు సహాయపడుట కెన్నియో యాటంకములున్నవి. ఈ సహకార సంస్థలను నిర్వహించువారిలో, యున్నతాదర్శములుగాని, ప్రజాశయములకు పాటుపడువారు గాని, ఎన్నుకొనబడినప్పుడు, ప్రభుత్వము, అట్టి వారిని తీసివేయుట కెన్నియో యత్నములు చేసినది.

సంఘాలపై ప్రభుత్వాధికారం

సహకార సంఘములలో "సంచరాయని వారు" (undesirables) వచ్చినయెడల వారిని తీసివేయుట కెట్టి యుపాయములనైనను ప్రయోగించబడ వెనుదీయమని ప్రభుత్వము వారే జెప్పినారు. సహాయ నిరాకరణోద్యమములో, ప్రజలెల్లరను, పాల్గొనుచుండ, ఆ విధముగ ముందంజవేసి, పాల్గొనినవారిని, సహకార సంఘములలోని యధికార స్థానముల నుండి తరిమివేయుటలో గాని, అట్టివారిని తిరిగి యెన్నుకొనకుండా, సంఘములలో ప్రోత్సాహపరచిన కుట్రలెన్నియో ప్రభుత్వాధికార్లు జరిపిరి. తానుతాను ప్రభుత్వాధికార్ల సలహాలను, యాజ్ఞలవలె, శిరసావహించి, వాటి ననుసరింపని సంఘపు అధికార్లను తీసివేయుటకును, వారి ననుసరించువారినే ఎన్నుకొనునట్లుచేయుటకును ప్రభుత్వపు అధికార్లు చేయు కుట్రలను, వారి కుట్రలు సఫలమౌటకేమో యనునట్లు, వారికి ప్రభుత్వమువారు, గొప్ప యధికారముల నిచ్చుటయు, గాననగుచున్నది.

యీ సంఘములలో వాయిదామీరిన బాకీలు విపరీతముగా వృద్ధి చెందినవని తెల్పితిని. అందువలన వాని వసూళ్లకై దావాలుచేయుట డిక్రీలు పొందుట, అమ్మకాలు జరుపుట, యివియే విరివిగా హెచ్చుగా పూనుకోవలసి వచ్చింది. ఈ పనులు జరగడానికి ప్రభుత్వ సహాయము ఎక్కువగా కావలసి వచ్చినది. దీనికి తగినట్లు ఆర్థిక మాంద్యం, రైతులు చాల నష్టపడడం, అప్పులు చెల్లించలేక పోవడం యివన్నీ వచ్చుటచే పై దావాలు మొదలైన ప్రక్రియలు యీ సహకార సంఘాలు విరివిగా సాగించవలసి వచ్చినది. యీ పరపతి సంఘాలకు ప్రభుత్వ సహాయం ఉంచేనేగాని యీ దావాలు, డిక్రీలు మొదలగునవి త్వరగా పరిష్కారంకావు. అట్టి తరుణంలో ప్రభుత్వానికి యీ యుద్యమం మీద హెచ్చు అధికారము చలాయించడానికి తగిన కారణ మివ్వబడినదని యీ యుద్యమంలోవున్న యధికారులనే "నాయకులు" కూడ ఆందోళన చేశారు. ఒక విధమైన యనివార్యత ననుసరించియే యీ యుద్యమముపై నధికారము హెచ్చుగా ప్రభుత్వంయొక్క వశం చేసినట్లు సమాధానము చెప్పుతూ ఒక చట్టము చేశారు రాష్ట్ర ప్రభుత్వం 1932 లో.

ఈ చట్టం అమలులోనికి వచ్చినప్పటి నుంచి యీ యుద్యమంపై యధికారులు, ప్రభుత్వం చలాయించుచున్న యధికారాలకి మితంలేకుండా వుంది. ఇవి ఈ దేశములోని సహకారోద్యమములోని ప్రజా స్వాతంత్ర్య సిద్ధాంతములనునాశన మొనర్చినవి. బ్యాంకుల యొక్క ధనమును ధంచుకొనుటకు వారి లాభములను భద్రపరచుటకును, కర్షకుల యొక్క అనగా సహకార సంఘ సభ్యులయొక్క, యిల్లూ వాకిలి అమ్మడానికి వెనుదీయలేదు. అట్టి కఠిన విధానము ప్రయోగించడానికి ప్రభుత్వ సహాయం కావలసి వచ్చింది సహకారోద్యమము యొక్క ప్రాథమిక మూలసూత్రాలను మంటగలిపారు. రైతుల నమ్మివేశారు. వారిలో చాలమందిని దేశ ద్రిమ్మరులుగా మార్చేశారు, నిరాధారులుగా చేశారు. ఉద్యమంపైన ప్రభుత్వముయొక్క నియంతృత్వాన్ని స్థిరపరచారు. సహకారోద్యమము ప్రజల యుద్యమంవలెగాక కేవలము బ్యాంకుల మీదను, ప్రభుత్వముమీదను, ధనిక వర్గము మీదను, ఆధారపడి యుండు నిర్మాణమును నెలకొల్పి దానినే సహకారోద్యమము యొక్క స్వరూపమని నిరూపించుటచే వీరిలో గొప్ప రాజభక్తి ప్రబోధాన్ని కల్పించారు. ఈ ధనికులు సామాన్య కర్షకులలో ప్రభుత్వం ప్రజలను, కర్షకులను తల్లిదండ్రులవలె సంరక్షించుచున్నదను భావమును కల్గింప నమకట్టినారు. యీ విధమగు యుద్యమమువలననే ఈ రాజభక్తులను తయారుచేయు యుద్యమమువల్లనే పంజాబు దేశములో కమ్యూనిస్టు ఉద్యమము, యెట్టి విజయమునుకాని చెందలేదని యొక ప్రభుత్వోద్యోగి వ్రాసినాడు. పంజాబు దేశంలో యీ సహకారోద్యమమును కేవలము రాజభక్తులను తయారుచేయు సాధనంగా నుపయోగించు చున్నారు. అచ్చట కర్షకులలో చాల మంది హైందవ సైనికులుగా నియమించబడుదురు, వారట్లు సైనికులుగా తీసికోబడకముందు రాజభక్తులై యుండునట్లు చేయుటకును, వారి స్వాతంత్రేచ్ఛ పూర్తిగా నశించునట్లు చేయుటకును ప్రభుత్వమువారి యాజమాన్యము, వారి నియంతృత్వము క్రింద నడుపు యీ సహకారోద్యమము రాజభక్తి ప్రబోధోద్యోగముగా మార్చబడినది.

కాంగ్రెసు మంత్రివర్గం ఏమి చేయాలి?

ఇట్టి ఉద్యమమును, నిజమైన ప్రజా యుద్యమముగా చేయుట, కాంగ్రెసు మంత్రివర్గపు ప్రథమ కర్తవ్యము అందులకై వారు చలాయించుచున్న, నియంతృత్వాన్ని, నిల్పివేయడానికి అనుగుణ్యంగా నుండేటట్లు చట్టం మార్చాలి, ఉద్యమం కేవలం ప్రజా యుద్యమయ్యేటట్లు బ్యాంకుల యొక్క ప్రాధాన్యతను చాలవరకు తగ్గించాలి. ఉద్యమం యొక్క నడవడి, సహకార సంఘము యొక్క యభివృద్ధి, నూతన సంస్థల నిర్మాణం, బ్యాంకులమీదనే యాధారపడి యుండకుండుటకు తగినట్లు, కట్టుదిట్టాలు సహకార చట్టంలో నుంచాలి. కేవలం పరపతియేగాక, మిగిలిన రకముల సహకార సంస్థలు, విరివిగా నిర్మించడానికి గొప్ప ప్రోత్సాహము గల్గించాలి. ఈ సంస్థల నిర్మాణం, స్థాపన, ప్రజా సంస్థలు చేసేటట్లు గొప్ప కట్టుదిట్టాలు చేయాలి. రైతు సంఘాలు, కూలీ సంఘాలు, కాంగ్రెసు సంఘాలు, విద్యార్థి సంఘాలు, సహకార సంఘాలను నిర్మించడానికి హక్కు గలిగియుండేటట్లు చేయాలి. కేవలం ధనిక వర్గాలకి తగినట్టి సంఘాలేగాక. వివిధ వర్గాల సంఘాలు, కూలీల సహకార సంఘాలు, కౌలుదార్ల సంఘాలు, బాడుగింద్ల నుండువారి సంఘాలు, వారి ఆర్థికావసరాల కనుగుణ్యంగా ఉండే సంఘాలను నిర్మించేటందుకు తగిన ప్రోత్సాహమివ్వాలి. స్వంతముగా జీవనముచేయు చిన్న దుకాణదార్లు, పాలవాండ్లు, బండివాండ్లు, మొదలగువారి సంఘాలను నిర్మించి, ఈ సంఘములకు కొన్ని సదుపాయముల కలుగజేయవలెను. సంఘములోని సభ్యులకు, వసతి సౌకర్యములు, పన్నుల తగ్గింపు సౌకర్యమును, వేలంపాటలలో గాని, కంట్రాక్టులలో గాని, సహకార సంఘముల వారికి ప్రత్యేకత యిచ్చుట, మొదలగు వివిధ సౌకర్యములు, ప్రభుత్వము వారొసగ వచ్చును. దేవాలయ భూములను, లంక భూములను, ఇతర భూములను, సమిష్టి వ్యవసాయ పద్ధతులపై సాగుచేయు సంఘములకు తప్పనిసరిగా యిచ్చునట్లు చేయుటకు ప్రభుత్వము కానింపవచ్చును. ఈ పై విధంగాను యితర విధములుగాను సహకార సంఘాలను వృద్ధి చేయుటకు, ప్రజలు కోరునట్లు, రైతు సంఘాలు ఆందోళన చేయవలెను. గ్రామ సహకార సంఘములు, కేవలము, అప్పులను బ్యాంకుల నుండి తెచ్చి, మెంబర్లకిచ్చునట్టి షాహుకార్ల సంస్థలవలె, సంకుచితమగు కార్యములతో తృప్తి చెందరాదు. సమిష్టి కొనుగోలు, సమిష్టి క్రయము విరివిగా నిర్మింపవలెను. అయ్యవి కేవలము, బ్యాంకు లిచ్చిన యప్పులను, వసూలుచేయు సంస్థలుగా మారిపోగూడదు. ఈ సమిష్టి క్రయ, విక్రయములకు తగిన గిడ్డంగులు ప్రభుత్వమే నిర్మింపవలెను. మన దేశములోని ముడిసరుకులు చాలా చౌకగా కొనుగోలు చేయుట, బ్రిటిషు సామ్రాజ్యముల ప్రధానోద్దేశములలో నొకటి. రైతుల ముడిసరకులను. సహకార పద్ధతులపై సమిష్టి విక్రయము చేయునెడ, హెచ్చు ధరలకు వలసాయమును విక్రయించుటకు. అవకాశము గల్గును. దీనివలన ముడిసరకుల నుపయోగించు పెట్టుబడిదార్లకు, చౌకగా ముడిసరకులు లభించు నవకాశము తప్పిపోవును. అందువల్లనే సామ్రాజ్య ప్రభుత్వము, ఇంతవరకును, సహకార సమిష్టి విక్రయమునకు ఎట్టి వసతులు గాని విరివిగా కల్పింపలేదు

(ఇంకా వుంది)

తుపాను బాధితులకు సాయపడండి!

కృష్ణా తుపాను బాధితుల సహాయక సంఘ కార్యదర్శి శ్రీ, [illegible]గారు యిలా తెలియజేస్తున్నారు. కృష్ణాజిల్లాలో మొత్తము 60 మనుష్యులు మరణించారు, 33669 పశువుల ప్రాణాలు గోల్పోయాయి, 21,215 ఇండ్లు కూలిపోయాయి, 1,62,151 ఎకరాల పరిమంట నష్టమయింది.

మద్రాసు ప్రభుత్వం కృష్ణాజిల్లా తుపాను బాధితుల సహాయానికి 10 వేలు శాంక్షను చేసింది.

పశ్చిమ గోదావరి జిల్లా మల్లవూడి గ్రామములో 5 గురు మరణించారని ఒక విలేఖరి వ్రాస్తున్నారు. ఈజిల్లాకు మద్రాసు ప్రభుత్వం 10 వేలు శాంక్షను చేసింది. తూర్పు గోదావరికి మూడువేలు శాంక్షను చేసింది.

ఘోరమైన తుపాను.

రైతులకు, కూలి జనానికి తీరని నష్టం.

ఆంధ్రరాష్ట్ర వలంటీయరు వ్యాయామ శిక్షా శిబిరము నిలిపివేయబడినది.

గత వారములో వచ్చిన గాలి తుపాను, లాంటిది ఈ మధ్య కాలములో ఎప్పుడు ఎరుగము, అంత భయంకరమైనది ఎరుగము, వరి పంటలు చక్కగా పండి కోతకు సిద్ధముగా నున్నవి. కోసినవి కొన్ని, కుప్పలువేసినవి కొన్నియున్న స్థితిలో ఈ తుపాను వల్ల కల్గిన అపార నష్టమును వర్ణింప నలవికాదు. రైతు నోటి సిద్ధాన్నము మట్టిలో కలిసిపోయినది. వరిచేలు నీట మునిగిపోయినవి. కోసిన పనలు తెప్పలు తేలిపోయి మురుగుకాల్వగుండా సాంతముగా కొట్టుకొనిపోయినవి. కొబ్బరి, నిమ్మ, నారింజ, మొదలగు తోటలన్నియు, నేల కూలిపోయినవి. ఇక అరటితోటల సంగతి చెప్పనే అక్కరలేదు. తూడుమాని పోయినవనియే చెప్పాలి. మెట్ట పైరులు యావత్తు సర్వనాశనమై పోయినవి ప్రతి రైతు పొలమునకు పోయి, కన్నీటి ధార విడుచుచూ, నిట్టూర్పులతో దిగబడి పోవుచున్నారు, అసలే ఋణబాధ చేత పన్నుల భారము వలన కృంగి, కృశించి పోవుచున్న రైతుకు ఈ మహా విపత్తు గోరుచుట్టు మీద రోకటిపోటువలె సంభవించినది. తినడానికి తిండికి దిక్కులేదు, ఉండడానికి ఇమ్మలేవు. అనేకుల పేదల ఇండ్లు సాంతముగా కూలిపోయినవి. వ్యవసాయపు కూలీల పూరి గుడిశలు, అసలు పేరునకు గూడా లేవు. జన నష్టము కొద్దిగానే అయినా మొత్తం మీద ఈ జిల్లాలో 2 కోట్ల రూపాయల ధన నష్ట ముండునని అంచనా వేయబడుచున్నది. ఇట్టి విపరీతమైన అవస్థ సమయములో కాంగ్రెసు, యువజన, రైతు సంఘముల కామ్రేడ్సు అందరు గ్రామములకు పోయి కష్టములోనున్న గ్రామవాసులకు సేవ చేయవలెని యున్నాము. రైతులకీ సంవత్సరము రిమిషన్లు కాంగ్రెస్ ప్రభుత్వము ఇవ్వాలి. రెండవపంట యిచ్చే ఏర్పాట్లు చేయాలి, వీటికై యీనాటినుండి ఆందోళన చేయాలి. ఏ ఏ గ్రామాలలో హెచ్చు నష్టము కలిగినది, ఎంత నష్టము, వల్లమా లేక్క మెట్టయా, గ్రామ మొత్తము మీద వచ్చిన నష్టమెంత, పశువుల నష్టమెంత మొదలగునవి వివరాలన్నీ తీసుకొని, ప్రభుత్వానికి వెంటనే తెలియపర్చాలి, కాంగ్రెస్ రైతు కూలీ సంఘాలకు రిపోర్టులు పంపించాలి. ఈ పనినంతయు చేయవలసిన ఈ సమయంలో ముఖ్యముగా గ్రామీయులంతా కష్టదశలో నున్నప్పుడు (వలంటీయరు వ్యాయామ శిక్షా శిబిరము) యిది వరకు ప్రకటించినట్లు డిశంబరు 31వ వారములో ఈ జిల్లాయందు జరుగుట అసమంజసము, అసంభవము కూడా, గాన తాత్కాలికముగా నిలుపుదల చేయటమైనది. తిరిగి ఎప్పుడు జరుగునదియు ముందు తెలియపర్చబడును.

ఇట్లు,
అల్లూరి సత్యనారాయణ.

తుపాను భీభత్సము.

నేను నవంబరు 24, 25, 27, 27 తేదీల యందు కైకలూరు తాలూకా నుచ్చుమల్లియను గ్రామమందు యుంటిని, అచ్చటి రైతుల దుస్థితిని చూచిన ప్రతి మానవుడు కంట తడిపెట్టక మానడు. మొదట పూసుపుటైనతోడనే కొల్లేరు ముంపువచ్చి 38 దినములనుండి వరిచేలన్నియు నీటిమయమై పైరంతయు కొట్టుకొని పోయినది. రైతులందరు విలపించు చుండిరి. అట్టి సమయమున మన జిల్లా కలక్టరు వగైరా యుద్యోగస్తులు పడవపైవచ్చి స్వయముగా చూచి వెళ్ళిరి. పులిమీద పుట్ర యన్నట్లు తిరిగి రెండవసారి కొల్లేరు ముంపువచ్చి 15 దినములుండి పొలములను ముంచివైచినది. దానితో పైరంతయు సాంతముగ పోయి అచ్చటచ్చట కొన్ని వరితజ్జము నిలచియున్నవి. ఎకరము 1కి ఒకటి రెండు బస్తాలవునని ఆశపడి యుండిరి. గాని 25 వ తేదీ వేసిన గాలివానకు మిగిలిన పైరంతయు పోయినది. ఆరాత్రి తెల్లవారుసరి బ్రతుకుట దుర్ఘటమని దైవమును ధ్యానించుచు అక్లే కూర్చుంటిమి. షుమారు 3 గంటలకు గాలి తగ్గెను బ్రతుకు జీవుడాయని తెల్లవారి బైటకువచ్చి చూడ సముద్రము పొంగి వచ్చుచున్నదో యన్నట్లు ఎటుచూచినను మహా సముద్రమువలె నీరు తప్ప యేమియు కనిపించలేదు. నుచ్చుమిల్లి గ్రామము మిగుల చిన్నది. అందు షుమారు 30 పశువులు చనిపోయినవి, 20 యిండ్లున్నూ పడిపోయినవి. ప్రభుత్వము వారు వారికి యీ సంవత్సరం పూర్తి రిమిషన్ యిప్పించవలయును, వారు యీ సంవత్సరము జీవించుటయే కష్టము. కొల్లేరు దిన దినము హెచ్చుచున్నది గాని తగ్గుటలేదు. యిది తగ్గునప్పటికి 20 దినములైనా పట్టును. నీటిలో యున్న పైరు మురిగిపోవును పైగా వరజపిట్టలు గురకలు వేలకు వేలువచ్చి పైరుదూసి పాడుచేయు చున్నవి.

అఫిర్కా రివిన్యూ యినస్పెక్టరుగారు పొలములు చూచుటకో లేక బేటాకోగాని ఆ గ్రామం వచ్చిరి. రైతులు మొరపెట్టుకొనరాగా వారి మొరలు ఆలింపక నీరు తగ్గినతరువాత కోను కొనవచ్చునులే యని యూరడించిరి, ప్రభుత్వం వారు ఇట్టి యుద్యోగస్తుల మాటలు వినక న్యాయవిచారణచేసి యీ సంవత్సరం పూర్తి రిమిషన్ యివ్వనియెడల రైతులు గ్రామము వదలి పోవలసినదే.

ఇట్లు
కొకుమాను లక్ష్మీనారాయణ
కోలవెన్ను గ్రామ కాంగ్రెస్ ప్రసిడెంటు

ఏజన్సీ పోలవరం తాలూకా

యీ ప్రాంతమున తొలకరిలో జిలుగు బుడమ పల్లపుకు సరిపడు వర్షము కురిసినది, ఆజేటు యీనే సమయంలో వర్షములేక కొలది వర్షమునకే పండినవి. పర్మిటాను వర్షములేక పూర్తి భూములు సాగుకాలేదు. పుబ్బ కార్తెలో అతి వర్షము కురియుటవల్ల జిలుగుబుడమ చేలు కోసినవి కోయనివి కూడా కుళ్ళిపోయి గింజలు గడ్డి కూడా నల్లపడిపోయి మనుష్యులకు పశువులకు అక్కరకు రాకుండా పోయినవి. ఆ వర్షమునకు ముదిరిపోయిన వరి అకుపెట్టి పూడ్పులు చేసినారు. పూడ్చిన లగాయతు వరిచేలు ఎండిపోయే వరకు వర్షమే లేదు.

భూమిలోవున్న కొద్ది పదునుకు పైరు వ్యవసాయముచేస్తే పెద్ద పంటపోయినా పైరుపంట పండుతుందని ఆశతో వుండగా గత నెల 25 శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలు లగాయతు చినుకు గాలి ఆరంభమై రాత్రి 7 గంటలగు సరికి గాలి వర్షము విజృంభించి 26 వుదయం వరకు తెర్పి లేకుండా గాలితోకూడిన వర్షము ఎన్ని దుక్కులు కురిసినదో లెక్కలేదు. వుదయమున లేచువరకు ఎందరు ప్రాణముతో వుందురో అనుభవము కలిగినది.

26 వుదయము దృశ్యము ఏలాగు వున్నదంటే ప్రహరీగోడలు, పూరియిళ్ల పెద్ద పెద్ద చెట్లు పడిపోయి గ్రామాదులన్నియు యుద్ధభూమివలె అతి భయంకరముగా వున్నది. భూములు యావత్తు జలమయమై వరికుప్పలు కొట్టుకపోయినవని కొందరు, పనలు పోయినవని కొందరు, గడ్డిమేట్లు కొట్టుకు పోయినవని కొందరు, పొలములలో యిసుక మేటలు వేసినవని పెట్టు గోలకు మితిలేదు.

యీలాటి పరిస్థితులలో పంటచెర్వుల కట్టలు తెగిపోయినవననీన్నీ వాటిని మరమ్మతు చేయుటకు కొన్ని వేలు ఖర్చు అగుననిన్నీ తెలసి ప్రజలు మరీ విచారగ్రస్తులైనారు.

యీలాటి దుస్థితి ఈ ప్రాంతముకు ఎన్నడూ కలగలేదు. కర్షక, కార్మికులు మొదలుగా భూమ్యాదాయం వల్ల జీవించే ప్రజలు యావన్మందిన్నీ బ్రతుకుతెరవు లేక అల్లాడుచున్నారు. పై పెచ్చు జమీందార్లు పన్ను వసూళ్ళకు ఒత్తిడి కలుగ చేయుచున్నారు. దయామయులైన ప్రభుత్వమువారు నష్టమును విచారించుటకు ఒక కమిటీని నియమించి నష్ట నివారణకు సాధనమున్ను జమీందారీ పన్నులు ఈ సంవత్సరము వసూలు చేయకుండా ఆపుదల చేయుదురనిన్నీ అట్టి బాధ్యత ప్రభుత్వమే వహించుట విద్యుక్త ధర్మమనిన్నీ మనవి చేసుకొనుచున్నారము.

గుంటూరు
3—12—1938.

ఇట్లు
చింతా గంగయ్య.
అధ్యక్షులు.
గ్రామ కాంగ్రెసు సంఘం.

నవశక్తి

చందా వివరాలు

సంవత్సరపు చందా	రూ 3—0—0
అర్థ సంవత్సరపు చందా	1—10—0
విడిప్రతి	0—1—0

ప్రకటన రేట్లు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు)

నెలకు 20 అం॥ లోపల అంగుళానికి	రూ.	0—6—0
,, 20" అం॥ పైన	,,	0—4—0
,, 100" అం॥ పైన	,,	0—3—0
పేజీ	రు 10—0—0 లు	
½ పేజీ	6—0—0 లు	
¼ పేజీ	3—0—0 లు	

షరా:—ఈ రేట్లుపైన కమిషన్లు, డిస్కౌంటులు ఇవ్వబడవు. రు 0—8—0 లకు తక్కువ ప్రకటనలు తీసుకొనబడవు. నెలకగు సొమ్ము ముందుగా ఇవ్వవలెను.

మేనేజరు
నవశక్తి

* * *

చందాదారులను చేర్పించాలి!

డిశంబర్‌లో ఈ క్రింది విధంగా జేర్పించాలని క్రొత్తగా మరో లిస్టు ఇచ్చినాం. ఈ "కోటా"ను పూర్తి అయేటట్టు పార్టీ సభ్యులు, సోషలిస్టు అభిమానులు, ప్రజాసామాన్యము పని చేస్తారని ఆశిస్తున్నాం.

ముఖ్యంగా పార్టీసభ్యులు తీవ్రంగా పనిచేసి 'కోటా' పూర్తిచేస్తారని నమ్ముతున్నాం.

	డిశంబర్ నెల కోటా	డిశంబరు మొదటి వారంలో చేర్పించినది.
విశాఖపట్టణం	5	0
తూ. గోదావరి	30	1
ప. గోదావరి	50	4
కృష్ణా జిల్లా	50	10
గుంటూరు	30	15
నెల్లూరు	20	0
రాయలసీమ	10	1
ఇతర స్థలాలు	5	4
	200	35

ప్రకాశం కమిటీరిపోర్టును బలపర్చండి!

జమీందారుల కుట్రలను సాగనీయకండి!

ఆంధ్ర రాష్ట్రీయ కాంగ్రెసు కార్యనిర్వాహకసభ్యులు నవంబరు 30 వ తేదీన చిత్తూరులో సమావేశమై చేసిన తీర్మానములలో ఒకటి యీ క్రింద ప్రకటించుచున్నాము :

ప్రస్తుతం మద్రాసు రాష్ట్రమున గల లోపభూయిష్టమైన జమీందారీ విధానమువల్లను, జమీందార్లు అవలంబించు పద్ధతులు, నడవడివల్లను, భారమైన పన్నులు చెల్లించలేక రైతులుపడుచున్న కష్టనష్టములను, వ్యవసాయముపై వచ్చు ఆదాయము కుటుంబ పోషణకు సరిపోక చాలక రోజు రోజు ఋణగ్రస్తత హెచ్చుచు రైతుయొక్క అవస్థ దీనాతి దీనముగా నున్న విషయములను, మద్రాసు అసెంబ్లీవారు విచారణకమిటీద్వారా అమూలాగ్రముగ విచారించి, నవంబరు 28 వ తేదీన మద్రాసు అసెంబ్లీలో నివేదించిన నివేదిక ఆంధ్రరాష్ట్రములోని ప్రజలయొక్క సంపూర్ణామోదము పొందినదై యున్నదనియు, ఈనివేదికలోని అంశములలో యెట్టి మార్పులను చేయకయే చట్టరూపమున మంజూరు చేసి ప్రజలు శాసనసభ్యులయెడ ఉంచిన విశ్వాసమును నష్టము సార్థకపరుప హెచ్చరించుచు జమీందారీ రైతు సమస్యను తృప్తికర పరిష్కరించుటకు అహర్నిశలు అనంతిత దీక్షతో పనిచేసిన రెవిన్యూ మంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి, వారి తోటి సంఘ సభ్యులను అభినందించుచు తీర్మానించడమైనది.

ఆంధ్రరాష్ట్రీయ కాంగ్రెసు కార్యదర్శి

అభివందనములు

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకమిటీ కార్యదర్శి శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య గారు ఈవిధంగా వ్రాస్తున్నారు :

రైతులోకము నుద్ధరించు మహోపకృతి గావించుటకు రెవిన్యూ మంత్రిగారగు ప్రకాశం పంతులు గారు వహించిన దీక్ష ప్రశంసాపాత్రము. కాంగ్రెసు వారు ప్రభుత్వమునకు వచ్చిన వెంటనే జమీందారీ ఎంక్వైరీ కమిటీని స్థాపించిరి. ఇది స్థాపించినప్పటినుండి నిన్నటివరకు రెవిన్యూమంత్రిగారు తన తోటి విచారణసంఘముతో జమీన్ రైతుల కష్టనష్టములనూ, జమీందారీ విధానములను, పన్నుల విధానమును దీర్ఘముగా విచారించిరి.

1802 సం॥ములో పర్మనెంటు సెటిల్మెంటు ప్రకారము, ఎస్టేటులో జమీందారులు రైతులనుండి రెంటును వసూలుచేయు ఏజెంటుగా ఉండిరేగాని వారు భూమిపై స్వంత అధికారులుగ లేరు. జమీందారు రైతునకు ప్రభుత్వమునకు మధ్యనుండు ఏజంటు మాత్రమేగాని వేరొండుగాదు. నేడు జమీందారునకు ఎస్టేటు వల్ల వచ్చు ఆదాయము వారు సర్కారుకు చెల్లించు పేష్కష్ కంటె ఎన్నోరెట్లు హెచ్చుగ నున్నది. ఈపద్ధతి పర్మనెంటు సెటిల్మెంటుకి వ్యతిరేకమై యున్నది.

పంతులు గారు జమీందారీ ఎంక్వయిరీ రిపోర్టును జమీన్ రైతులను సర్వవిధముల ఆదరించుటకు దీక్షను వహించుట ప్రశంసాపాత్రము. ఈరిపోర్టు భూమిపై రైతును సర్వ హక్కులు గలవానిగా చేయుచున్నది. భూమిని పండించుకొనుటకు, విక్రయించుకొనుటకు రైతు హక్కుదారుడు. జమీందారు వారిపై తగినంత శిస్తును వసూలుచేయుటకు అధికారి.

అతడు శిస్తు వసూలు చెల్లించవలెను గాని శిస్తును విధించువాడుగ నుండరాదనియే తెల్పుచున్నది. శిస్తులు చెల్లించలేని రైతులయొక్క భూములు వేలము వేయు అధికారము జమీందారు చేతులలో నుండరాదని యీ రిపోర్టు చాటుచున్నది.

జమీందారుకు వచ్చు ఆదాయములో కొంత మొత్తముకు ఇరిగేషను సౌకర్యములకై ప్రత్యేకపరచి ప్రభుత్వమువారి స్వాధీనమునందుంచవలసినదిగ ఈరిపోర్టు వక్కాణించుచున్నది. ఎస్టేటులోగల అడవులు, గనులు, బంజరు భూములు, పోరంబోకులు మొదలగు ప్రకృతి సంపదలన్నియు రైతులకు చెందబడవలసినదిగ యీ రిపోర్టు తీర్మానించుచున్నది.



ఎస్టేటులోగల చెర్వులక్రిందగల మాగాని భూములకు జమీందారులకు రైతులకు లేని అధికారములతో చెరువు నీటిని ఉపయోగించుకొనరాదని ఈ రిపోర్టు విశదపరచుచున్నది. రైతువారి భూమికి ఎట్లు శిస్తును చెల్లించి జలాశయములను వుపయోగించుకొనుచున్నారో అట్టి హక్కును మాత్రమే జమీందారునికి కూడ ఉండునని ఈ రిపోర్టు వెల్లడించుచున్నది. జమీనులు ఏర్పడినప్పుడు ప్రభుత్వమునకునూ జమీందారునకునూ మధ్య ఏర్పడిన షరతుల ననుసరించియే రెవెన్యూ మంత్రిగారు ఈ నూతన సంస్కరణను గావించ దీక్ష వహించిరి. కాని మరెట్టి విప్లవ బుద్ధితోడనూ కాదని రూఢిగ చెప్ప వచ్చును.

మాతృదేశ స్వాతంత్ర్యమునకయి తన సర్వస్వమును సమర్పించి నేడు కట్టు పుట్టముతో నిలచి త్యాగబలముచే ప్రజల పక్షమున రెవెన్యూ మంత్రియయిన ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులుగారు జమీందారుల బెదరింపులకు చెలింపక తయారుచేసిన రిపోర్టులోగల సకలాంశములను లేశమైన మార్పుచేయక, చట్టరూపముగ ప్రవేశపెట్టుట సర్వజన సమ్మతము. అది జన శ్రేయస్కరము. అనేక మాసములనుండి కృషిచేసి జమీందారీ ఎన్క్వైరీ రిపోర్టును తయారుచేసిన పంతులుగారికిని తదు సంఘ సభ్యులకునూ ఆంధ్ర రాష్ట్రీ కాంగ్రెసు పక్షమున వందన శతంబులు.

ఉత్తర విశాఖ జిల్లా రైతు సంఘాధ్యక్షులు శ్రీ పళ్లెల శ్యామసుందరరావు, ఎం. ఎల్. ఏ. గారు ఈ క్రిందివిధంగా ప్రకటిస్తున్నారు :

జమీందారీ విచారణ సంఘం 1937 సెప్టెంబరు మాసాంతంలో నియమింపబడింది. అసలు విచారణ 7 నెలలకుపూర్వమే పూర్తిఅయితే ఎందుచేత రిపోర్టు వెలువడలేదని రైతులంతా ఆత్రుతతో ప్రశ్నించుతూ ఉండేవారు. ఇప్పుడు వెలువడిన యీ అమూల్యమైన 17 సంపుటముల రిపోర్టు చూచిన తరువాత, విచారణ సంఘ సభ్యులు, అందు ముఖ్యంగా కమిటీ అధ్యక్షులు గౌరవనీయులు శ్రీ ప్రకాశం పంతులుగారు ఎంతశ్రమ, ఓపికతో యీ రిపోర్టు తయారుచేసి ఉంటారో ఒక్కొక్క హంశంపై అంత్యనిర్ణయము వచ్చేముందు యెన్నెన్ని గ్రంథములు పూర్వాపర సందర్భములు పరిశీలించి దీర్ఘముగా చర్చలు కొనసాగించియుంటారో ఆలోచించితే ఎవరికైనా ఆశ్చర్యంగా నుండకమానదు....

జమీందార్ల కృత్రిమ ఆందోళన

ఈ రిపోర్టు ఆధారంమీద, బిల్లు శాసనము అయ్యేవరకు, తమకు వంశపరంపరంగా సంక్రమించిన హక్కు అనుభవములకునూ, పరస్పర ఒడంబడికలకుండే పవిత్రతకున్నూ భంగము కలిగినదని జమీందారులు, వారిని ఆశ్రయించిన లాయరులు, పెద్ద ఆందోళన చేయక మానరు. ఇటుపైని ఎవ్వరు స్వంతఆస్తులు కలిగియుండుటకు వీలులేని విధానము, ఆస్తులపై గల, హక్కుభుక్తములు, ఇతరులకు చెందజేసే విప్లవ సూచకమైన సిఫార్సులు అమలు పెట్టుచున్నారని, జమీందార్లు వారిపై ఆధారపడియున్న న్యాయవాదులు, పత్రికాధిపతులు, ధనికవర్గము, వీరంతా ఏకమై రాష్ట్రములో లేనిపోనిఅందోళన లేవదీయకమానరు. బీహారు సంయుక్త పరగణాలు, బొంబాయి రాష్ట్రములలో జమీందారుల తీవ్రఆందోళనవల్ల కాంగ్రెసువారు కొంత రాజీపడవలసిన పరిస్థితులు యేర్పడినాయి.

కాంగ్రెసువారు మంత్రులుగా నున్నారుకదా, రెండు సభలలో వారికి కావలసినంత మెజారిటీ ఉన్నది కదా మనకేమి, రిపోర్టు అనుకూలంగా ఉంది గనుక మిగతా కర్మకాండంతా సానుకూలంగా సాగిపోతుందని ధీమాగా రైతులంతా పడుకుంటే ఇదివరలో మారుపోరియం బిల్లువలె, పురుటిలో సంధి ముంచి వేస్తుంది. ఋణ చట్టం మొదలు రైతులకొరకు ఋణస్థులకు ఏవిధంగా అనుకూలంగా ప్రకటింపబడి, కొనకు లేనిపోని విషమ షరతులు అనర్ధదాయకంగాను, పరిణమించాయో యీ ఎస్టేటులాండు బిల్లుకు చట్ట రూపము దాల్చి అమలు జరిగేసరికి అదే గతి పట్టుతుంది.

ఆనాడు ఋణచట్టము కొనకు సన్నగిల్లి పోవడానికి జమీందారులు, షాహుకారులు, బ్యాంకరులు, న్యాయవాదులు. వారి సహాయం పొందుతూన్న పత్రికలు, చేసిన తీవ్ర ఆందోళనే కారణం. అప్పుడు రైతులు తగినంత ఆందోళన చేయలేదు. గనుక యీసందర్భంలో మన రాష్ట్రములో రైతులంతా యేమరుపాటున, అంతా కాంగ్రెసువారు చేస్తారులే అని ధీమాగా ఊరుకోకుండా యీరిపోర్టుకు అనుకూలముగా ప్రజాభిప్రాయం కలిగే


(మిగతా 16 వ పేజీలో)

హైదరాబాదులో

అత్తవారింటికిపోయే అల్లుడి అవస్థలు

హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసు 11 వ డిక్టేటరు జి. రామారెడ్డిగారిని లాకప్‌లో కొట్టడం, మర్మ స్థానాలపై కాల్చడమే కాకుండా, నడరంధ్రాలలోనూ కారప్పొడిని కొట్టారు. 12 వ డిక్టేటరుతో బాలకిదాన్ అనే సామాన్య పౌరునికూడా అరెస్టు చేశారు. అయన బెయిలుమీద విడుదలఅయి వచ్చి తనను లాకప్‌లో పోలీసులు కొట్టారని చెప్పగా వారిని ప్రముఖులయిన వైద్యులకు చూపారు. వారందరూ కలసి ఒక సర్టిఫికెట్టును ఇచ్చారు. శాసన సభా సభ్యులయిన యం. నరసింగరావుగారు దీని విషయమై పై అధికారులకు తెలియచేశారు. ఈ హింసా విధానం పట్ల ప్రజలలో అసంతృప్తి బయలుదేరింది. 13 వ డిక్టేటరుతో ఇద్దరు మహమ్మదీయులుకూడా అరెస్టు చేయబడ్డారు. కాని వీరు అపాలజీ ఇచ్చారని పోలీసులు కోర్టులో చెప్పారు. కేసు పూర్తిగా విచారణ అయే వరకూ అపాలజీ ఇచ్చిన వారిని విడుదలచేయవద్దని మేజస్ట్రీటు ఆజ్ఞాపించారు. జైలులోనుండి అపాలజీ ఇచ్చి వచ్చిన వారంతా తమకు లాకప్‌లో జరిగిన హింసను నిదర్శన పూర్వకంగా చూపిస్తోంటే ఇక ఏం చేస్తాడు పాపం?

యస్. యస్. రాజశేఖరం అనే అన్నామలయి యూనివర్సిటీ విద్యార్థి శెలవులకు కరీం నగరములో (హైద్రాబాదు) నున్న అత్తవారింటికి బయలుదేరి వచ్చి ఖాజీపేట రైల్వే స్టేషన్‌లో రాత్రి దిగి మరునాడు బస్సుకు వెళ్ళుతోంటే పోలీసులు పట్టుకొని హనుమకొండ పోలీసు స్టేషనుకు తీసుకువెళ్ళి అతనిని పరీక్ష చేసి సంస్థానం వదలి పొమ్మన్నారు. అత్తవారింటివద్ద రెండు రోజులే ఉండి వస్తాననియు, అంతవరకు నమ్మకము చాలకపోతే తనతో పోలీసు ఉద్యోగిని పంపినచో తానే వారి ఖర్చులన్నీ భరిస్తాననియు కోరాడు, అదీ కాకపోతే తన మామగారికి జాబు వ్రాసి వారు వచ్చేవరకూ హనుమకొండ స్టేషన్‌లోనే ఉండి వారితో



11 వ డిక్టేటరు
జి. రామా రెడ్డి

మాట్లాడి వెళ్ళిపోతానని చెప్పాడు. నైజాం పోలీసు అధికారులు దేనికీ ఒప్పుకొనక ఆయనను బెజవాడకు తీసుకువచ్చి వదలిపెట్టి వెళ్ళిపోయారు. ఖాజీపేటలో యీయనను పట్టుకొన్నది మొదలు బెజవాడలో ఈయనను వదలి, పోలీసులు వెనుకకు పోయేవరకూ అంతటికీ అయిన ఖర్చు అంతా రాజశేఖరంగారి నెత్తినే రుద్దారు.

సంస్థాన ప్రజలకీ, యితర ప్రాంతీయులకీ మధ్య నున్న సంబంధాన్ని ఎంతవరకూ త్రెంచి వేయాలని నైజాం ప్రభుత్వం తలుస్తూన్నదీ యీ ఘటనల వలన తెలుస్తుంది.

జాదేవపల్లిలో సత్యాగ్రహుల ఫొటోలు తీసినందుకు 3 గురిని అరెస్టు చేశారు. హైదరాబాదులో ఫొటోలు తీయించుకొంటే సత్యాగ్రహం కోసమేనని అందరినీ ఫొటో గ్రాఫులను తీయించుకోనీయడంలేదు. ఇక విద్యార్థుల పోరాటం రోజు రోజూ వ్యాపిస్తోంది. అఖిల హైదరాబాదు విద్యార్థి దినోత్సవం జరపాలని సమ్మెదారులు విద్యార్థులను కోరారు. గుల్బర్గా కాలేజిలో విద్యార్థుల సమ్మె చేస్తూన్నందుకు 300 మంది పేర్లు పూర్తిగా కొట్టేశారు. పికెటింగు చేస్తూన్నారని విద్యార్థులను అరెస్టు చేశారు. వందేమాతరం గీతాలు, దేశీయ గీతాలు, దేశనాయకుల చిత్రాలు వున్న గృహలక్ష్మి, తుకారాం మొదలగు ఫిలిములను సంస్థానంలో ప్రదర్శించరాదని ప్రభుత్వాధికారులు నిషేధించారు. విద్యార్థుల పోరాటముయొక్క ఆశయము "ప్రార్థన హక్కు" నిలుపుకొనుట ఇది పౌర హక్కు. సంపూర్ణ బాధ్యతాయుత ప్రభుత్వం సంస్థానంలో లేకుండా పౌర హక్కులు నిలుపుకోలేము. అందుచే బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపనకై పని చేసే స్టేట్ కాంగ్రెసుయొక్క ఆశయం కోసం విద్యార్థులుకూడా పోరాడాలి.

సంస్థాన ప్రజా ఉద్యమం

భారత దేశంలోని వివిధ సంస్థానాలలో జరుగుతూన్న ప్రజా పోరాటం సంస్థానాధీశుల నందరినీ ఒక పక్కకు చేర్చింది. వారంతా బ్రిటిషు ప్రభుత్వానికి దాసాను దాసులవటంవల్ల ప్రజా పోరాటాన్ని నాశనం చేయడానికి బ్రిటిషు ప్రభుత్వం సర్వదా వారికి సాయం చేస్తూనేఉంది. అఖిల భారత ముస్లింలీగు నాయకులు కూడా ఈ అభివృద్ధి నిరోధకుల ఆటలకు వెనుక తాళం వేస్తూ సంస్థానాలలోని ప్రజా ఆందోళనను ఖండించారు.

పెద్ద పెద్ద సంస్థానాలయిన తిరువాన్కూరు, హైదరాబాదు, మైసూరు, కాశ్మీరం మొదలయిన సంస్థానాలన్నిటిలోనూ ఒక మైసూరులో తప్ప బాధ్యతాయుత ప్రభుత్వం కోసము ప్రస్తుతము ప్రత్యక్ష పోరాటము జరుగుతూనే ఉంది. సంస్థానాధీశుల నిర్బంధ విధానం, నాగరిక ప్రపంచాన్నంతా కదలింప జేస్తోంది. తిరువాన్కూరులో క్రిమినల్ లా అమెండుమెంటు అక్టును విశాల మొనర్చారు. వలంటీరు దళాన్ని నిషేధించారు.

కొల్హాపూర్ మొదలయిన దక్షిణ భారత సంస్థానాలలోకూడా బాధ్యతాయుత ప్రభుత్వము కావాలని ఆందోళన బయలుదేరింది. బొండు ప్రభువు ఈ ఆందోళనకు జడిసే బాధ్యతాయుత ప్రభుత్వ సూత్రాన్ని అంగీకరించాడు.

ఒరిస్సా రాష్ట్రంలోని ఢేంకానల్, టాల్చేర్, నీలగిరి సంస్థానాలలో లాఠీ చార్జీలు. పోలీసు కాల్పులు దిన చర్యలయి పోయాయి. ప్రభుత్వాధికారుల హింసలను భరించలేక వేలకొద్ది ప్రజలు బ్రిటిషు సరిహద్దులలోకి వచ్చేస్తున్నారు. ప్రజా మండలి పట్ల సానుభూతి ఉన్నట్లు అనుమానంతోచిన ప్రతి వ్యక్తికీ ఆ సంస్థానాలలో ఉండేటందుకు ఆస్కారంలేదు. హింస జరిగిందంటారేమోననే భయంతో చేతి కర్రలుకూడా వదలి రైతులు తిరుగుతున్నారు.

పశ్చిమ సంస్థానాలలో రాజకోటలో ప్రజా పరిషత్తు నిషేధింప బడింది. 1612 మందిని ఇప్పటికి అరెస్టు చేశారు. శాసన సభాధ్యక్షులు పోపట్లాల్ ఆనంద్ గారు కూడా నిర్బంధ శాసనాలను ధిక్కరించి ఉపన్యసించారు. ప్రభుత్వం వారినీ అరెస్టు చేసింది.

రాజపుత్ర స్థానం కూడా కదిలింది మీవార్‌లో ప్రజా మండలి నిషేధింప బడింది. మొదటి దళంలోనే వీర వనితలు పోరాటంలోకి వచ్చారు.

మధ్య పరగణాలలో రాజనంద గావ్ సంస్థానంలో పౌరస్వత్వ హక్కులపై పోరాటం సాగుతోంది. కార్మిక వర్గ సమ్మె ఫలితంగా ఇది ప్రారంభ మయింది.

పంజాబ్ సంస్థానాలలో కూడా పోరాటం సాగుతూనే ఉంది. రాష్ట్రంలో గవర్నరు సంస్థాన రక్షక శాసనాన్ని అమలు జరిపాడు. కాల్సియా సంస్థానములో 125 మంది రాజకీయ ఖైదీలు తమకు జైళ్లలో జరిగే అక్రమాల నివారణకై నిరాహార దీక్ష బట్టారు. బట్టలు కట్టుకోడం మానేశారు, అనేకచోట్ల పౌరసత్వ హక్కుల కొరకు ఆర్థిక, రాజకీయ హక్కులకొరకు పోరాటం ప్రారంభమై సాగుతోంది. భారత దేశమంతటియొక్క సంపూర్ణ స్వాతంత్ర్యము కొరకు పోరాడే కాంగ్రెసు మహా సభ దీని ఏల తాటస్థ్యం అని ఈవరకు అంది. ఈ తీర్మానానికి కారకుడైన మహాత్మాజీయే పరిస్థితులుమారాయి. కాంగ్రెసు జోక్యము కలుగ జేసుకుంటుంది అన్నాడు. వెంటనే, యీ తాటస్థ్యాన్ని అఫు చేయించాలి. భారతీయులందరూ ఫెడరేషన్‌ను ప్రతిఘటించే పోరాటంగా దీనిని మార్చాలి.

1929 లో అమెరికాలో ఆర్థిక క్షోభ ఆరంభ మయింది. క్రమేణ ప్రపంచాన్నంతా ఆవరించింది. దాని ఫలితంగా, జర్మనీ యుద్ధ నష్టపరిహారాలను ఇవ్వడానికి నిరాకరించింది. లాసెన్సులో అన్ని ప్రభుత్వాలు కలసి జర్మనీ ఇక ముందు అప్పు ఇవ్వ నవసరములేదని, ఒడంబడికకు వచ్చాయి. 1931 లో ఇంగ్లండులో కార్మిక ప్రభుత్వాన్నిమాని జాతీయప్రభుత్వాన్ని, ధనికుల ప్రభుత్వాన్ని, రామ్సేమాక్డొనాల్డు ఏర్పరిచాను, జపాను మంచూరియాను మ్రింగింది. 1931 లో స్పెయినులో రాజరికం నాశనమై ప్రజాస్వామిక ప్రభుత్వం వచ్చింది. 1930—33 లలో భారత దేశాన కూడ బ్రహ్మాండమగు జాతీయ పోరాటము సాగింది. 1933 లో జర్మనీలో హిట్లరు నాజీ పాలన వచ్చింది. ఈఆర్థిక క్షోభ తగ్గిపోకమునుపే ఆస్ట్రియాలో కార్మికుల నణచివేసి డాల్ఫసు ఫాసిస్టు పరిపాలన నెలకొల్పాను. 1934 ఫిబ్రవరిలో ఫ్రాంసులో ఫాసిస్టు ప్రభుత్వమును ఏర్పరచడానికి ప్రయత్నించారు కాని కార్మికుల ఐకమత్యము దాన్ని భగ్నపరచింది.

1937 లో అమెరికాలో ఆర్థిక క్షోభ తిరిగి ఆరంభమయింది. అన్ని దేశాలకు వ్యాపిస్తూ ఉంది. 1937 లో ఉత్పత్తి అయ్యే సరుకులో, నూటికి 40 వంతున నేడు అమెరికాలో తగ్గిపోయింది. యూరపు ఖండ మందలి దేశాలలో నూటికి 4 లేక 5 కన్న పడిపోయినను, క్రొత్త ఉద్యమస్థ రావడము లేదు. అంతే గాక అమిత ముగు ఆయుధ సామగ్రిని తయారు చేయడము వలన, ఉత్పత్తి పడిపోయినట్లు లెక్కలలో కన పడడము లేదు. ఆయుధ సామగ్రిని తీసివేసి లెక్కలను ప్రకటిస్తే, యూరపుదేశాలలోనైతం ఉత్పత్తి చాల పడిపోయిందని తేలుతూ ఉంది. ఈ నూతన ఆర్థిక క్షోభ ఫలిత మేమిటో, ప్రపంచ రాజకీయాలకు ఏవిధంగా అల్లకల్లోలం గావిస్తూ ఉందో చూస్తాము

1937 లో జపాను ప్రభుత్వము చైనాను ఆక్రమించడానికి చైనాపై దాడి నారంభించింది.)

మొదటి ఆర్థిక క్షోభనుండి తట్టుకోలేక ఇటలీ ఆ చిక్కునుండి బయటపడడానికి అబిసీనియాను ఆక్రమించుకుంది. అబిసీనియా సమస్యలో చిక్కుపడిఉన్నప్పుడు జర్మనీలో ఇటలీ ఒడంబడికకు వచ్చింది. దాని ఫలితం, 1938 మార్చి నెలలో జర్మనీ ఆస్ట్రియాను ఆక్రమించు కొన్నప్పుడు ఇటలీ ఇంతవరకు చూపించిన వ్యతిరేకతను మాని, జర్మనీ పనికి అనుకూలతను చూపింది. ఈ అనుకూలతకు మరియొక కారణము స్పెయినులో అంతర్యుద్ధాన్ని పురిగొల్పి ఫ్రాంకోకు విపరీతంగా ఇటలీ సాయము చేయడము కూడ. ఈ పరిస్థితులలో జర్మనీతో సఖ్యపడక ఎట్లు వ్యతిరేకించ గలదు?

1938 సెప్టెంబరు 30 వ తారీఖున మ్యూనిక్ ఒడంబడికతో జెకోస్లోవేకియా విన్నాభిన్నము అయింది. జర్మనీ క్రింద, కాలనీ అయిపోయింది. ఈ మ్యూనిక్ ఒడంబడిక ప్రపంచ రాజకీయాలను తారుమారు చేసింది. దీని ఫలితాలేమిటి?

గత డిశంబరు 29 తారీఖు నవశక్తిలో ఈ విషయమును గూర్చి వ్రాయునపుడు ఈ క్రింది శక్తులు ప్రతిశక్తులూ ఉన్నాయని చూశాము.

1. రష్యామీద మిగిలిన పెట్టుబడిదారీ ప్రభుత్వాల కక్ష.

2. వివిధ పెట్టుబడిదారీ ప్రభుత్వాల మధ్య కక్షలు.

3. పెట్టుబడిదారీ దేశాలలో ప్రభుత్వాధికారం గల ధనిక వర్గానికి కార్మిక వర్గానికి మధ్య గల పోరాటము.

పెట్టుబడిదారీ ప్రభుత్వాల క్రింద నలిగిపోతూ ఉండే దేశాలలోను కాలనీలలోని, ప్రజా సామాన్యము యొక్క స్వాతంత్ర్య పోరాటాలు.

మ్యూనిక్ ఒడంబడిక ఫలితంగా జెకోస్లోవేకియా భగ్నము కావడమేగాక, లిటిల్ ఎంటెటీనాడ భగ్నమయింది. అంటే జెకోస్లోవేకియా, రుమేనియా, యుగోస్లేవియాలు కలసి యుండడము పోయింది. ఈ మూడు రాష్ట్రాలు ఫ్రాంసుకు ఈవరకు సహాయకాలుగా ఉండేవి. నేడున్నారో యుగోస్లేవియా ఇటలీవైపు మ్రొగ్గింది. జెకోస్లోవేకియా పూర్తిగా జర్మనీ కాలనీ అని చెప్పవచ్చు. జెకోస్లోవేకియాలోని ఒక భాగమైన స్లోవేకియా ఫాసిస్టు పరిపాలన ఆరంభించింది. దాని ప్రధానామాత్యుడు, జెకోస్లోవేకియా నుండిదీని అవిదానన్నే అవలంబించేటట్లు చేస్తాను అని ప్రకటిస్తూ ఉన్నాడు.

రుమేనియా ఇంకను జర్మనీ వలువిడిలోకి రాలేదు. కారణము గతవారము సూచించినట్లు రుమేనియాలోని గోధుమలు, పెట్రోలు జర్మనీకి వశమయితే జర్మనీ బలమును విపరీతముగా పెరిగిపోవునని ఇంగ్లండు భయపడి



ఫ్రెంచి విదేశాంగ మంత్రి
బోనెట్

రుమేనియా రాజు కెరోలుకు సహాయం చేస్తానని వాగ్దానమిచ్చింది. కాని యూరపులోని అన్నేమదిక రాజ్యాలలో జర్మనీ తన వర్తకమును పెంపొందింపనుంచే తనకేమీ అభ్యంతరము ఉండదని లండను టైమ్సు పత్రికద్వారా బ్రిటిషు ప్రభుత్వము వెల్లడించిందని గత వారం. చూచాము. అంతేగాక రుమేనియాకు గత ఐరోపా యుద్ధఫలితంగా వచ్చిన భూభాగాలను తిరిగి ఇచ్చివేయమని హంగరీ, బల్గేరియాలు ఆందోళన చేస్తూ ఉన్నాయనికూడ చూచాము. ఈరెండును జర్మనీ ప్రాబల్యము నందున్నాయి. వీనిని నెపంగా తీసుకొని రుమేనియాపై జర్మనీ ఒత్తిడితెస్తే, ఫ్రాంసు ఇంగ్లండులు రుమేనియాకు సహాయానికి పోతాయనుకోవడం వెర్రితనం. కెరోలును నాజీ పత్రికలు అప్పుడే దూషింపసాగాయి. రుమేనియాలో 'అల్లరులు' విరివిగా వ్యాపిస్తున్నాయి

హంగరీ, జెకోస్లోవేకియాలో ఒక భాగమైన రుథేనియాను తన కివ్వలేదని అసంతృప్తిచెంది ఉంది. పోలండుకూడ రుథేనియాను ఆక్రమించు కోవాలని పోలండు హంగరీలు ఉత్సాన్నుండి, దక్షిణానుండి రుథేనియాతో యుద్ధము రహస్యంగా చేస్తున్నాయని వార్తలు వస్తున్నాయి. అయినా హిట్లరు పోలండు యుక్రెయినును, సోవియటు యుక్రెయినును లాగుకోడానికి రుథేనియానుండి ప్రచారము ఆరంభిస్తాడు.

జర్మనీ ప్లానులన్నీ రుమేనియా నేడు వ్యతిరేకిస్తూ ఉంది. హంగరీ పోలండులు అసంతృప్తి చెంది ఉన్నాయి.

బాల్కను ఎంటెటీ (గ్రీస్, రుమేనియా, యుగోస్లేవియా, టర్కీ) సేనానాయకులు కలసి సంప్రతింపులు చేసుకోవడము, ఒకే నిర్ణయాలకు రావడము కూడ అంత ప్రాధాన్యము కాదు. జెకోస్లోవేకియాను హిట్లరు ఆక్రమించుకోడానికి ఒకనెల ముందు, హంగరీ లిటిల్ ఎంటెటీతో (రుమేనియా, జెకోస్లోవేకియా, యుగోస్లేవియాతో) ఒకదానిపై నొకటి యుద్ధం చేయమని సంధి చేసుకుంది. కాని హంగరీ జెకోస్లోవేకియాపై దాడి వెడలడము, నేడు రుమేనియానుండి సరిహద్దులు మార్చుకోవాలని ఆందోళన చేయడం మనం చూస్తూఉన్న దే అలాగే బల్గేరియా కూడ బాల్కను ఎంటెటీలో నాన్ అగ్రెషనుపాక్టు (యుద్ధం చేయననే ఒడంబడిక) చేసుకుంది. కాని తిరిగి సరిహద్దులు మార్చుచేయాలని అదికూడ విపరీతంగా ఆందోళనచేస్తూ ఉన్నదికూడ మనము చూస్తూఉన్న దే అందుచే బాల్కను ఎంటెటీ సేనానాయకుల సంప్రతింపులకు ఎక్కువ విలువ మన మివ్వ నవసరములేదు.

ఇవిఅన్నీ జర్మనీ ఇటలీ సమ్మేళానికి ప్రతికక్షగా ఫ్రాంసు ఇంగ్లండుల సమ్మేళనము ప్రోత్సహించే తిరుగుబాటులు కాని జర్మనీని పూర్తిగా ఎదుర్కోడానికి మొదటిమెట్టుగా ఫ్రాంసు ఇంగ్లండులు వీనిని ప్రోత్సహించడము లేదు. కేవలము జర్మనీ, ఇటలీలతోటి బేరాలలో ఫ్రాంసు ఇంగ్లండులు ఎక్కువ రాబట్టుకోడానికి చేసే ప్రయత్నాలే.

అదేవిధంగా ఇటలీ, టునీసియా, కార్సికా, నైస్‌లను తన కిచ్చివేయమని చేసే ఆందోళనయు. జర్మనీ తన పూర్వపు కాలనీలను తన కిచ్చి వేయవలసినదని చేసే ఆందోళనయు, జర్మనీ ఇటలీలు, ఫ్రాంసు ఇంగ్లండులతో తాము చేసే బేరాలలో ఎక్కువ రాబట్టుకోడానికి చేసే ప్రయత్నాలే. ఇంగ్లండు అమెరికాల మధ్య జరిగిన వర్తకపు ఒడంబడిక, యూదులను హింసిస్తూ ఉండే, మహా కోపాన్ని వెల్లడించడము, ఈవరకు జర్మనీ కాలనీలో యూదులకు నివాస మేర్పరుస్తామని చాంబర్లేను పలకడము ఇవి కూడ ఈ బేరాల కుపయోగించేవే.

ఈ బేరాలలో ఇంగ్లండు ఫ్రాంసులు ఎక్కువ సంపాదించుకోవచ్చు. లేక జర్మనీ ఇటలీలు ఎక్కువ సంపాదించుకో వచ్చు. అసలు ఈ ప్రయత్నాలన్నీ సోవియటు యూనియను వ్యతిరేకంగా కలవడానికి నాలుగురాజ్యాల ఒడంబడికకు ప్రాతిపదికకంటే రాయబారా లంటే. సంప్రదింపులంటే ఆశ్చర్యపడాలసిన అవసరం లేదు. ఈనాలుగు రాజ్యాలు తమలోని పరస్పర కక్షలు మానుకొని శాశ్వతంగా కలసి ఉంటాయని మేమనడము లేదు. కాని సోవియటు యూనియనుకూ వివిధ పెట్టుబడిదారీ ప్రభుత్వాలకూ మధ్య ఉండే కక్ష ఎదుట, ఈవివిధ సామ్రాజ్యవాద ప్రభుత్వాల మధ్య ఉండే కక్ష తాత్కాలికముగా మరుగుపడింది.

ఈ విషయము ఈ క్రింది సంగతుల వల్ల స్పష్టమవుతుంది.

1. జర్మనీ వర్తక వ్యాపారముల యూరపు ఆగ్నేయ మూలయందుండు దేశాలలో చేసుకుంటే అభ్యంతరము లేదని టైమ్సు పత్రిక ప్రకటించుట.

2. ఒక వైపు ఇటలీ ఫ్రాంసు నుండి టునీసియా (ట్యునిస్) కార్సికా, నైస్‌లు కావాలని ఆందోళన చేస్తూవున్నది. అయినా, జర్మనీ-ఫ్రాంసులు "ఒకదానిపై నొకటి యుద్ధము చేయకొమనే" ఒడంబడికను ఇటలీకి ముందుగా రిబ్బను ట్రాప్ చూపిస్తే, దానిని ఇటలీ ఆక్షేపించడము.

3. బోనెట్, ఫ్రెంచి విదేశాంగ మంత్రి పై ఒడంబడికపై సంతకము చేసిన పిదప ఇచ్చిన ఉపన్యాసములో "నేడు రెండు సమ్మేళనాలు ఉన్నాయి. వీని రెంటిని ఒకటిగా చేయడానికి పూనుకొంటున్నాము." అని చెప్పడము.

4. డిశంబరు 9వ తారీఖున ఫ్రెంచి మంత్రి వర్గముపై విశ్వాసరాహిత్య తీర్మానాన్ని చర్చిస్తూ ఉన్నప్పుడు, నేడు అవలంబించిన విధానాన్ని (అంటే మ్యూనిక్‌యందు ఆరంభించిన విధానాన్ని) మానివేయను. దానినే కొనసాగిస్తానని దలదీయ ప్రకటించడము.

5. పీరో, దక్షిణ ఆఫ్రికా మంత్రి, జర్మనీకి వెళ్ళి, వస్తూ ప్రపంచ యుద్ధ భయము చాల ఎక్కువగా ఉంది. కాని దానిని రానివ్వకుండా ఛాంబర్లేను చేసే ప్రయత్నాలు మాత్రమే ఆశాజనకంగా ఉన్నాయని ప్రకటించడము.

6. ఫ్రాంసుపై ఇటలీ ఇన్ని కారాలు మిరియాలు నూరుతూ ఉన్ననూ ఛాంబర్లేను ఇటలీకి సంప్రతింపుల కోసం వెళ్ళదలచుకోవడము.

7. ఫ్రాంసు ఇంగ్లండులు, జర్మనీ ఇటలీలను ఎదుర్కోవాలని నిజంగా ఉద్దేశిస్తే స్పెయిను ప్రభుత్వ విషయములో మౌనము వహించడము ఆత్మవినాశకరము. అంతేగాక ఆంగ్లో ఇటాలియను ఒడంబడికలోని క్లాజుల బ్రిటిషు ఫాసిస్టు ప్రభుత్వాలతో ఏలా కలసి పని చేయదలచుకొంది. స్పెయినును ఏ విధంగా ద్రోహము చేయదలచుకుందీ స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఆ క్లాజులివి :—

1. పశ్చిమ మేడిటరేనియనులో ఉన్న ప్రస్తుత సరిహద్దులను ఈలాగే ఉంచాలి.

2. అరేబియాలోని సౌదీ అరేబియా ఎమెన్‌లయొక్క స్వాతంత్ర్యాన్ని గుర్తించాలి. కాని ఈ రెండు దేశాలలో మరియే యితర దేశము కూడ ప్రత్యేక సౌకర్యము పొందకుండా చూడాలి.

3. ఏడెనుపై బ్రిటిషు అధికారాన్ని ఇటలీ అంగీకరించాలి. ఇటలీ ప్రజలు స్వేచ్ఛగా

ప్రపంచాన్ని తారుమారు చేసే శక్తులూ: ప్రతి శక్తులూ.

ప్రచారము చేసుకోడానికి అవకాశ ఉండదు. ఒప్పుకు ఉంటుంది.

4. బ్రిటను ఇటలీలు ఒకదాని కొకటి వ్యతిరేకంగా హానికరమైన ప్రచారం చేయకూడదు.

5. సూడాను, ఈజిప్టులు నీటిని పంపకము చేయు బ్లూ నైలునదీ జన్మస్థానమైన టానా సరస్సు (అబిసీనియాలోనిది) అడ్డకట్ట కట్టి ఇంకొకవైపుకు ప్రవహించునట్లు ఇటలీ చేయరాదు.

6. శాంతిసమయములోనైనా, యుద్ధ సమయములోనైనా సూయజుకాలువను ఎప్పుడూ నౌకాయానానికి తెరచి ఉంచాలి.

7. లిబియాలో ఇటలీ తన సైన్యాన్ని సగానికి తగ్గించాలి.

8. ఈలోపల ఇటలీ తన సైన్యాన్ని స్పెయిన్ తీసికొనిపోకుండా ఉంటే, స్పెయిన్‌లో అంతర్యుద్ధం ముగిసిన పిదప తీసికొనిపోవాలి. స్పెయినులో ఏ భాగాన్ని గాని ఇటలీ వశపచ్చుకోకూడదు. స్పెయినుపై రాజకీయాధికారాలను చెలాయించకూడదు.

ముఖ్యముగా ఎనిమిదవ క్లాజునుబట్టి ఇటలీ స్పెయిను ప్రభుత్వము ఓడిపోయేవరకు యుద్ధం చేస్తూ ఉండవచ్చు, ఇంగ్లండు దానికెట్టి అభ్యంతరమూచెప్పక పైగా సాయముకూడ చేస్తుంది!

గతవారము మేము సూచించినట్లు నాలుగు రాజ్యాల ఒడంబడికకోసం ఎట్టి గట్టి ప్రయత్నాలు బ్రిటిషు ప్రభుత్వము చేస్తూ ఉందీ పై విషయాలు సూచి చేస్తున్నాయి.

గత డిశంబరునెలలో, సామ్రాజ్యవాద ప్రభుత్వ వైరుధ్యాలలో నొకటి: ఫ్రాంసు—ఇంగ్లండులకు మధ్య గల వైరుధ్యము. మ్యూనిక్ ఒడంబడికతో ఫ్రాంసు ఐరోపా ఖండమందు తన ప్రథమస్థానాన్నికోల్పోయింది. నేడు జర్మనీ ఇటలీలు కలసి పనిచేస్తూ ఉన్నప్పుడు, బ్రిటనుపై ఆధారపడి బ్రిటను ఎలా చెప్పితే అలా చేయడం ఫ్రెంచి బూర్జువా వర్గానిక తప్పనిసరి అయింది. ఇటలీ గత డిశంబరునాటికే, తాను అబిసీనియాలోను, స్పెయినులోను ఇరుక్కొ-బట్టి జర్మనీ చేతిలో కీలుబొమ్మయింది. అంటే జర్మనీ ఇటలీ సమ్మేళనములో జర్మనీది పైచేయి. జర్మనీ గట్టిగా దబాయిస్తే ఇటలీ లొంగి జర్మనీ ఏమి చెప్పితే అలా చేస్తుంది. ఈవిషయము మొన్న హంగేరీకి రుథేనియాను ఇవ్వకూడదని జర్మను పట్టు పట్టినపుడు, ఇటలీ సరే ననడములో మరింత స్పష్ట మయింది. అలాగే ఇంగ్లండు ఫ్రాన్సుల సమ్మేళనములో ఇంగ్లండుది పైచేయి. అందుచే నేడు యూరపు రాజకీయాలు జర్మనీ—ఇంగ్లండుల మధ్యనుండు పోటాపోటీలే తప్ప మరేమీ కావు. కాని సోవియటు యూనియనుపైనున్న కక్షవల్ల జర్మనీవైపుకు బ్రిటను మొగ్గడం మనము చూచాము. ఈ కక్షవల్లనే జపానును వ్యతిరేకించకుండా తనకు నష్టము కలుగుతూఉన్ననూ బ్రిటిషు ప్రభుత్వం మిన్నకుండా ఉంటూ ఉంది. బర్మా ద్వారా ఆయుధాలను పోనివ్వడము ఒక గొప్ప విషయముకాదు. ఈదారిని పోనివ్వకుంటే సోవియటు యూనియను నుండి ఔటరు మంగోలియాగుండాగాని, సికియాంగు గుండా గాని చైనాకు ఆయుధాలు వెళ్తూతాయి.అందుచే వచ్చే వర్తకాన్ని వృథాగా పాడుచేసుకోక మెండకని బర్మాగుండా ఆయుధాలను పోనిస్తూ ఉంది.

ఈ సమయములో అమెరికా వ్యవహరమేమిటని చూడడము చాల అవసరము. గత వారము ప్రెసిడెంటు రూజ్‌వెల్టు ఉపన్యసించినట్లు, అమెరికా ప్రజాతంత్ర రాజ్యాలలో పెద్దది. బలిష్ఠమయింది. అది ఎట్టి విధానాన్ని అవలంబించి పనిచేయ మొదలిడుతుందో, దాని ననుసరించి ప్రపంచ భవిష్యత్తు ఉంటుంది. కాని అమెరికా ప్రపంచ రాజకీయాలలో పాల్గొనే విధానము ఈ క్రింది విషయాలపై నాధారపడి ఉంటుంది.

1. సోవియటు రష్యాకును-ప్రపంచ పెట్టుబడిదారీ ప్రపంచానికిని గల వైరుధ్యము.

2. అమెరికా—ఇంగ్లండులకు మధ్యనున్న వైరుధ్యము.

3. అమెరికా-జపానుల మధ్యనున్న వైరుధ్యము.

ఇంగ్లండు, జర్మనీ జపానులతో రాజీ చేసుకోడానికి ప్రయత్నించడము చూచింది అమెరికా. ఇంగ్లండు, జర్మనీ జపానులతో కలిస్తే, తన వర్తక వ్యాపారానికి దెబ్బ తగులుతుందని అమెరికా గ్రహించింది. అమెరికా వర్తకము ఎక్కువ భాగము బ్రిటనుతో, బ్రిటిషు డొమినియన్లతో ఉంది. ఈ వర్తకాన్ని జర్మనీ ఇంగ్లండులు పంచుకుంటాయేమోనని భయము పట్టుకుంది. దీనిలోపాటు జర్మనీ, దక్షిణ అమెరికాలో తన వర్తకాన్ని చాల విరివిగా వ్యాపింపజేసుకొంది. ఈ వరకు దక్షిణ అమెరికాలో ఇంగ్లండు వర్తకానికి కూడ స్థానము లేకుండ అమెరికా వర్తకము చేస్తూ ఉండేది. జర్మనీ వ్యాపార వ్యాపకముతో అది పడిపోసాగింది.

జపాను చీనాను ఆక్రమించుకోడానికి ప్రయత్నించడము, యాంగిట్సికియాంగు నదిలో మరే దేశపు నౌకలను పోనివ్వక పోవడము, మంచూరియా, చైనాలలోకి ఇతర దేశాలు స్వేచ్ఛగా వర్తక వ్యాపారాలు చేసుకోడానికి అవకాశాలు కలుగజేయక అభ్యంతరాలు కలుగ జేయడము, వీనివలన అమెరికా వ్యాపారము చీనాతో చాల మందగించింది.

ఫ్రాన్సు ఇంగ్లండులు, జర్మనీ ఇటలీలతో కలిస్తే, బ్రిటిషు సామ్రాజ్యంలోను, ఫ్రెంచి సామ్రాజ్యములోను, చైనాలోను, కడకు దక్షిణ అమెరికాలో కూడ శాశ్వతంగా ఉండిపోయి వర్తక వ్యాపారాలలో నష్టము పొందక తప్పదని అమెరికా ఊహించింది. ఆ పరిస్థితులలో అమెరికా తన లాభాలను రక్షించుకోడానికి సోవియటు యూనియనుతో కలువవలసి ఉంటుంది. ఇది అమెరికా బూర్జువాకు ఏమాత్రమూ ఇష్టం లేదు. అందుచే ఏదో ఒకవిధంగా ఇంగ్లండును జర్మనీతో కలువనీయక తనవైపుకు ఆకర్షించుకోవాలని అమెరికా ప్రయత్నిస్తూఉంది. దీని ఫలితమే అమెరికా తన టారిఫులను (రక్షణ సుంకాలను) 600 వస్తువుల పైనుండి తగ్గించి బ్రిటిషు ప్రభుత్వ వ్యాపారానికి సాయము చేయడానికి పూనుకుంది.

అమెరికాలో యూరపులోకన్న వస్తూత్పత్తి ఎక్కువగా పడిపోయిందని మనము చూచియున్నాము. యూరపులో ఆయుధ సామగ్రిని తయారుచేస్తూ ఉండబట్టి అంత ఎక్కువగా పడిపోలేదని కూడ చూచాము. అమెరికాకూడ తన ఆర్థిక చిక్కులనుండి బయట పడడానికి ఆయుధ సామగ్రిని పెంపొందించు కుంటూ ఉంది.

అంతేగాక, అమెరికా, ఇంగ్లండును జర్మనీ నుండి దూరము చేయాలనుకుంటే యూరపు రాజకీయాలలో మునుపటివలె తటస్థము వహించక, జోక్యము కలిగించుకోవాలని యుంటుంది. దానికి కావలసిన బలాన్ని ప్రదర్శించాలసి ఉంటుంది. దీనికోసంకూడ అమెరికా ఆయుధాలను పెంపొందించుకుంటూ ఉంది.

ఒకవేళ బ్రిటను ఆఫ్రికాలో కొన్ని కాలనీలను, పోర్చుగల్, బెల్జియము కాలనీలను జర్మనీకి వశము చేస్తుందేమోనని వదంతులు, వార్తలు విరివిగా వస్తున్నాయి. అట్టిచో జర్మనీ దక్షిణఅమెరికాకు పోర్చుగల్ ఆఫ్రికా నుండి యునైటెడ్ స్టేట్సు (అమెరికా) కన్న దగ్గరిలో విమానాశ్రయం నెలకొల్పడానికి వీలుంది. అందుకని అమెరికా అట్లాంటిక్ మహాసముద్రములో కూడ ఒక యుద్ధనౌకాదళాన్ని, విమానదళాన్ని ఏర్పరచడానికి మొదలుపెట్టింది.



జర్మనీ విదేశాంగ మంత్రి
రిబ్బన్‌ట్రాప్

అమెరికను బూర్జువా వర్గము, కేవలము ఉత్తర దక్షిణ అమెరికాలలో తన అధికారాన్ని ప్రాబల్యాన్ని వ్యాపింప జేయడముతో నేడు తృప్తి చెందుటలేదు. తన్ను నేడు ఎదుర్కొంటూన్న ఆర్థిక క్షోభనుండి తప్పించుకోడానికి కేవలము అమెరికా ఖండపు మార్కెట్టులు దానికి సరిపోవడములేదు. ప్రపంచ మార్కెట్టుల నన్నింటినీ ఆక్రమించుకోడానికి పూనుకుంటూవుంది. అమెరికా ఆయుధాలను పెంపొందించుకోడానికి అసలు కారణమిది.

అమెరికా ఇంగ్లండును తనవైపుకు లాగుకొని, జర్మనీని అణచివేసి ఇంగ్లండును తనమీద ఆధారపడి ఉండే చిన్న భాగస్వామిగా చేసి ప్రపంచాన్ని ఏల జూస్తూ ఉంది. అమెరికా, ఇంగ్లండు పరిశ్రమలకన్న జర్మను పరిశ్రమలను చూచి ఎక్కువ భయపడడానికి కారణముంది. జర్మను పరిశ్రమలు, ఇంగ్లండు పరిశ్రమల కన్న ఎక్కువ ఆధునికములు. ఎక్కువ నవీన యంత్రములతో కూడినవి. అందుచే వానితో పోటీ చేయుట కష్టతరము.

ఇంగ్లండు, జర్మనీని జెకరించడానికి అమెరికాతోటి వర్తక వ్యాపార ఒడంబడికను ఉపయోగించు కొంటుంది. ఇంగ్లండు తన హక్కులను అధికారాన్ని జర్మనీ గుర్తించేటట్లు చేయడానికి పూనుకుంటుంది. జర్మనీ తనం కోసం తనపై ఆధారపడక తప్పదని ఇంగ్లండు భావిస్తూ ఉంది. అందుకనే నాలుగు రాజ్యాల ఒడంబడికకు ఇంగ్లండు పట్టువల్ల, అప్పుడు అమెరికాకు కావలసిన సౌకర్యాలను కొన్ని ఇచ్చి, సోవియటు రష్యా (సోవియటు యూనియను) తోటి తన పోరాటములో అమెరికా కూడ పాల్గొనేటట్లు చేయడానికి ప్రయత్నిస్తుంది. 1936 లో యూరపులో కార్మిక విప్లవము రాకుండ జేయడానికి అప్పటి అధ్యక్షుడు హోవరు యూరపు దేశస్థులు తమ కివ్వవలసిన అప్పులపై మారిటోరియము ప్రకటించాడు. ఆ అప్పులను పిదపయే దేశము కూడ చెల్లించలేదు. తిరిగి యూరపులో కార్మిక విప్లవము రాకుండడానికి మరియొక పర్యాయము అమెరికా యూరపుకు అప్పులనిస్తే ఆశ్చర్యముండదు!

ప్రపంచ ఆర్థిక క్షోభ రోజుకు రోజుకు తీవ్రమగుచున్నదని చూచాము. జర్మనీ ఇటలీలలో ఆర్థిక స్థితి దుర్భరముగా ఉందనికూడ చూచాము. 1914 లో ఆర్థిక క్షోభనుండి బయటపడడానికి ప్రపంచ యుద్ధాన్ని ఆరంభించినట్లే నేడు కూడ తిరిగి మరియొక ప్రపంచ యుద్ధం ఆరంభిస్తారా?

నేడు ఆర్థికక్షోభ మూలంగా ఏవిధముగా అన్ని పెట్టుబడిదారీ దేశాలు, తమ చిక్కును సోవియటు యూనియనుపై యుద్ధము చేయడము ద్వారా పరిష్కరించడానికి పూనుకొంటున్నాయో చూచాము. కాని సోవియటు యూనియను బలము రోజురోజు ఎక్కువవుతూ ఉంది. ప్రతి పెట్టుబడిదారీ దేశములోనూ కార్మిక పోరాటము ప్రజా సామాన్యపు తిరుగుబాటు హెచ్చు అవుతుంది. అభయముతో పెట్టుబడిదారీ దేశాలు వెనుకంజ వేయవచ్చు. తమలో బలహీనమైన దేశాలను మ్రింగడముతోనే తమ సమస్యను పరిష్కరించు కోడానికి ప్రయత్నించవచ్చును. కాని నాలుగు రాజ్యాల ఒడంబడిక కుదిరితే సోవియటు యూనియనుకన్న తమకే ఎక్కువ బలముందని జర్మనీ, సోవియటు యూనియనుపై దాడివెడలవచ్చును. అందుకనే స్పెయిన్ స్వాతంత్ర్య యుద్ధము అతి ప్రాముఖ్యత నేడు వహించియుంది. అందుచేతనే స్పెయిన్ ప్రభుత్వానికి ద్రోహము చేయుడానికి వెనుకంజ వేయని దలదీర్ ప్రభుత్వానికి వ్యతిరేకముగా ఫ్రెంచి కార్మికులు గత వారము సమ్మెచేశారు.

ఫ్రెంచి పార్లమెంటు ఈనెల 9 వ తేదీని సమావేశమయింది. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, దలదీరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు చేశారు. కాని దలదీరు ప్రభుత్వానికి అనుకూలముగా 315 ఓట్లు, వ్యతిరేకంగా 241 ఓట్లు వచ్చాయి. 58 గురు తటస్థముగా ఉన్నారు. కార్మికుల పనిచేసే గంటలు ఎక్కువ చేసిన డిక్రీ చట్టాలను గూర్చి ఇంకనూ చర్చ జరుగుతూ ఉంది. ఈలోపల ఫ్రెంచి ట్రేడ్ యూనియను కాంగ్రెసు సమ్మె ఆపు చేసింది.

నేడు ప్రపంచ శాంతియే గాక, కార్మికుల విముక్తి, ప్రజా సామాన్యము యొక్క స్వేచ్ఛ స్వాతంత్ర్యము కూడ, ఛాంబర్లేను ప్రభుత్వాన్ని ఇంగ్లండులోను, దలదీర్ ప్రభుత్వాన్ని ఫ్రాన్సులోను పడగొట్టడముతోనే ఉంది. ఛాంబర్లేను ప్రభుత్వాన్ని పడగొట్టడానికి మనదేశములో మన స్వాతంత్ర్య పోరాటాన్ని సంపూర్ణ ప్రజాపోరాటముతో పాటు మనముకూడ ఆరంభించాలి!

బెజవాడ విద్యార్థుల సమ్మె

బెజవాడ హిందూ హైస్కూలులోని విద్యార్థులు యీనెల 8 వ తేదీ నుండి సమ్మె చేయుచున్నారు. వారు తమ కనీస కోర్కెలను నెరవేర్చ వలసినదని ఎన్నో పర్యాయములు హైస్కూలు హెడ్మాస్టరుగారికి, మేనేజింగ్ కమిటీకి, తెలియజేసి నప్పటికి వారు లెక్క చేయనందున జిల్లా, పట్టణ, కాంగ్రెస్ కమిటీ అధికార్లద్వారా రాయబారములను జరిపిరి. కాని హైస్కూలు అధికార్లు నిర్లక్ష్యం చేశారు. అందువల్ల 8-12-38 వ తేదీనుండి విద్యార్థులు సమ్మె సాగించుచున్నారు. విద్యార్థి సంఘము వారు యీక్రింది కనీసపు కోర్కెలకై పోరాడు చున్నారు:—

1. స్కూలు ఫైనల్ విద్యార్థులను సెలక్షను పరీక్షలలో డిటెయిన్ చేయకూడదు.
2. సరియైన మంచి నీటివసతి
3. లైబ్రెరీలో పుస్తకాలు, వార్తా పత్రికలు ఉంచాలి
4. సైకిల్ షెడ్
5. స్కూలు ప్రక్కనుండి ఫ్యాక్టరీని తొలగించుట
6. విద్యార్థి సంఘాన్ని గుర్తించుట

దాబాపు యిట్టికోర్కెల కొరకే, 12-12-38 వ తేదీనుండి మ్యునిసిపల్ హైస్కూలు విద్యార్థులుకూడా సమ్మె చేయుచున్నారు. హిందూ హైస్కూలులో సుమారు 1000 మంది, మ్యునిసిపల్ హైస్కూలులో సుమారు 1500 మంది విద్యార్థులు సమ్మెలో పాల్గొనుచున్నారు. గేట్లవద్ద శాంతి యుతముగా పికెటింగు జరుగుచున్నది. ప్రతిరోజు సాయంత్రం విద్యార్థులు పెద్దపెద్ద ఊరేగింపులు, బహిరంగ సభలు సాగిస్తున్నారు.

12 వ తేదీని బెజవాడ సబ్‌కలెక్టరుగారు, డి. యి. ఓ. గారు, బెజవాడ కాంగ్రెస్ నాయకులను పిలిపించి, సమ్మెను ఎవిధముగానైన ఆపు చేయించ వలసినదని హెచ్చరించిరి. కాని, వారందును నిరాకరించి, విద్యార్థుల కోర్కెలను నెరవేర్పింప వలసినదని కోరిరి. శాంతియుతముగా సమ్మెను సాగించ వలసినదని వారు విద్యార్థులను బహిరంగ సభలో హెచ్చరించిరి.

ఈరోజున హిందూ హైస్కూలులో పరీక్షలు ప్రారంభం. కాని, విద్యార్థులు సమ్మెను సాగిస్తూనే ఉన్నారు. రేపటి నుంచి మ్యునిసిపల్ హైస్కూలులో పరీక్షలు ప్రారంభం.

బెజవాడ పురజనులు, పిల్లల తల్లితండ్రులు, మా ఉద్యమానికి సంపూర్ణ సహకారం చేయాలని కోరుచున్నాము.

బెజవాడ విద్యార్థి సంఘం } వి. భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి.

రేపల్లె హైస్కూలు

క్షయరోగ నివారణ నిధికోసం రేపల్లె హైస్కూలుకు కొన్నివందల బ్రిటిష్ జండా (యూనియన్‌జాక్)లుదిగుమతిచేయబడినవి. ఈజండాలు యేస్కూల్లో యెన్ని యెక్కువ ఖర్చయితే అంత గొప్ప పేరు వస్తుందట. అందుకని తాము బ్రిటిషు ప్రభుత్వానికి నమ్మిన బంటుల మని రుజువుచేసి పేరు సంపాదించాలని దీక్ష బూనినది, రేపల్లె హైస్కూలు ఉపాధ్యాయ గణము. మొదట్లో విద్యార్థులంతా మేము కొనంఅన్నారు. కాని పంతుళ్ళు పట్టుబట్టేరు. మరి యెదిరిస్తే? "మీవాడు తుంటరి ఆయా"లని తండ్రికి ఉత్తరము వ్రాస్తారు భానుమూర్తి (ప్రధానోపాధ్యాయులు) గారు. ఇంట్లో తండ్రి, బళ్ళో భానుమూర్తిగారి ఒత్తిడికాగలేక మనుకొని కొంత మంది కొన్నారు. మిగతావాళ్ళు ససేమిరా అన్నారు.

3. బసవయ్య (5 వ ఫారం విద్యార్థి) ని పిలిచారు, శ్రీయుత నోరి వెంకయ్యర్లు (Assistant Headmaster) గారు. "జండా కొంటావా లేదురా" అని గద్దించారు. "మీ రేం చేసినా సరే జండా మాత్రం కొన"నన్నాడు. "అయితే మూడు రోజులు టైమిచ్చాను. కొన్నావా సరి, లేదా నిన్ను 'డిస్మిస్' చేయిస్తా" నన్నారు నోరివారు.

పరాధీన భారత దేశమా! శ్రీ నోరివారిబోటి విద్యాధికులు జీతం డబ్బులకోసం తాము బానిసలయింది గాక, స్వాతంత్ర్య పిపాసులైన ఆ యువక హృదయక్షేత్రాల్లో, యూనియన్ జాక్ పట్ల తమ నిరసనము జూపసమకట్టిన ఆవిద్యార్థి హృదయక్షేత్రాల్లో, బెదరించి బానిస బీజాలను నాట ప్రయత్నించడం ఇంకనూ జరుగుచున్నదంటే యేమనుకోవాలి? శ్రీ నోరివారిబోంట్లు విద్యార్థులకు గురువులా? బరువులా?

విద్యార్థులారా! ఇకనైనా కండ్లు తెరచి పరికించరా? మిమ్ములను మీరర్థము చేసికోరా? మీ దాస్య శృంఖలాలను మరింత బిగింప సమకట్టిన ఇలాంటి బానిసోపాధ్యాయగణానికి గుణపాఠం నేర్పండి!

"వరంధామయ్య"

గన్నవరం విద్యార్థుల కడగండ్లు

సుమారు 6 సంవత్సరముల నుండి, ఇచ్చట N. D. Joseph గారు (జోసప్) హెడ్‌మాష్టరుగా పనిచేస్తున్నారు. వీరు ఇచ్చట ప్రధానోపాధ్యాయులుగా నున్నప్పటి నుంచీ, నానాటికి స్కూలు ఫైనల్ పరీక్షలలో ఎక్కువ మంది తప్పుట జరుగు చున్నది. కిందటి సంవత్సరము, పరీక్షకు వంపిన 11 మందిలోను ఒక విద్యార్థియే గెలుపొందెను. అది అయినను స్వయంకృషి చేతనే. విద్యార్థుల కష్టాలు కూడా నానాటికి మితిమీరి పోయాయి. తమకున్న కష్టాలను నిర్మూలింప చేసుకొని తమ వర్తమాన, భవిష్యత్ జీవితాలను సుఖప్రదము చేసుకొనుటకై విద్యార్థి సంఘాన్ని స్థాపించుకొన్నారు. ప్రధానోపాధ్యాయుడు పైకి సంఘమంటే సదభిప్రాయముతో యున్నట్లు కనబడుచు, లోలోన విద్యార్థి సంఘ కార్యదర్శులను భయపెట్టుచు మరియు కొందరి వర్కర్సులను భయపెట్టుచు మరియు వారి తలిదండ్రులతో వారిని గురించి దురభిప్రాయముగా చెప్పుచూ యూనియనుని సర్వనాశనము చేయ సిద్ధపడుతూ యున్నాడు. చిల్లరిగె వెంకట్రావు అనే మాష్టరుగారు 3rd ఫారము లెక్కల పీరియడులో ఆ మేష్టరుగారు లేనందున తాను వెళ్ళి విద్యార్థులకు ముందుగా తెలుపకుండానే పైన్ను వేసారు యిచ్చారట. దాని మీదట విద్యార్థులెవరూ వ్రాయలేదు. అందుమీదట ఆ పంతులు గారు, పాపమా పంతులుగారికి తారీఖు కూడ తెలియక ఒక విద్యార్థి నడుగగా ఎవరో పొరపాటున 6వ తారీఖునకు బదులు ఏడని జవాబిచ్చెను. వారు యింకొక కుఱ్ఱవానిని నిలుచుండబెట్టగా ఆతడునిలుచుని కారణమడిగెను. ఆయన సమాధాన మివ్వక, కుఱ్ఱవాడు కూర్చుంటే హెడ్మాష్టరు వద్దకు పంపించెను. ఆయనగారు వచ్చి పరీక్ష లెప్పుడో తెలియదని చెప్పిన మాత్రముననే ఒక విద్యార్థిని బాదమోదినారు. పాఠము తెలియక పోయినా మాష్టరు తప్పుచెప్పుచున్నా విద్యార్థి కోరుమూసుకొని కూర్చోవలసిందే. 4యిదవ ఫారములో చల్లా మాధవరావు అనే కుర్రవాడు పాఠములో explanation తెలియక అడిగితే యింకొక తప్పర్థము చెప్పి, ఆ కుఱ్ఱవాడు తప్పని వెల్లడించి నందున నాకు తప్పుదిద్దేవాడా యనే అభిప్రాయముతో బయటకు వెళ్ళగొట్టినాడు. క్లాసులో ఏ మాత్రము నవ్వినా డిబారు, డిస్‌మిస్ చేస్తానని బెదరించు తున్నారట హెడ్మాష్టరుగారు.

మూడవ ఫారము సంగతి యూనియనువారు రిపోర్టులివ్వగా తన యిన్ఫ్లుయిన్స్‌ను వారి తలిదండ్రుల యొద్ద ఉపయోగించి కుర్రవాళ్ళచేత అపాలజీలు ఇప్పించుటకు ప్రయత్నించినారు. ఇది ఇట్లుండ ఒక వర్కరు మీద రౌడీయని ఒక మేష్టరు ఊళ్ళో ప్రచారము సాగించారు. కుర్రవాళ్ళను బావలు పెట్టడం మొదలుపెట్టారు. సామాను మోసుకురాలేదని ఒక కుర్రవానిని సమిజాయిషీ ఇమ్మని అడగటం కూడా మొదలుపెట్టారు.

స్కూలుఫైనలు విద్యార్థులకు సెలక్షను పరీక్షలు 19వ తేదీనని చెప్పుచూ ఆకస్మికంగా 15 కు మార్చారు. కొంతమందిని డిటెయిన్ చేస్తానని అక్కడక్కడ అంటూయున్నారట. Half yearly పరీక్షలని చెప్పక సెలక్షనులని నోటీసు అప్పుడే జారీచేశారు. ఇంకా వ్రాయాలంటే విద్యార్థుల కష్టాలు చాలా వున్నాయి. పరిస్థితులు విషమించక మునుపే పై అధికారులు జోక్యము కలుగజేసుకొని సక్రమ పరిస్థితులను ఏర్పాటు చేస్తామని ఆశిస్తూయున్నాము.

ఇట్లు,
కాట్రగడ్డ వెంకటరాయుడు.
సహాయ కార్యదర్శి
జిల్లా విద్యార్థి సంఘం.

బందరు

బందరు పట్టణ విద్యార్థి సంఘపు కార్య నిర్వాహక వర్గము ఈదినము సమావేశమై ఈ దిగువ తీర్మానములు చేసెను.

1. మౌలానా షౌకతాలీ మరణానికి సానుభూతి, వుస్మానియా యూనివర్సిటీలో నుస్తావన ప్రభువుల నిరంకుశత్వాన్ని ఎదుర్కొను విద్యార్థులకు అభివందనం. మహమ్మదీయ విద్యార్థులను కూడ పాల్గొనమని హెచ్చరిక.
2. తుపానువలన నష్టపడిన బీద విద్యార్థులకు జీతం, పరీక్షఫీజు తీసివెయ్యమని యూనివర్సిటీని గవర్నమెంటును కోరుచు తీర్మానించిరి.
3. రామాంజనేయ హాస్టలుకు గవర్నమెంటును సహాయం చేయమని కోరుచు తీర్మానించిరి.
4. తుపానువలన నష్టపడిన కార్మికులకు తదితరముగ సహాయము చేయుటకు వాలంటీర్లను చేర్పించి పని చేయుటకు తీర్మానించిరి.

మి. వెంకటేశ్వరరావు,
ప్రధాన కార్యదర్శి.
3-12-38.

ఆంధ్ర రాష్ట్రంలో విద్యార్థి ఉద్యమము

ఇంతవరకూ ఆంధ్ర రాష్ట్రములో జరిగిన విద్యార్థి ఉద్యమాన్ని గూర్చి ఒక పుస్తకాన్ని రాబోవు రాష్ట్ర విద్యార్థి మహాసభ నాటికి ప్రకటించటానికి రాష్ట్ర విద్యార్థి సంఘమువారు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంధ్రరాష్ట్రంలోని అన్ని స్థానిక జిల్లా విద్యార్థి సంఘాలు స్థాపించిన కాలము, జరిపించిన కార్యక్రమము విశదంగా జనవరి 7 వ తారీఖులోగా యీ క్రింది అడ్రెసుకు పంపించాల్సిందిగా ప్రార్థన. సభలు, ఊరేగింపులు మొదలైనవాటి ఫొటోలుకూడ పంపించండి.

రాజగోపాలరావు,
P. O. జమీ గొల్వేపల్లి
(వయా) పామర్రు
కృష్ణాజిల్లా

కృష్ణా జిల్లా నేషనల్ యూత్ ఒలింపిక్

జమా ఖర్చులు

చందాలు	35—0—0
రుసుము	13—8—0
జమొత్తం	48—8—0

ఖర్చులు

భోజనం	60—0—0
బ్యాండు, లైట్లు, కూలీలు స్టేషనరీ	13—3—0
బహుమతులు	32—4—0
టాంవెలింగు, ప్రింటింగు, పోస్టేజీ	27—0—0
రబ్బరు స్టాంపులు	2—8—0
ఖర్చు మొత్తం	134—15—9
జమ మొత్తం	48—8—0
బాకీ	86—7—9

ఇట్లు
రాజగోపాలరావు
ప్రధాన కార్యదర్శి.
కృ॥ జి॥ యువజనసంఘం
1—12—38

ప్రకాశం కమిటీ రిపోర్టు

(10 వ పేజీ తరువాయి)

ట్టు నిరంతర ఆందోళన ప్రారంభించాలి. ఈ సిఫార్సుల ప్రకారం బిల్లు తయారై శాసనము చేయడానికి, అవసరమైనబలమును రెవిన్యూమంత్రిగారికి, వారి అనుచరులకు,ఇతర శాసన సభ్యులకు దేశంలో చేకూర్చాలి. కాంగ్రెసు సంఘాలు, రైతు సంఘాలు యేకమై పని చేయాలి.

రైతుల కర్తవ్యం

రైతులకిదే పరీక్ష సమయం. జమీందారీ రైతుల గతి 'చావో రేవో' దీనితో తేలిపోతుంది. గనుక యెంతటి ధైర్యానికి, త్యాగానికైనా వెనుకంజ వేయకుండా ముందుకు రైతులు నడవాలి.

ఈతరుణంలో తెగింపుతో పనిచేయాలి. రాష్ట్రమంతటా, రైతుదినోత్సవాలు, రైతురక్షణయాత్రలు, ఊరేగింపులు, ఉత్సవాలు చెలరేగాలి. రైతులకుండేదంతా సంఖ్యాబలం తప్ప మరేమిలేదు. గనుక సంఖ్యాబలమే చూపించాలి. 16 వందల జమిందారులు చేయబోయే గడబిడకు భయపడకూడదని 160 లక్షల జమిందారీ ప్రజలు కాంగ్రెసు ప్రభుత్వానికి అండగా, కృతజ్ఞతతో శాశ్వతంగా నుండగలరని. గనుక లక్షలాది ప్రజలకు శాశ్వత సౌఖ్యం, దేశాభ్యుదయం, చేకూర్చే యీ శాసనానికి యెందరు యెట్టి అంతరాయములు కలిగించినా లెఖ్ఖచేయవద్దని ప్రభుత్వమునకు మంత్రి వర్గమునకు నచ్చచెప్పాలి.

అవసరమైతే శాసనసభ్యులు రాజీనామా యివ్వాలి.

ఒరిస్సాలోగల మదరాసు ఎస్టేట్లకు సంబంధించిన శాసనం నేటికి ఆశాసన సభవారు ప్యాసుచేసి, 7 నెలలు కావచ్చింది. కాని, జమీందార్ల ఆందోళనకు లొంగిపోయి, గవర్నరు, గవర్నరు జెనరలు యింతవరకూ ఆ శాసనం అనుమతించనందున, అమలుకురాలేదు, అందుచేత రైతులకు అనుకూలంగా ప్యాసయినా, నిరుపయోగమైంది. ప్రజా ప్రతినిధులచే శాసనబద్ధమైన చట్టాన్ని అనుమతించక పోవడానికి గవర్నరుకు, గవర్నరు జనరల్ గారికి, యెంత గుండె ధైర్యమో ఆలోచించండి. ఈ సంవత్సరంలో కాంగ్రెసు వర్కింగు కమిటీ పెద్దలు యేమిచేయాలో యింతవరకూ సూచింపలేదు. తాము చేసిన శాసనం అమలుకు రాలేదు.

మన రాజధానిలోకూడా యిట్టి క్లిష్ట పరిస్థితి ఏర్పడవచ్చు. అప్పుడు, అవసరమైతే, శాసన సభ్యులు రాజీనామా యివ్వాలి. ఐక్య కంఠంతో ప్రజలు కోరే యీ శాసనాలు అమలు జరుగకపోతే, ప్రభుత్వం యింక సాగనివ్వరని తెలిపేటట్టు ప్రజా శక్తిని విజృంభింపజేసి, ప్రజా బలం ప్రదర్శించాలి.

ఈ రిపోర్టునందు గల సిఫార్సులు బిల్లు రూపం దాల్చి, చాలా రిష్టగండములన్నీ దాటి, మధ్య సన్నగిల్లి కృశించిపోకుండా, శాసనమై, గవర్నరు, గవర్నరు జెనరలు అనుమతిపొంది అమలునకు వచ్చే వరకూ రాష్ట్ర ప్రజలు నిద్రపోకుండా నిరంతర ఆందోళన సాగించి తమ హక్కులకై పోరాడాలి.

ఈ అమూల్యమైన రిపోర్టు వ్రాసిన శ్రీ ప్రకాశం పంతులుగారు రైతుల శాశ్వత కృతజ్ఞతకు పాత్రులయినారు. జమీందారీ రైతు కుటుంబాలలో వారి పేరు చిరస్థాయిగా ఆచంద్రార్కం వెలయగలదు. భావి చరిత్ర కారుడు వారి నామము సువర్ణాక్షరములతో లిఖించుటకు సందియంలేదు.

ఎంత ధైర్యంతో, ఓపికతో, రైతుల యెడల దయార్ద్ర హృదయంతో, ఈ రిపోర్టు పంతులుగారు వ్రాసిననారో, ఆ ఉత్సాహము పట్టుదలతో కొనవరకూ శాసనమై అమలుకు వచ్చే వరకు కృషి చేస్తారని మా అందరి సంపూర్ణ విశ్వాసము.

ఇనాం రైతులు

1802 సెటిల్‌మెంటు తరిమిలా వచ్చిన యినాం భూములకు వేరే శాసనం చేస్తూఉంటూ ఆ యినాంలు ఇప్పటికిన సంవత్సరములు ఇనాందార్లకు రైతులకుండే పరస్పర సంబంధములు, జమీందారీ పద్ధతికి నాటికి గల తారతమ్యము ఈ సంవత్సరములలో వ్రాసిన వాదనల వల్ల యినాం రైతులతో చాలా అశాంతికి కారణము కలుగుతుంది. ఇప్పటి చట్టము ప్రస్తుతం అయితే, కొత్త చట్టము తయారైయ్యేలోగా రైతులను యినాందార్లు భూములనుండి తొలగించవచ్చు. లాండు రెస్యూరు విధానములో తేడాయున్నా, జమిందారీ రైతులకంటె యినాం రైతుల ఆర్థిక స్థితి మేలుగాలేదు. శిస్తు భారం, యితర యిబ్బందులు, యింకా యెక్కువగా నున్నవి. గనుక, వెంటనే జమిందారీ, బిల్లుతో ఇనాంది బ్లుకూడా ప్రవేశపెట్టకుండా ఉంటే, కాంగ్రెసు వారంతా మునుముందు నిందల పాలవుతారు. అందుకు సందేహము లేదు.

చెన్నపురినుండి శ్రీ తెన్నేటి విశ్వనాథముగా రిట్లా వ్రాస్తున్నారు:—

ఎస్టేటు ల్యాండు ఆక్టు కమిటీ ఎంక్వైరీ సందర్భములో సాక్షులు దాఖలు చేసిన డాక్యుమెంటులనుగూర్చి చాలా ఎంక్వైరీలు వచ్చాయి.

ఈ సంఘమువారి నివేదిక 1939 జనవరి 20 వ తారీఖున అసెంబ్లీలోనూ, తరువాత కౌన్సిలులోనూ చర్చకు వస్తుంది. ఆ సమయములందీ డాక్యుమెంట్లు అవసరము. అందుచేత ఆ చర్చల అనంతరమే యీ డాక్యుమెంట్లు తిరిగి ఇవ్వడానికి వీలగును. ఈ లోపున ఆ డాక్యుమెంట్లు అర్జంటుగా కావాలంటే, ఆ సాక్షి వచ్చి నిజవ్రాత ప్రతి వ్రాసుకొని, కమిటీ శక్రటరీ దగ్గర నుండి డాక్యుమెంట్లు, కమిటీవారి దగ్గర నున్నట్లుగా ధ్రువ పత్రము పొందవచ్చును. దీనికి సంబంధించిన వారందరూ ఈ విషయము గమనించ గోరుతాను.

బీహారులో రైతుల సత్యాగ్రహమా?

ఈనెల 3, 4 తేదీలలో, దర్భాంగజిల్లా వైసీగ్రామములో, సమావేశమైన బీహార్ రాష్ట్ర రైతు మహాసభ ఈక్రింది తీర్మానములను ఏకగ్రీవముగా ఆమోదించిరి.

రాష్ట్రంలో రైతుల కడగండ్లు నానాటికీ మితిమీరిపోతున్నాయి. కాంగ్రెస్ మంత్రులు అధికారంలో ఉన్నప్పటికీ, వారిని రక్షించేవారెవరూ కనపడ్డంలేదు. జమిందార్ల నిరంకుశత్వం—దుండగాలు రోజు రోజుకు ఎక్కువౌతున్నాయి. జమిందార్లకూ—కాంగ్రెసుకూ మధ్య జరిగిన ఒడంబడిక జమిందార్లలో కొత్త ఉత్సాహాన్ని, ఇచ్చింది.

ఇప్పుడు ఉన్న శాసనములో రైతుల కీయబడిన హక్కులనైనా జమిందార్లు అపహరించకుండా పూర్వంకంటె ప్రభుత్వోద్యోగుల్ని కాంగ్రెసు మంత్రివర్గంవారు ఉపయోగించి యుండవలసినది. ఎట్టి రాబడి గాని లేని చిన్న చిన్న భూములకు శిస్తు రద్దుచేసి ఉండవలసినది. పాత బకాయిలను నిర్మూలించి యుండవలసినది. ఋణభారాన్ని కొంతవరకైనా తగ్గించి రైతులకు ప్రభుత్వము ఋణా లిచ్చియుండవలసినది. ఈ పదుపాయాలలో ఒక్కటీ సమకూరకపోగా, పోలీసుల యొక్క మేజస్ట్రీట్లయొక్క, చర్యలవల్ల రైతుప్రచారకులకనే ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ ప్రభుత్వోద్యోగులు అనేకసందర్భాలలో కాంగ్రెస్ కమిటీల తోడ్పాటుతో జమిందార్లకు సహాయం చేస్తున్నారు. మరొకవైపున ప్రభుత్వము ప్యాసుచేసిన కొత్తశాసనం(ముఖ్యముగా జప్తుకు సంబంధించిన సెక్షన్లు) పేద రైతుల్ని పూర్వముకంటె క్రూరముగా బాధిస్తోంది. వీటి అన్నింటికీ తోడు, బాధ్యతగలిగిన నాయకులు, పత్రికలు మాటిమాటికీ ఫెయిజ్‌పూర్ కాంగ్రెసు తీర్మానాన్ని వల్లిస్తున్నాయి.

అట్టి వ్యక్తుల వైఖరి యెడల ఈ సమావేశము విచారము-ఆగ్రహము ప్రకటించుచున్నది. రైతులలో ఈ వైఖరి ప్రమాదకరమైన అసంతృప్తిని కలుగచేస్తోంది. బీహార్ ప్రభుత్వము ఈ శాసనాలను అమలు పరిస్తే, ముఖ్యంగా, రైతుల ఆస్థి అంతటినీ జప్తు చేసే అధికారాన్ని వినియోగిస్తే, అట్టి ప్రయత్నాన్ని రైతు సంఘమూ, రైతులు తమకున్న శక్తి అంతటితో ఎదుర్కొనగలరని ఈ సభవారు ప్రభుత్వానికి 'వార్నింగ్' యిచ్చుచున్నారు.

బీహార్ రైతులలో వ్యాపిస్తూన్న కొత్త సంచలనం తమ హక్కులకై వారు జరుపుతూన్న పోరాటంలో ప్రదర్శింపబడుతూన్న ధైర్య సాహసాలు—వీటిని చూచి జమీందార్లు బెంగారుపడుచు, అనాదినుంచీ రైతుల హక్కు భుక్తములో ఉన్న భూములను లాగుకొనుటకు జమీందార్లు అనుసరిస్తూన్న వక్ర మార్గాలకు కాంగ్రెస్-జమీందారు ఒడంబడిక తోడ్పడుచున్న కాంగ్రెస్ మంత్రులు అనేక ప్రదేశాలలో స్పెషల్ మేజస్ట్రీట్లను నియమించి, సాయుధపాణులైన గుర్ఖా సోల్జర్లను పంపించి, జమీందార్లకు సహాయము చేయుచున్నారు. రైతుల భూములను జమీందార్లు బలవంతముగా స్వాధీన పరచుకొనుటలో ఈ సోల్జర్లు, మేజస్ట్రీట్లు తోడ్పడుచున్నారు. రైతుల పంటను జబర్దస్తీగా కోసుకుపోతూంటే, చిరు చూచి ఆమోదము తెల్పుచున్నారు. రైతులపై జమిందారులు ఎన్ని దుండగాలు సల్పినా, వాటిని సమర్థిస్తున్నారు. ఇట్టి పరిస్థితులలో రైతులు కాంగ్రెస్ పెత్తందార్లయొక్క, మంత్రుల యొక్క. సహాయముకొరకు వెళ్ళితే లాభం లేక తిరిగి రావలసి వచ్చినందున ఓపిక—సహన శక్తి వారిలో నశించి, ఉద్రేకపూరితులై ఉన్నారు. ఇట్టి పరిస్థితులలో రైతులు శాంతియుతంగాను, కట్టుదాట్లతోను, సత్యాగ్రహం చేయుట తప్ప మరొక మార్గం కనుపించనందున, బీహార్ రాష్ట్ర రైతు సంఘమువారు రాష్ట్రమంతటా సత్యాగ్రహ సమరాన్ని ప్రారంభించి, జయప్రదం అయేవరకూ దానిని నడిపించవలెసని యీసమావేశము కోరుచున్నది.

రాష్ట్రమందలి రైతు ఉద్యమాన్ని అణచుటకు కొందరు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వారి చేతిక్రింద ఉన్న కాంగ్రెసు కమిటీలు పన్నుచున్న కుట్రల (Despicable conspiracies) ను యీ సభవారు ఖండించుచున్నారు. దేశము, కాంగ్రెసు, రైతులపై ఆధారపడి యున్నదనియు, కరాచీ, ఫెయిజ్‌పూర్, హరిపూర్ కాంగ్రెస్ తీర్మానాల ప్రకారం రైతులు తమ ప్రత్యేక సంస్థలను స్థాపించుకొనవచ్చుననియు, కాంగ్రెసునాయకులు చేయుచున్న ఈ "సిగ్గుమాలినపనుల" (shameful actions) వల్ల కాంగ్రెసు సంస్థ రోజు రోజుకు బలహీనమై, రైతులనుండీ—కార్మికులనుండీ దూరం కాగలదనియు—ఈసభవారు అట్టి నాయకులకు స్పష్టముగా తెలియ జేయుచున్నారు.

జమీను రైతు విచారణ కమిటీ రిపోర్టు

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ ప్రకటన

ఈ నెల 4, 5 వ తేదీలలో ఆంధ్రరాష్ట్ర రైతు సంఘము సమావేశమై ప్రభుత్వ నివేదికను, చిత్తు బిల్లును చర్చించి నివేదికకు అనుగుణ్యంగా వుండునట్లు, నివేదిక లోని సూచనల యొక్క సంపూర్ణ ఫలిత మిన్వజాలని, సూచనోద్దేశ్యములకే భంగ మొనర్చుచున్న బిల్లు యొక్క సెక్షనులను సవరించుటకుగాను, చిత్తు చట్టమునకు కొన్ని సూచనలు చేసినది. ముఖ్య సూచనలు యివి.

1. 1936 వ సంవత్సరపు ఎస్టేటు లాండు అమెండ్‌మెంటు ఆక్టు ప్రకారం ఎస్టేట్లుగా నిర్వచింపబడిన అన్ని ఎస్టేట్లకు ఈ ఆక్టు వర్తించవలెను.

2. ఈ బిల్లు శాసనసభలో ప్రవేశపెట్టినప్పటినుండి అమలులో నున్నట్లే పరిగణించవలెను.

3. జనవరి 20 వ తేదీన జరుగు శాసనసభలోనే బిల్లును ప్రవేశపెట్టవలెను.

4. జలాధారములు:—

(1) జలాశయముల నన్నింటిని పరిశీలించి ప్రస్తుతము మరమ్మతులో వున్న జలాధారము లన్నిటిని ఆక్టు అమలులోకి వచ్చినప్పటినుండి 3 సంవత్సరముల లోపల సాగుకు పూర్తిగ ఉపకరించు లాగున ప్రభుత్వమే జమీందారుతో నిమిత్తం లేకుండ బాగుచేయించవలెను. యిందుకు యొక ఇంజనీరింగు కమీషను యేర్పరచి వాటికైన ఖర్చులను జమీందార్లనుండి వసూలు చేయవలెను.

(2) రిపోర్టులో సూచించినట్లుగా ప్రతి యస్టేటుకు తప్పనిసరిగా జలాధారములను అభివృద్ధి పరచుటకు ప్రతి యస్టేటులోను యొక జలాశయనిధి ప్రభుత్వమే ఏర్పరచవలెను.

(3) ఇకముందు జలాశయము యొక్క నీటి పట్టుబడి సామర్థ్యమును బట్టి, సదరు జలాశయము క్రింద, ఆయకట్టు నిర్ధారణ చేయవలెను.

5. సర్వే:— ఆక్టు అమలులోనికి వచ్చినప్పటి నుండి 1 సంవత్సరము లోపల సర్వేగాని యస్టేట్లన్నిటిని 1923 వ సంవత్సరపు మద్రాసు సర్వే అండ్ బౌండరీస్ ఆక్టు ప్రకారం సర్వే చేయించి సర్వే రికార్డులు వుంచునట్లుగా చట్టరీత్యా అధికార మీయవలెను. ఇందులకైన ఖర్చులు రైతులపై విధింపరాదు.

6. శిస్తు వసూలు:—

(1) రైతుయొక్క శిస్తు బకాయికై రైతు యొక్క యే చరాస్తిని జప్తు చేయరాదు.

(2) రెంటుసూట్లను తాలూకా ఆఫీసర్ల దగ్గరనే జమీందార్లు దాఖలు చేయవలెను. లాండు రెవెన్యూ విషయమై రైతులచే తేబడు దావాలకు కోర్టు ఫీజులు లేకుండ చేయవలెను.

(3) రైతులు జమీందార్లకు చెల్లించవలసిన పన్నులను జూన్ 30 తేదీ వరకు చెల్లించుకొనుటకు వాయిదా వుండవలెను.

(4) అన్ని ఎస్టేట్లలోను యొకే మాదిరి రివెన్యూ లెక్కలు వుంచవలెను.

(5) **Bought in lands** (వేలములో కొన్న భూములు)ను జమీందారు తన పాట మొత్తంను సదరు భూమి సాగుచేయుట ద్వారా గడించునంత వరకు తన స్వాధీనములో నుంచుకొన వచ్చును. కాని యే పరిస్థితులలోను తన స్వాధీనకాలము 3 సంవత్సరముల కన్న మించరాదు. 3 సంవత్సరములైన పిదప ఆభూమిని సదరు వెనుకటి జిరాయితీ దారునకే ఆక్టు షరతులకు లోబడి భూమి యొక్క పట్టాను యివ్వవలెను.

7. పట్టాలు విడదీయుట:—పట్టాలు విడదీయుట విషయములో జమీందార్లతో నిమిత్తం లేకుండగనే రైతువారీ ఏరియాలలోవలెనే జరుగవలెను.

8. జమాబంది:—రైతుల కష్టసుఖాలు చెప్పుకొనుటకు ప్రతి సంవత్సరము తప్పని సరిగా రెవెన్యూ సంవత్సరం ఆఖరున జమాబంది యుండవలెను.

9. రిమీషనులు:—పూర్తి పంటతో 4 వ వంతుగాని అంతకన్న తక్కువ గాని పంట పండిన తప్పనిసరిగా జమీందార్లు రైతులకు పూర్తి రిమీషనులు యివ్వవలెను.

10. స్వంత కమతములు:—యే జమీందారునకు 50 యెకరములకన్న హెచ్చు స్వంత భూమి యుండరాదు. సదరు హద్దుకన్న హెచ్చు స్వంత భూమిగల జమీందార్ల కౌలుదార్లకు జిరాయితీ హక్కులు సంక్రమింపచేస్తూ అట్టి కౌలుదార్లకు గూడ యీ ఆక్టు వర్తించునట్లు చేయవలెను. స్వంత కమతములను రద్దు గావించి ప్రభుత్వమే సదరు స్వంత కమత భూములను వశపర్చుకొని వ్యవసాయమున కల నడిన పేద ప్రజలకు సాగు చేసుకొనుటకు సహకార పద్ధతులపై సాగు కివ్వవలెను. పై మాత్రం ప్రకారం జమీందార్లకు విడిచిపెట్టబడిన 50 యెకరముల స్వంతభూమిని కౌలుకిచ్చినచో కౌలుదారును కనీసం 5 సంవత్సరములైనను భూమినుండి తొలగింపరాదు.

11. ఏజెన్సీ ప్రజలు:—

(1) ప్లెయిన్సుతో యీ ఆక్టు యేతేదీన అమలులోనికి వచ్చునో ఆ తేదీ ననే పూర్తి, అసంపూర్తి మినహాయింపు ప్రాంతములకు కూడ యెట్టి మార్పు మినహాయింపు లేకుండ వర్తింపజేయాలి.

(2) మద్రాసు యేజెన్సీ ఇంటరెస్టెస్ అండ్ ట్రాన్సుఫర్ ఆక్టు (1 ఆఫ్ 1917)ను జమీందారీ యేరియాలలో గూడ కొండజాతుల ప్రజలను భూమి నుండి తొలగించకుండా వుండునట్లు మార్చవలెను.

12. ఈనాములు:—ఇన్‌క్లూడెడ్ ఈనాములకు యీ ఆక్టు వర్తించును గాన, సదరు ఈనాం రైతులుగూడ జమీన్ రైతుల మాదిరి జిరాయితీ హక్కులే పొందుదురు. కాని రిపోర్టులో సదరు ఈనాం రైతులు కొంత నజరానా ఈనాం దారులకు యిచ్చుకోమనుట న్యాయముగాదు. గాన సదరు కంపెన్‌సేషన్ యేమీ యిచ్చుకోనవసరము లేకుండగనే జిరాయితీ హక్కులు సదరు ఈనాందారీ రైతులు పొందుదురని శాసించవలెను.

ఈ పై సూచనలు మనము క్రొత్తగ సూచించునవిగావు. అనేక సంవత్సరముల నుండి అనేక సభా వేదికలనుండి యీ సూచనలు చేయబడినవి. సూచనలు రైతులయొక్క కనీస కోర్కెల మాత్రమే నీదేర్చగలవు. తాత్కాలికముగ రైతులు కొంత వరకు శాంతిని బొందగలరు.

అయినప్పటికిని యీ నివేదికకే జమీందార్లు గంగెత్తి తీవ్ర ఆందోళన చేయబోవుచున్నారు. కాంగ్రెసు శాసన సభ్యులలో కొంతమంది యీ నివేదిక తీవ్రముగా వుందని బెంగారు పడుచున్నారు. పత్రికలలోగూడ ఈ నివేదికను ఖండించుచు ఆందోళన బయలుదేరింది. జమీందార్లు తమ బలమునంతా ప్రయోగించి, సామ్రాజ్యవాద ప్రభుత్వ పలుకుబడినంత ఉపయోగించి ప్రకాశం పంతులుగారి చట్టమును వెనక్కినెట్టి దాని స్థానే రైతుల కన్నీళ్లు తుడుచునట్టి, తమ హక్కులకే మాత్రం భంగము కలుగనట్టి బిల్లును తేవాలని చూస్తున్నారు. ఇందులకయి మంత్రి వర్గములో గూడ చీలికలు కలుగచేసి ప్రకాశంగారిని పంగదీయాలని చూస్తున్నారు. మెత్తబడిన కాంగ్రెసు శాసన సభ్యులను ఉపయోగించుకుని కాంగ్రెసు పార్టీ మీటింగులోగూడ గడబిడచేయ చూచుచున్నారు. దీనికంతకు అండగా సామ్రాజ్యవాద ప్రభుత్వం నిలబడి సకల విధముల జమీందార్లకు తోడ్పడుచున్నది.

ఈ సమయంలో మన కర్తవ్యమేమి?

జమీందార్లు కాంగ్రెసు మంత్రి వర్గమునకు ముఖ్యంగా రెవెన్యూ మంత్రిగార్కి కల్గించుచున్న సర్వతోముఖ వత్తిడిని తొలగించుటకు పూనుకోక నిద్రపోవడమేలః ఓ జమీన్ రైతులారా! ఇంతవరకును 136 సంవత్సరముల నుండి దిగ్విజయముగా సాగుచున్న జమీందార్ల దుష్ట పరిపాలనను యికముందు గూడ నిద్రబోతూ సాగునట్లే చేసెదరా? లేక ప్రస్తుతమున్న అవకాశములబట్టి వీలైనంతవరకూ మేలు చేకూర్చుటకు వీలైనట్టి రివెన్యూ మంత్రిగారి నివేదికను బలపర్చి జమీందార్ల దాడి రెవెన్యూ మంత్రిగార్కి తగలకుండగను, మెత్తబడే శాసన సభ్యులకు ధైర్యమిచ్చునట్లును, తెరచాటునుండి భాగవతం ఆడించే సామ్రాజ్య ప్రభుత్వం ఆశాభంగ మొందునట్లు పోరాడెదరా? ఇదే ప్రస్తుతము మీ ముందున్న క్లిష్ట సమస్య. ఎప్పటి మాదిరిగనే మీ హక్కులను మీరే సంపాదించుకోవాలి; తదుపరి ఎవరూ హరించకుండా నిలబెట్టుకోవాలి. ఇందులకు తీవ్ర ఆందోళన గావాలి. మెలకువ గావాలి. నిర్మాణము గావాలి అందు ముఖ్యంగా శాసన సభ జనవరి 20 వ తారీఖునాటికి సమావేశమగు లోపల తీవ్ర ఆందోళన దేశములో లేవనెత్తి జమీందార్ల కుతంత్రములను సాగనీయకండి. ప్రకాశం పంతులుగారి నివేదికను శాసన సభవారు ఏకగ్రీవముగ అంగీకరించునట్లు శాసన సభ్యులపై వత్తిడి కలుగజేయండి. కాంగ్రెసు మంత్రివర్గములో విభేదములు రాకుండ చేయండి. మంత్రి వర్గము గూడ రెవెన్యూ మంత్రిగార్కి పూర్తి మద్దతిచ్చి రిపోర్టు నాధారముగాని బిల్లు శాసనసభలో జనవరి 20 వ తారీఖునకే వచ్చునట్లు చేయండి. ఇప్పుడున్న చిత్తు చట్టములో మన సూచనలు గూడ చేర్చునట్లు చేసి, అట్టి చట్టమే రైతుల కనీస కోర్కెల నీడేర్చగలదని తెలియచెప్పండి.

ఇంత తీవ్ర ఆందోళన గావించుటకు చక్కని ఏర్పాట్లు, నిర్మాణము, ప్రచారము చాల అవసరము. ఈ విషయమై గూడ ఆంధ్రరాష్ట్ర రైతు సంఘము ఆలోచించి ఈ క్రింది ప్రచారపు టేర్పాట్లు చేసినది. ఈ ప్రచారపు టేర్పాట్ల ననుసరించి జిల్లాలోని రైతు సంఘములన్నీ వెంటనే పూనుకొని ఆందోళన ప్రారంభించాలి. ముఖ్యంగా జిల్లా సంఘములు, తాలూకా సంఘములు బాధ్యత వహించి ఈ క్రింది ప్రచారపు టేర్పాట్ల ప్రకారం పని ప్రారంభించి తీవ్ర ఆందోళన చేయవలెను. ఈ సమస్యపై తదితర కాంగ్రెసు, కాంగ్రెసు సోషలిస్టు మొదలగు సామ్రాజ్య వ్యతిరేక సంఘములన్నీ కేంద్రీకరించి పనిచేయ గలందులకు గూడ కోరుచున్నాము.

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాధ్యక్షుని ప్రకటన

జమీందారీ విచారణ కమిటీ నివేదిక.

ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘాధ్యక్షులు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు బెజవాడనుండి ఈ క్రింది విధంగా వ్రాస్తున్నారు:

17 మాసములనుండి పరిపాలనచేయుచున్న మద్రాస్ ప్రభుత్వం కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికకు అనుగుణ్యముగ నేటివరకు రైతాంగం, ప్రజాసామాన్యం ఆర్థిక, దాస్య బంధనములనుండి విముక్తి బడయగలిగినట్టి ఎన్నదగిన సౌకర్యము కలుగజేయలేకపోయినది. అత్యధిక సంఖ్యాకులైన పేదరైతాంగమునకు అంతగా ఉపయోగింపజాలని, వివాదాస్పదమైన, వరవడి నంతగ చూపజాలని, ఋణముల బిల్లువలనను; అటవీశాసనఫలితమున అనుభవించుచున్న బాధాతిశయమునను; పుల్లరి తగ్గుదల లాభము పొందజాలకపోవుటవలనను; ఎస్టేటు ల్యాండు ఆక్టు సవరణ కాలయాపన ఫలితముగ అతిశయించిన జమీందారుల బాధలవలనను; నిరుత్సాహము, నిరాశ ప్రబలియున్న రైతాంగహృదయంలో గౌ. ప్రకాశంగారి సంవత్సర విచారణ మూలముగ వెలువడిన జమీందారీ విచారణ కమిటీ నివేదిక ఆశాజ్యోతిని వెలిగించినది. ఈవిషయమును దీక్షతో, ఓపికతో, సోదర సభ్యుల తోడ్పాటుతో, జమీన్‌రైతులను, వారి దరిద్ర జీవనమునకు కారణభూతులైన జమీందారులకు గల సంబంధ బాంధవ్యములను గురించి సమగ్రముగ విచారించి, చరిత్రాత్మకమగు రిపోర్టును వెలువడజేసిన గౌ॥ ప్రకాశంగారి కృషి ప్రశంసనీయము. వారికి, కమిటీ సభ్యులకు, రైతులు కృతజ్ఞులు.

నివేదిక 18 భాగములలో జమీన్ రైతుల మహాభారతం. 18 పర్వములు గల మహాభారత మెటుల ధర్మాధర్మ విషయములతో నిండియున్నదో, ఈ నివేదిక జమీన్ రైతుల హక్కు-బేహక్కుల పరిశీలనాధర్మములతో నిండియున్నది. మహాభారతంలో ధర్మాధర్మ నిర్ణయములలో లోపమున్నట్లు ఈనివేదికయందును కొలది లోపములున్నవి. అందు ముఖ్యలోపము, ఈనాం రైతులను వేరుపర్చుటయేగాక వారి బాధలు తొలగుసూచనలు గావించక పోవుటయు, ఈనాందారులకు భూమికిమ్మతును కంపెన్‌సేషన్‌క్రింద ఇవ్వవలెనని సూచనయు, ఈనాం రైతులకు అసంతృప్తిహేతువైనవి. రిపోర్టులోని వాదములనుబట్టి ఈనాంరైతులను వేరుపర్చుట అవుసరమైనపుడు వారి బాధలు తొలగుటకు సూచనలు గావించుచు, ఎస్టేటు రెవిన్యూబిల్లుతోపాటు, ఈనాం రెవిన్యూబిల్లు కూడ నివేదికలోనే ప్రకటించి ఉండవలసినది. ఆయా లోపములను రాబోవు జనవరి శాసనసభ నాటికైన ఈనాం రైతులకు మార్గము చూపియు, రిపోర్టులోని భావముల కనుగుణముగ లేని చిత్తుబిల్లులోని లోపములను సవరించిన రిపోర్టు రైతుల ఆర్థిక దాస్యవిముక్తి చాలవరకు తోడ్పడుననుటకు సందేహము లేదు.

రైతు సంఘములు లోగడ అనేక సభలలో వెల్లడించు నటుల, నివేదికలో రైతు భూమికి హక్కుదారనియు, జమీన్‌దారు శిస్తు వసూలు దారునకు ఏర్పడిన కమీషన్ దారను విషయమును, చరిత్ర ప్రమాణములతో నిరూపించిరి. దున్నేవానికే భూమి యుండాలను రైతు సంఘం తీర్మానమును సామ్యవాద నినాదమంటూ దుష్టప్రచారము చేయుచున్న సామ్రాజ్య వాదులకు, వారి యేజంట్లకు, ధనిక రైతు వర్గమునకు, కొందరు కాంగ్రెసు వాదులకు, ఆ నినాదము రష్యానుండి దిగుమతి చేసుకున్న విప్లవ నినాదము కాదనియు, భారత దేశమున అనాది సిద్ధముగ రైతు అనుభవించి బ్రిటిషు పాలనా ఫలితముగ జమీన్‌దారుల కుట్ర ఫలితముగ అంతరించినట్టి తిరిగి పొందదగిన రైతుయొక్క స్వతస్సిద్ధ హక్కనని తేట పర్చిరి. ఈ నివేదిక యిక ముందు దున్నే వానికే భూమి యుండాలను సాటి సిద్ధాంతము ఆచరణీయ మగుటకు ప్రాతిపదికగ నుండ గలదు.

భూమికి స్వాభావిక హక్కుదారైన రైతుకే ప్రకృతి సంపదలగు సాముదాయక భూములు, అడవులు, డొంకలు, చెరువులు మున్నగునవి చెందునని స్పష్టపర్చిరి. వాటిమీద పెత్తనము, పరిపాలన రైతులదేనని అంగీకరించిరి. కాని బ్రిటిషు పాలనా ఫలితముగ నశించిన పూర్వపు భారతీయ గ్రామ స్వపరిపాలనా బాధ్యత ప్రభుత్వం వహించి, రైతులు అనుశ్రుతముగ అనుభవించిన అవుసరమైన పశు గ్రాసము, సాముదాయక భూములు, కట్టె, కంప మున్నగువాటిని పూర్వమువలె అనుభవించుటకు రైతునకు స్వేచ్ఛ నొసగుటకు రిపోర్టులో సిఫార్సు చేయబడినది.

పర్కాశం కమిటీ రిపోర్టును బలపర్చుచూ
ఆంధ్రరాష్ట్ర రైతుసంఘసూచనలను బిల్లులోచేర్చుటకై
జనవరి 12 నుండి 19 వరకు రైతుయాత్రలను
జనవరి 20 వ తేదీన బహిరంగ సభలను
జరిపి తీర్మానాలను, రెవిన్యూ మంత్రి గారికి పంపండి.
జనవరి 31 లోగా రైతుసంఘ సభ్యులుగా చేరండి.

ఇట్లు
కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి
అధ్యక్షులు
ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘం.

రిపోర్టంతయు 1802 సం॥రపు శాశ్వతపు సెటిల్‌మెంటు సూత్రంపై వ్రాయబడింది. అందువలన జమీందారు రైతులను మోసగించి చలాయించుచున్న పెత్తనము కొంతవరకు తగ్గును గాని రైతునకు సంపూర్ణముగ దరిద్ర దాస్యవిముక్తుడు కావలెననిన, జమీందారీ విధానము వినాశమొనర్పబడవలెను. శాశ్వతపు సెటిల్‌మెంటు సిద్ధాంతము అంగీకరించుట యన, జమీందారీ విధాన ముండగోరుటయే యగును. బాధానుభవఫలితముగ చైతన్యము కల్గియున్న రైతాంగము ఎన్నడు జమీందారీ విధానము ఉండ నిచ్చగింరు. కాని ప్రస్తుత రాజ్యాంగ చట్టంవలన ఏర్పడిన రాజ్యాంగపరిస్థితులలో అంగీకరింపవలెను. గత్యంతరంలేదు. మన రైతులను కోర్టుల కీడ్చుచున్న వివాదాస్పదమైన ఋణముల బిల్లువలెగాక, కమిటీ సూచనలన్నియు సంపూర్ణముగ స్పష్టమగు నిర్వచనముతో శాసనరూపము దాల్చిన, రైతులకు చాలవరకు ఆర్థిక దాస్యవిమోచనము కలుగునని ఆశచే, రైతులకీ నివేదిక స్వాగతనీయము.

నివేదిక పరిశీలించిన, గత 5,6 సం॥లనుండి రైతు సభల, యాత్రల ద్వారా వెల్లడింపబడిన రైతుల కనీస కోర్కెలు విప్లవ సూచకములు, పేరాశాజనితములు కావనియు, ఆదినుండి అనుభవించి అమాయకత్వమువలన అంతరింపబడి తిరిగి పొంద దగిన న్యాయమైన అవుసర కోర్కెలని ఋజువైనది.

రైతుసోదరులారా! రిపోర్టు బాగుంది, బాగుందని మురియకండి! ఆకలిగొన్న మనకు గౌ॥ ప్రకాశంగారు కుడుము చేతికిచ్చినారు. కడుపు నిండునని కులుకుతూ కూర్చొనకండి. కుడుమును చేతిలోనే ఎగర గొట్టుటకు జమీందారులు, సామ్రాజ్యాభిలాషులు పొంచియున్నారని గ్రహించండి. అసలు రిపోర్టునే బయల్వెడలకుండా చేయుటకు జమీందారులు గవర్నరు వరకు వెళ్ళి ప్రయత్నించారు. రెవిన్యూ మంత్రిగారు తమ విధ్యుక్త ధర్మమును నిర్వర్తించినందువలననే రిపోర్టు బయటకు వచ్చినది. ఇక నివేదిక శాసనరూపము దాల్చునప్పటికి ఎన్నో గండాలు దాటవలసి యున్నది. రిపోర్టులోని సూచనలు చిత్తుబిల్లురూపములో వెనుకంజ వేసినవి. బిల్లురూపం దాల్చునప్పటికి మరింతతగ్గవచ్చును. శాసనరూపం దాల్చిన బిల్లు అనుభవములో లాభములు తగ్గవచ్చును. ఋణములబిల్లు మనకు ప్రత్యక్ష సాక్షీభూతము కావున మనము నేటినుండి గ్రామ గ్రామాన సభలు జరిపి నివేదికను బలపర్చుచు, రాష్ట్ర రైతు సంఘం సూచించిన అవుసర సవరణలను బిల్లునందు ప్రవేశపెట్ట గోరుచు తీర్మానములను ప్రభుత్వమునకు పంపవలెను. రాష్ట్ర రైతు సంఘ ఆదేశము ననుసరించి నిర్మాణ యుక్తముగ బిల్లు శాసనమగుపర్యంతము తీవ్ర ఆందోళనతో జమీందారులు, ధనికవాద పత్రికలు, కాంగ్రెసు ప్రభుత్వమునకు కల్గించుచున్న ఒత్తిడిని తీవ్రముగా ఎదుర్కొనవలెను. లేనిచో ప్రస్తుతమున్న రాజ్యాంగచట్ట విధానముక్రింద ప్రజాసామాన్య ఒత్తిడి లేనిది దేనిని మనం పొందజాలము. పొందినను, దానిలాభము అనుభవించజాలము. ఈసందర్భమున అన్ని జిల్లా సంఘములకు ఆందోళన కార్యవిధానము అందజేయ బడెను. దాని ననుసరించి జిల్లా, తాలూకా, గ్రామ రైతు సంఘములు నిరంతర కృషి జేయవలెను. యువజనులు ముందు వచ్చి, ఈసమయమున రైతాంగమునకు అండగ నిల్చి పోరాడుదురని ఆశించుచున్నాను. పేదరైతుల కేంద్రీకృత ఆందోళనా బలమే ఆంధ్ర కేసరి కృషి ఫలమును వారు అనుభవింప జేయగలదనుట నిర్వివాదాంశము.

రైతుల ఆందోళనాశక్తివలన తమకు కలుగు ఒత్తిడిని సరకుగొనక, ఈనెల 4 వ తేదీని ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘంవారు సూచించిన అవుసర సవరణలతో జమీందారీ రెవిన్యూ బిల్లును కాంగ్రెసు శాసన సభ్యుల తోడ్పాటుతో రెవిన్యూ మంత్రిగారు జనవరిలో జరుగనున్న శాసనసభలోనే బిల్లును శాసింప జేయుదురని ఆశించుచున్నాను.

బెంగాల్ కార్మికులకు

ఫజ్లుల్ హక్ తలపెట్టిన ద్రోహం

బెంగాల్ జూట్ ఆర్డినెన్సు

బెంగాల్ రాష్ట్రము జూట్ (జనుము, గోగునార) పంటకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ దీనికి సంబంధించిన పరిశ్రమలు కూడా బాగా వృద్ధి పొందాయి. యీ పరిశ్రమలో పెట్టుబడి చాలా భాగము యూరపియన్ దేశస్థులది. భారతీయుల పెట్టుబడి కొద్ది మాత్రమే ఉన్నది. బెంగాల్లో ఉన్న మొత్తం 60 వేల మగ్గాలలోనూ భారతీయుల స్వాధీనంలో ఉన్న మగ్గాలు 9 వ వంతులకుమించవు. మిగిలినవి యూరపియనులవే.

గత సమ్మె

1937 వ సంవత్సరంలో సాగిన బెంగాల్ జూట్ సమ్మెవలన యజమానులు కార్మికులకు చేస్తున్న అక్రమాలను కార్మికులు ప్రపంచానికి తెలియజేయగలిగారు. జూట్ కార్మికుల స్థితిని విచారించడానికి ప్రభుత్వము ఒక కమిటీని వేస్తానన్నది. కాని వేయలేదు. తమపరి తమ హక్కులను యజమానులు హరించకుండా చేసుకొనుటకును కొద్ది సంపాదించుకొనుటకును, కార్మికులు పోరాటాలను సాగించారు. వీటి ఫలితముగా కార్మికవర్గం యొక్క సంఘటనాశక్తి వృద్ధి అయింది. కార్మికుల ఉద్యమాన్ని అణచివేయడానికి జూట్ మిల్లు యజమానులు "హక్" ప్రభుత్వాన్ని ఆశ్రయించారు.

బెంగాల్ప్రభుత్వం ధనికవర్గానికి సేవచేసే గులాం. ఇటీవల గాక ఆ నవ్య బెంగాల్ మంత్రి వర్గంపై పరిషత్తు విశ్వాస రాహిత్య తీర్మానాన్ని తీసుకొనివచ్చినప్పుడు యూరపియన్ సభ్యుల సహాయంతో హక్ మంత్రివర్గం తన గండాన్ని తప్పించుకొంది. ఈరెండు కారణాలవల్ల ఆ యజమానులకు హృదయశల్యమైన కార్మికవర్గాన్ని అణచి, ధనికవర్గానికి లాభాలను ఇవ్వాలనుకొంది. శాసనం ద్వారా తప్ప ఇంకోవిధంగా ఇది అసాధ్యం. కార్మికుల నోటినుండీ, కర్షకుల నోటినుండి తిండిని పడగొట్టి భాగ్యవంతులకు పెట్టాలి. ఈ ఉద్దేశ్యముతో "హక్" మంత్రివర్గం జూట్ ఆర్డినెన్సును ప్రకటించింది.

ఆర్డినెన్సు.

"300 మగ్గాలకు పైగావున్న ఏ జూట్ మిల్లులోగాని మగ్గాల సంఖ్యను చీఫ్ ఇన్స్పెక్టరునుండి వ్రాతపూర్వకమైన అనుమతి లేకుండా హెచ్చు చేయడానికి వీలులేదు. 300 లకు తక్కువ మగ్గాలున్న మిల్లులు 5 మాత్రం, మగ్గాల సంఖ్యను 300 వరకూ హెచ్చించవచ్చును. కాని అవి 175 మగ్గాలు పూర్తి చేసినప్పటి నుండియు పనిచేసే గంటలు 45 కు మించరాదు. 175 కు లోపుగా మగ్గాలున్న మిల్లులు వారానికి 72 గంటలు పని చేయాలి. ఏ మిల్లు యజమానిగాని చీఫ్ ఇన్స్పెక్టరుయొక్క అనుమతి లేకుండా మగ్గాలను మార్చడానికి వీలులేదు. బెంగాల్ జూట్ పరిశ్రమలో సరుకు ఎక్కువ తయారయి నిలవ అయిపోవడంవల్ల దానికి సరియైన లాభాలను రాబట్టాలంటే జూట్ ఉత్పత్తిని ఆపు చేయాలి. అందుకే యీ ఆర్డినెన్సును అమలు జరిపాము." అని ప్రభుత్వం ప్రకటించింది.

యీ ఆర్డినెన్సు ఫలితంగా 175 మగ్గాలకు పైన ఉన్న మిల్లులన్ని వారానికి 45 గంటలకన్న ఎక్కువ పని చేయరాదు. యిదివరలో ఇవి 54 గంటలు పని చేసేవి. పని చేసే గంటలను తగ్గించినా, కార్మికులకు వేతనాలకుగాని, వృత్తికిగాని భంగంరాకుండా కాపాడే క్లాజులు యీ ఆర్డినెన్సులోలేవు. అందుచే మిల్లులలో పనిచేసే కూలీల సంఖ్య కనీసం 6 వ వంతైనా యజమానులు తగ్గిస్తారు. లేకపోతే ఎక్కువ గంటలు పని చేసే మిల్లులు గావాలంటే పనిచేసే మగ్గాల సంఖ్యను 174 కు తగ్గిస్తారు. ఏ విధంగా చూచినా పనిచేసే కూలీల సంఖ్యను తగ్గిస్తారు. పనిచేసే మిగిలిన కూలీల జీతాలు కూడా ఇప్పటికే 6 వ వంతు తగ్గాయి.

ఇక 175 లోపు మగ్గాలున్న మిల్లులకు 300 మగ్గాల వరకూ హెచ్చించే అవకాశం ఉన్నా, అంతకు ఎక్కువ మగ్గాలున్న మిల్లులతో పోటీ చేయడం కోసం, మగ్గాల సంఖ్య 174 లోనే ఉంచి, 72 గంటలూ పని చేస్తు, తక్కువమంది కూలీలతో ఎక్కువ సరకు తయారు చేసే శక్తి గలయంత్ర విధానాన్ని ఏర్పాటు చేయాలి. లేకపోతే పెద్ద మిల్లులతో కలియనైనా కలవాలి. లేకపోతే నష్టపడుతూ పోటీకి నిలవలేక ఆపివేయాలి. ఈ మూడింటిలోనూ మిల్లు యజమాని సహజంగా మొదటి పద్ధతిని అవలంబిస్తారు. ఒక్కొక్క కూలీ చేత ఇదివరకన్న ఎక్కువ మగ్గాల మీద పని చేయిస్తారు. మిగిలిన వారిని పనిలోనుండి తొలగిస్తారు. ఇది గాక మిగిలిన రెండు పద్ధతులు అవలంబించినా కూలీలను పనినుండి తొలగించాలి.

ఈవిధంగా పనిచేసే కార్మికుల సంఖ్యలోనూ వారి జీతాలలోనూ తగ్గింపు కలిగింది. మగ్గాల సంఖ్యకు హద్దు (limit) పెట్టడం వల్ల, వీటితోనే మామూలు కన్న ఎక్కువ లాభాలను సంపాదించాలని మగ్గాల ఉత్పత్తి శక్తిని వృద్ధి చేస్తారు. అందుకై యంత్రసహాయాన్ని ఎక్కువ చేసి, కార్మికుల సంఖ్యను తగ్గిస్తారు. అందుచే ఒక్కొక్క కార్మికుడు యిదివరకటి కన్న కనీసం 20 రెట్లయినా స్పీడ్ ఎక్కువ చేయాలి. ఈ స్పీడ్ (వేగం)కు తట్టుకో లేని కార్మికు లకందరికే పని పోతుంది.

ఈ ఆర్డినెన్సు ఫలితంగా కార్మికుల జీతాలలో నెల 1 కి 11 లక్షల రూపాయలు తగ్గిపోయాయి. 35 వేల మందికి పైగా వృత్తి పూర్తిగా పోయింది. మిల్లు యజమానులకు మాత్రం లాభాలు తగ్గవు. సరుకు ఉత్పత్తి యధాప్రకారమే సాగిస్తున్నారు. పనిలోనుండి తొలగింపబడిన కార్మికుల వేతనాల క్రింద ఇచ్చే డబ్బు కూడా అదనంగా యజమానులకు మిగులుతోంది.

ఈ ఆర్డినెన్సు భారతీయ పెట్టుబడి దారుల స్వాధీనంలో ఉన్న మగ్గాల అభివృద్ధిని ఆపు చేసింది. అందుచే ఇతర దేశీయులతో పోటీ చేయడం కోసం భారతీయుల ప్రయత్నాలు వ్యర్థమైనవి. యూరపియన్ పెట్టుబడిదారులు యధావిధిగా తమ లాభాలను నిరాటంకంగా సంపాదించుకొనే సావకాశాలను ఈ ఆర్డినెన్సు వారికి కలిగించింది.

ఈ ఆర్డినెన్సు జూట్ పండించే వ్యవసాయ దారులకు కూడా నష్టం కలిగించింది. పనిచేసే గంటలు తగ్గాయనే సాకుతో పెట్టుబడిదారు తమకు ముడి సరకుఎక్కువ అవసరంలేదని వ్యవసాయదారులు జూట్ను అమ్మకానికితెచ్చినప్పుడుదానిధరలుతగ్గిస్తారు.పరిశ్రమలో సర్వాధికారం ఈ పెట్టుబడిదారులకే ఇవ్వబడడంచేత, వీరికెవ్వరూ పోటీ లేనందున, ఇది సాధ్యమవుతూ ఉంది. ఈ రకంగాకూడా పెట్టుబడిదారులు లాభము పొందు తున్నారు. జూట్ ధర ఈ విధంగా పడిపోవడమువల్ల రైతుల ఆదాయంలో సాలీనా 7 కోట్ల రూపాయిలు తగ్గిపోయాయి.

కార్మికుల ప్రతిఘటన

ఈ ఆర్డినెన్సు అమలులోకి వచ్చిన రెండు మూడు వారాలలోనే 35 వేల మంది కార్మికులు పనిలోనుండి తొలగింప బడ్డారు. జూట్ ధర పడిపోయింది. కూలీలపై మిల్లు యజమానుల నిర్బంధం ఎక్కువయింది. దీనిని ఎదుర్కొనేటందుకు ప్రయత్నించే కార్మికులను యజమానులు పనిలోనుండి తొలగించసాగారు.

ఈ ఆర్డినెన్సు పట్ల తమ అసమ్మతిని తెలుపుతూ బెంగాల్ జూట్ కార్మికులు "హక్" మంత్రి వర్గానికి రెండు నెలల క్రితం ఒక మెమోరాండం పంపారు. దీనిని కార్మికులందరూ ఆమోదిస్తూ మహా సభలలో తీర్మానాలు చేశారు. ప్రజా పార్టీ, కృషక్ ప్రజా పార్టీలు కూడ ఈఆర్డినెన్సు రైతాంగానికి హానికరమని ఖండించాయి. కాని బెంగాల్ హక్ మంత్రి వర్గం వీనిని వేటినీ లెక్క చేయలేదు. కార్మికులకు జనరల్ స్ట్రయికు తప్ప వేరేమి గత్యంతరం లేక పోయింది.

దీనికై తీవ్రంగా పనిచేసే కార్మికులను 6 గురిని టిటాఘర్లో స్టాండర్డు మిల్లు యజమానులు పనిలో నుండి తొలగించారు.

దానిపై టిటాఘర్ మిల్లు యజమానుల అక్రమాలను ఖండిస్తూ, ఆ 6 గురు కార్మికులను పనిలోకి తిరిగి తీసుకొనవలసినదని కోరుతూ 32 వేల మంది కార్మికులు నవంబరు 14 వ తేదీనుండి సమ్మె సాగిస్తున్నారు. కార్మికుల సమ్మె పోరాటాన్ని భగ్నం చేసేటందుకు దీనిని హిందూ మహమ్మదీయ కొట్లాటలుగా మార్చాలని మిల్లు యజమానులు రౌడీలను ఉపయోగించారు. హక్ మంత్రివర్గంకూడ దీనికి చాల సహాయం చేసింది. మత ద్వేషాన్ని పురికొల్పింది. పోరాటాలు జరిగాయి. కొందరు మరణించారు.

కాని, నిహారేందు దత్తు ముజుందారు ఎం. ఎల్ ఏ. కలకల్ హుదా మొదలయిన కార్మిక నాయకులు సకాలంలో కార్మికుల మధ్య తీవ్రమయిన ప్రచారాన్ని సాగించి, ఈ మతకలహాన్ని అంతమొందించారు. కొట్లాటలు అంతమయాయి.

జనరల్ స్ట్రయికు నిశ్చయం.

నవంబరు 26 వతేదీని బెంగాల్ చట్కాల్మజ్దూర్ యూనియన్ కేంద్రకమిటీ, వివిధ మిల్లులనుండి ఎన్నుకోబడి వచ్చిన ప్రతినిధులు, కలసి సమావేశమయి యీ టిటాఘర్ సమ్మెనే,జూట్ కార్మికుల జనరల్ స్ట్రయికుగా మార్చాలని తీర్మానించి దానికొక కార్యక్రమాన్నిచ్చి నడిపేటందుకు కేంద్ర కమిటీని ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలలో ప్రాంతీయసమ్మె కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి. అప్పుడే లక్షమందికిపైగా కార్మికులు సమ్మెలో చేరారు. ఇందు స్త్రీలుకూడా చాలామంది ఉన్నారు. ప్రభుత్వము 144 సెక్షన్ ప్రయోగించింది. 51 మందిని అరెస్టు చేసింది. 13 గ్గురిని శిక్షించింది. సాయుధ పోలీసులను కావలా వేసింది. కార్మికుల ప్రదేశాలలోకి పోవద్దని శివనాధ బెనర్జీపై నిషేధాజ్ఞను ప్రయోగించి ఆయనను అరెస్టు చేసింది.

యీ సమ్మెలో ముఖ్యమైన విషయం యింకొకటి. జూట్ ధరను మ॥ 1కి 7 రూ॥ లకు తక్కువ కాకుండ చేసి వ్యవసాయదారులకు లాభం చేయవలసిందనికూడా కార్మికులు కోరారు. దానిని వారి కనీసపు కోర్కెలలో నొకటిగా చేర్చారు.

అందుచే కర్షకులు కూడా ఈపోరాటానికి దోహదమిచ్చే అవకాశాలు చాలాఉన్నాయి. ఇటీవలనే బెంగాల్ రాష్ట్ర కాంగ్రెసు కమిటీ, కార్మిక కర్షక సమస్యల విషయమై శ్రద్ధ తీసుకొని పని చేయడానికి కనీస కార్యక్రమాన్ని ఇచ్చింది. బెంగాల్ రాజకీయ ఖైదీలు కూడా తమ సమస్యల నివారణకై నిరసన వ్రతం చేస్తామని నోటీసు ప్రకటించారు. ఇవన్నీ నలు దిక్కుల నుండీ విజృంభిస్తున్న విప్లవ శక్తులు. వీటిని సమీకరణ మొనర్చినచో బెంగాల్లో జాతీయవ్యతిరేకమైన హక్ మంత్రి జాతీయ వర్గాన్ని అధికారంలోనుండి పడగొట్టడానికి వీలౌతుంది. ఐక్యసంఘటనను కూర్చవలసిన కాంగ్రెసు ఈ పనికి పూనుకోవాలి.

గుడివాడ కార్మికులు మీటింగు చేసుకోకూడదట!

మీటింగుకు వెళ్ళినందుకు నిర్బంధము

గుడివాడ రైస్ ఫ్యాక్టరీ కార్మిక సంఘమువారిచే ఏర్పాటు చేయబడిన ఉపసంఘ సభ్యులు మిల్లు యజమానులను కలుసుకొని ఆదివారములు శలవులు ఇవ్వవలసినదని కోరారు. ఒక మిల్లు యజమాని తప్ప మిగిలినవారు అంగీకరించారు.

4.12.38 తేదీ ఆదివారంనాడు కార్మికులు యూనియన్ మీటింగుకు వెళ్ళకూడదని శ్రీ మర్గా నాగేశ్వర రైస్ మిల్లుల, యజమానులు తమ మిల్లు కార్మికులను బెదరించి ఆపుచేశారు. 5.12.38 తేదీని శ్రీ సీతారామాంజనేయ రైస్ మిల్లు కూలీలు పనిలోకి వెళ్ళగానే, గత దినము మీటింగుకు వెళ్లారనే కారణముచేత పనిలోకి రావద్దని ఆపుచేశారు. పిమ్మట కొంతసేపు ఆలోచించి పనిలోకి తీసుకొన్నారు. గుడివాడ మిల్లులలో రోజూ ఉదయం 4 గంటనుండి రాత్రి 8 గం॥ వరకూ కూలీలు పని చేస్తున్నారు.

పాట్నా

134 కార్మికుల అరెస్టు

చంపరాన్జిల్లాలోని హరినగర్ పంచదారమిల్లులో సమ్మె సుమారు నెలనుండి జరుగుతోంది. పికెటింగు చేస్తున్నారు. డిశంబరు 8 వ తేదీకి 134 మంది అరెస్టు చేయబడ్డారు. ఇటీవలనే అండమానులనుండి విడుదల అయిన జోగేంద్ర శుక్లాగారుకూడా అరెస్టుచేయబడ్డారు. మిలటరీని ప్రభుత్వం సిద్ధంగా వుంచింది.

కార్మికులకు ప్రమాదాలు హెచ్చాయి.

భారతదేశములో గనులలో పనిచేసే కార్మికులకు కలిగే ప్రమాదాలు 1927 సం॥నుండి 35 సం॥ లోపున నూటికి 150 వంతున హెచ్చిపోయాయి అని అంతర్జాతీయ కార్మిక ఆఫీసు (జనీవా) ప్రకటించినది.

కలకత్తా

రైల్వే పోర్టర్ల అరెస్టు.

కలకత్తా స్టేషన్లోని 23 గ్గురు పోర్టర్లను కంపెనీ వారు డిస్మిస్ చేశారు. కాని ఈ వార్తను కంట్రాక్టర్లు వ్రాత పూర్వకముగా కార్మికులకు తెలియచేయలేదు. అందుచే మామూలుగానే పనిలోకి వెళ్ళగా పోలీసులు వారిని అరెస్టుచేసి వారిపై ట్రెస్పాస్ కేసు పెట్టారు. తప్పు కంట్రాక్టర్లది, కంపెనీది అయినా శిక్ష మాత్రం కార్మికులకే, ఎంత అన్యాయము?

కార్మిక నాయకుని విడుదల.

నవంబరు 1937 లో, కలకత్తా పోర్టు ట్రస్టు కార్మిక సంఘ కార్యదర్శి అయిన యన్. సి. భట్టాచార్యగారు వర్గద్వేషాన్ని కలిగించే ఉపన్యాసము ఇచ్చారని వారిని అరెస్టుచేసి 1 సంవత్సరము శిక్ష విధించారు. దానిపై హైకోర్టులో అప్పీలు చేస్తే 1938 వ సంవత్సరము డిశంబరు 5 వ తేదీని ఈయనపై కేసు కొట్టేసి విడుదల ఆర్డరు ఇచ్చారు.

దత్తు ముజుందారుగారి ఎరెస్టు.

బెంగాల్ కార్మిక నాయకులు, లేబరు పార్టీ ప్రెసిడెంటు అయిన నిహారేందు దత్తు ముజుందారు గారిని, బెంగాల్ చట్కాల్ మజ్దూర్ సభ సభ్యులయిన మరి 5 గురు లేబరుపార్టీ సభ్యులను, టిటాఘర్ మిల్లు ఏరియాలో అక్రమసంఘంగా ఏర్పడ్డారనే నేరము క్రింద డిశంబరు 9 వ తేదీని అరెస్టు చేశారు. ఒక్కొక్కరికి 300 రూపాయల జామీనుపై విడుదల చేయబడ్డారు. 22 వ తేదీకి కేసు వాయిదా వేయబడినది.

బొంబాయి

నావికుల ప్రదర్శనం

పి. అండ్. ఓ. బ్రిటిష్ ఇండియన్ స్టీమ్ నావిగేషన్ కంపెనీలకి సంబంధించి రెండు ఓడలలో పనిచేయడానికి కార్మికులనుండి దరఖాస్తులను, ఆ కంపెనీల ఏజెంట్లు తీసుకొంటూండగా 500 మంది నావికులు, పెద్ద ప్రదర్శనాన్ని చేసి "క్రొత్త నావికులను చేర్చుకొనే ముందు నిరుద్యోగులయిన నావికులకు టరనువారీగా పని యివ్వాలి" అని కోరారు. ఏజన్సీ ఆఫీసును మూసివేశారు.

కనీసపు కూలి పనికిరాదట.

బొంబాయి ప్రభుత్వముచే నియమింపబడిన టెక్స్టైలు విచారణ కమిటీ విచారణ సాగిస్తోంది. కార్మికులకు కనీసపు కూలి, నిర్ణయించి శాసనంగా చేయడానికి మిల్లు యజమానులు వ్యతిరేకించారు. కారణాలు 1, ఈ నిర్ణయము శాశ్వతముకాదని, 2, అన్ని పరి

కార్మిక పోరాటాలు

శ్రమలలోనూ కూడా ఈ నియమము చేయాలనియు, 3. ఈ బట్టల పరిశ్రమకైనా దేశము మొత్తముమీద ఉండాలిగాని ఒక రాష్ట్రములోనే చేయడము నష్టము అనీ, 4. కేంద్ర ప్రభుత్వము మిల్లు యజమానుల కిచ్చిన రక్షణను రాష్ట్ర ప్రభుత్వము తగ్గించడము అన్యాయమనీ కారణాలు చెప్పారు.

అహమ్మదాబాదు

జనరల్ స్ట్రయికు

అహమ్మదాబాదు సరణికామ్‌దార్ యూనియన్ అక్టోబరు నెలలో తమ ఇబ్బందులను మిల్లు యజమానులకు తెలియజేసి వాటిని నివారింపజేసుకొనిరి. కాని న్యూషరాక్ మిల్లు యజమానులు వారి షరతులను అంగీకరించకపోవుటచే సమ్మెను సాగిస్తున్నారు. వీరి కోర్కెలను నెరవేర్చకపోతే అహమ్మదాబాదులో జనరల్ స్ట్రయికు చేస్తామని కార్మికులు తీర్మానించారు.

కాన్పూరు

కాన్పూరు బెవిస్ కంపెనీ కూలీల కూలిని హెచ్చు చేయడానికిని 1938 జూలై నెలలోని ఒడంబడికల ప్రకారమే కార్మికులకు జీతాలుఇవ్వడానికి పనిమార్పులు వగైరాలు చేయడానికి అంగీకరించారు.

15 రోజుల నోటీసు లేకుండా సమ్మె చేయమని కార్మికులు అంగీకరించారు. సమ్మె ఆగిపోయింది.

ఝరియా

బొగ్గుగనిలో సమ్మె

బాచ్ బొగ్గుగనులలో పనిచేసే కార్మికులు 1000 మంది అక్టోబరు 31 వ తేదీ నుండి సమ్మె సాగిస్తున్నారు. గనిలో పనిచేస్తూన్న కార్మికులను బెదరిస్తున్నారనే నేరముపై 2 స్త్రీలను, 1 పురుషుని అరెస్టు చేశారు. గని ఏరియాలో 5 గురికి మించి కార్మికులు కలిసి తిరుగరాదనియు, కర్రలుగాని, ఇతర ఆయుధాలుగాని ధరించరాదనియు 144 వ సెక్షనును ప్రభుత్వము జారీ చేసినది. సాయుధపోలీసులు కావలాకాస్తున్నారు.

కత్రాస్ బొగ్గు గనులలో గత 75 రోజులనుండి సాగుతూన్న సమ్మెను పరిష్కారంచేయడానికి బీహారు ప్రభుత్వపు లేబరు అసిస్టెంటు అయిన బి. బి. శుక్లా గారు 11 వ తేదీని గనులవద్దకు వెళ్లారు. మిగిలిన ప్రాంతాలతో ఇచ్చే కూలి కంటె తక్కువ ఇక్కడ ఇవ్వడంలేదనీ, కార్మిక సంఘం సరిగ్గా ఏర్పడి రిజిష్టరు అయితే రికగ్నైజు చేయడానికి తనకేమీ అభ్యంతరం లేదనీ, బీహారు ప్రభుత్వంచేత ఏర్పాటు చేయబడ్డ కార్మిక విచారణ కమిటీ విచారణ పూర్తి అయే వరకూ తానేమీ చేయలేననియు, నేరం చేసిన కార్మికులను పనిలోకి తీసుకోలేననియు యజమాని చెప్పాడు. ఈ విషయాన్ని మధ్యవర్తి సంఘానికి పంపవలసినదని సుక్లాగారు సూచించగా తనపై కలకత్తాలోని అధికారితో సంప్రదించి చెపుతానన్నాడు. యీ పరిస్థితులు అంత అనుకూలముగా లేవనీ త్వరలోనే జనరల్ స్ట్రయికు వచ్చే సూచనలున్నాయని కార్మిక సంఘాధ్యక్షుడయిన అబ్దుల్ బారీగారన్నారు.

మధుర

మధుర మిల్లు కార్మిక తగాదా సందర్భంలో అరెస్టు చేయబడి శిక్షింపబడిన ముత్తు రామలింగతేవర్ గారు డిశంబరు 7 వ తేదీని మద్రాసు ప్రభుత్వముచే విడుదల చేయబడ్డారు. మహలక్ష్మిమిల్లు యజమానులు ఒడంబడికలను సరిగా అమలు జరుపుటలేదనియు, కార్మిక సంఘ కార్యదర్శియైన పి. జీవానందముగారిపై కేసును ఉపసంహరించుకొని విడుదలచేయవలసిందనీ కోరుతూ మంత్రిగారికి జాబు వ్రాశారు.

కామ్రేడ్ పి. జీవానందంగారి స్టేట్మెంటు.

పశుమలై మిల్లు కార్మికసంఘ కార్యదర్శియైన, కామ్రేడ్ పి. జీవానందంగారు తనపై కేసు విచారణకువచ్చినప్పుడు తనపై మోపబడిన నేరం అక్రమమైనదనియు, ఇద్దరు సమ్మెదారులను పోలీసులు కొట్టి రైల్వే ఆవరణలోకి ఈడ్చివేశారని, ఆ ఘటనను చూచిన కొందరు చెప్పగా తాను వెళ్ళి అక్కడ మూగియున్న ప్రజల సహాయంతో వారిని వైద్యాలయానికి తీసుకొని వచ్చుచుండగా పోలీసులు తనను అరెస్టు చేశారనియు తానే అభ్యంతరం కలిగించలేదనియు స్టేట్మెంటు ఇచ్చారు.

కథ

(... వ పేజీ తరువాయి)

"ఈ రోజునుండి స్త్రీ ఆందరికి మంచి భోజనము యిచ్చేందుకు యేర్పాట్లు జరిగినయి. సత్రువక్తిగాని సైన్యాలలో జాతి విభేదాలు పురిగొల్పి చెడగొట్టడానికి ప్రయత్నించేవారు కోర్టు మార్షల్ ద్వారా శిక్షింపబడతారు" కమేండర్ ఆఫ్ సార్జెంటు జనరల్.

ఆ సాయంకాలమే నగాలన్నీ స్థిమితపైబాంబుమీద వీరులు తీర్చి నిలబడ్డాయి. నిహారేన్ బాబూ, శ్యామలాల్ చేతులు విరిచికట్టి ఒక చిన్న నిలబెట్టబడ్డారు. వారిని కాల్చడానికి ఓ సాయులు సిద్ధంచేశారు. అది సైన్యమనే సంగతి మరచి ఫ్రెంచి తో ఒక అనుగు ముందుకు వేశాను. మా రెజిమెంటల్ సార్జెంటు పసిగెత్తుకు వచ్చి 'యిద్దరి యూనియన్' అని అబూటు కాళ్ళతో చెరిపి చిన్న సరిగా లయినులో నిలబెట్టాడు. ఫిరంగులు పేలేయి: నిహారేన్ బాబూ వెనక్కి పడ్డాడు. ముఖమంతా రక్తంతో నిండిపోయింది. నోటినుండి రక్తం కారుతూ గొణిగి నట్లుగా శబ్దం వస్తోంది. వృతకాయుడయిన శ్యామలాల్ ముందుకూ వ్రేలిబడి తన వాళ్ళ ప్రక్కకు పడ్డాడు. అతని శరీరంలోనుండి ప్రవహించే రక్తధార ఆ ప్రదేశాన్ని నింపుతోంది.

ఆ రాత్రి సరిగా నిద్ర పట్టలేదు. నిహారేన్ బాబూకన్న బెంగాలీ నేర్చుకోవటము. అతనితో కలిసి వాదించుకు ప్రయత్నించటము అన్నీ తలపుకు వచ్చేయి. న్యాయం ఆలోచిస్తే అతను చేసిన తప్పేమిటీ యదార్థాన్ని బయట పెట్టినందుకే బహిరంగంగా చిత్రవధ చేయబడ్డాడు.

ఒక సంవత్సరం పైగా నేను (trenches) కందకాలలోకి పోలేదు. గుర్రాలను మేపడం, గోతులు తీయడం, సామాన్లు మోయడం పనులలోనే నియమించబడ్డాను. సాయంకాలం మామూలుగా కవాతు వుండేది. ఒక రోజు సాయంకాలం గడ్డపారలు భుజాన పెట్టుకొని రేంజుకి పోతున్నాం. కొంచెం దూరంలో వస్తున్న, రంగయ్యా అనే పిలుపు వినబడ్డాయి. వెనక్కి తిరిగి చూచేను అతను ఖాసిం. పొంచివుగా వచ్చి నన్ను గట్టిగా కౌగలించుకొని "యేమోయ్ రంగయ్యా యెంత కాలానికి అగుపించేవు. పెద్దవాడివి కూడా అయ్యావే" అన్నాడు. ఎంతో అప్యాయంగా నా తల నిమురుతూ, ఇండియా నుండి వచ్చిన తన తోటి సోదరులు చాలమంది యుద్ధంలో చనిపోయారనీ, కొందరు ప్రపంచానికే నిరుపయోగమైన స్థితిలో హాస్పిటలులో పడివున్నారనీ, తాను సెలవు కొరకు ప్రయత్నిస్తున్నాననీ, సెలవు దొరికితే ఇండియాకు పోతాననీ కూడా చెప్పేడు. ఖాసిం ఒక రోజున నన్ను తన స్నేహితుడైన మహమ్మద్‌కు పరిచయం చేసేడు. మహమ్మద్ హైదరాబాదు కాపురస్థుడు తెలుగు చక్కగా మాట్లాడగలడు. అక్కడ అయిదు సంవత్సరాల నుండి కిచెన్ (వంట) డిపార్టుమెంటులో వుంటున్నాడు. మహమ్మద్‌తో పరిచయం నాకు కొంతవరకు సుఖం కలుగజేసింది. తరుచు మంచి రొట్టె మాంసం దాచుకుంటూ వుండేవాడు. ఒక సాయంకాలం మహమ్మద్ చేతిలో చిన్న పొట్లం పుచ్చుకొని నాదగ్గరకు వస్తూనే ఆ పొట్లం నాచేతికిచ్చి ఖాసిం చనిపోయాడనీ తాను ఫ్రాన్సు జర్మనీ సరిహద్దుకి మార్చబడి రాత్రికే బయలుదేరుతున్నామనీ చెప్పి వెళ్ళిపోయాడు. ఆ పొట్లములో రెండు నల్లగా వుడికిన దువాళ్ళు కొంత రొట్టె వున్నాయి.

తిరిగి క్రిస్టమస్ వచ్చింది. నేను యిల్లు వదలి యిప్పటికి రెండు సంవత్సరాలు. తరచు యింటికి వ్రాసే వుత్తరాలకు సమాధానాలు వస్తూనే వున్నాయి. నేను మొదటిసారి యుద్ధంలోకి పోయాను. వారంరోజుల వరకు కందకాలలోనే (Trenches) వున్నాము. చివరి రోజుల్లో తిండి, నీరూ కూడా లేక చాలా యమయాతన పడ్డాను. ప్రక్కనవున్న వాడిని మంచి నీళ్ళడిగేను. వాడు ఫ్రెంచి భాషలో అర్థము కాకుండా యేమో గొణిగేడు. నోటిదగ్గర చేయి పెట్టి దాహం అని సౌజ్ఞచేసేను. వాడు తన ఖాళీ డబ్బాను తలక్రిందచేసి లేదని చూపెట్టేడు. తెల్లవారుఝాము రెండు గంటలవుతుంది. బహుళ చంద్రుడు యెలా తెలా పోతున్నాడు. యెదుటివైపున పేల్చే తుపాకుల చప్పుడు క్రమంగా తగ్గుతోంది. అపరిమితమైన దాహముతో ప్రాణం పోయేట్టుంది. కందకంలోనుండి నెమ్మదిగా పైకిప్రాకేను, చప్పుడు చేయకుండా వెనకాలవున్న కందకంలో దిగేను. దానిలో వాడు చచ్చిపడివున్నాడు. అక్కడనుండి యింకో చోటికి పోయాను. అది ఖాళీగావుంది అప్రక్క కందకంలో ఒకడు గురకపెట్టి నిద్రపోతున్నాడు. నెమ్మదిగా వాడిని లేపేందుకు ప్రయత్నించేను. వాడు కంగారుగా లేచి (halt) అగు అంటూ తుపాకీ గురిచేసేడు. నేను మిత్రుడేనని సమాధానం చెప్పి మంచినీరు అడిగేను. వాడిచ్చిన నీటితో కొంత వరకు దాహం తగ్గింది. ఆకారాన్నిబట్టి వాడు మంగోలియన్ అని అనుకున్నాను. తినడానికేమైనా దాచుకున్నాడేమోనని యిద్దరం కలసి మరి కొన్ని కందకాలు వెదకేము, కొన్నిటిలో చచ్చిన శవాలు కుళ్ళి వాసన వేస్తున్నాయి, కొన్ని ఖాళీగానే వున్నాయి. కందకాలలో యెక్కడ మనుష్యుల శబ్దము వినిపించుట లేదు. తెల్లవారే సరికి కేంపుదగ్గర చేరుకున్నాం అక్కడి వారందరు (retreat) పలాయనం సన్నాహంలో వున్నారు.

సాయంకాలం 3 గంటలయింది. ఏదో పట్టణం సమీపించేము. వెనక్కిపోయ్యే సైన్యం పైన అకస్మాత్తుగా జర్మను విమానం గస్తీచింది. సైన్యమంతా చెల్లాచెదరై చెట్లచాటుకి పుట్లచాటుకి పరుగెత్తేరు. కాని వెంట వెంటనే జారవిడచిన బాంబులకు కొందరు చనిపోయారు చాలా మందికి గాయాలు పడినాయి. నాయెడమ చేతికి బలమైన దెబ్బ తగిలింది. దువాలుతో గట్టిగా కట్టు కట్టాను. కాని గుండు లోపలే వుండి విపరీతమైన బాధ కలిగించింది. తీవ్రమైన జ్వరంతో నడిచే ఓపికలేక అయాసంతో కూలబడ్డాను. నా సమీపంలో ఒక స్కాటు సైనికుడు అదే స్థితిలో పడివున్నాడు. కొంతసేపటికి అంబ్యులెన్సు కారు వచ్చి మా దగ్గర ఆగింది. అస్కాటు సైనికుణ్ణి యెత్తి లోపల పెట్టేరు. చోటులేదని నన్ను వదలివేయడానికి సిద్ధపడ్డారు. అది గ్రహించి అతి దీనంగా బ్రతిమాలుకున్నాను. చివరకు ఆ జ్యా డ్రైవరు బలవంతంమీద నన్ను కూడా యెక్కించుకోక తప్పిందికాదు. మనస్సులో ఆద్రయివరు కెన్నో వందనాలు చెప్పేను. పట్టణంలో వున్న ప్రతి హాస్పిటలు ముందు అంబ్యులెన్సు ఆగుతూ వచ్చింది. అన్నింటిలో— ఖాళీ లేదన్నారు, ఒక చోట యిద్దరికి ఖాళీ వుందంటే అస్కాచివాళ్ళిద్దరినీ అక్కడ దిగబెట్టేరు. నేను తాత్కాలికంగా పెట్టిన (first aid) హాస్పిటలుకు పంపబడ్డాను.

ఆ జాక్టరు పరీక్షచేసి నాచేతికి ఆపరేషన్ అవసరమని రిక్షాలో యెక్కించి హాస్పిటలుకు పంపేడు. కాని అక్కడ డాక్టరు అప్పుడు చేసుకోకుండానే చెప్పి పంపేశారు. జ్వరం కోపంతో ఒక వుత్తరం వ్రాసి మరం అక్కడికి తీసుకుపోమ్మన్నాను. ఆ వుత్తరం చేతితో పుచ్చుకొని ఒక నన్ను చికాకుపడుతూ హాస్పిటల్లో అటూ యిటూ తిరిగింది, చివరికి శవాలు పడేసే గదిలో నన్ను ప్రవేశపెట్టేరు. అక్కడ అదివరకే కొనప్రాణంలో వున్న యిద్దరు నిపాయిలున్నారు. ఆ రాత్రే వాళ్ళు చనిపోయారు. స్ట్రెచర్లపై దావడానికి సిద్ధముగావున్న వారంపరినీ ఆగదిలో పడేస్తున్నారు. శవాలను తీసుకుపోవాని కొచ్చినవాళ్ళు అప్పుడప్పుడు నన్నుకూడ కదల్చి చూచేవాళ్ళు.

రెండో రోజున నా చేతికి ఆపరేషన్ చేసి లోపల వార్డులో ప్రవేశపెట్టారు. నాలుగు రోజులకి కొంచెం ఆరోగ్యం చేకూరింది. హాస్పిటలు అంతా దెబ్బలు తిన్న సోల్జర్లతో నిండిపోయింది, యుద్ధం ఆగిపోయే సూచన్లు అగుపిస్తున్నాయని హాస్పిటల్లో తరుచు చెప్పుకుంటూండేవారు. ఒక ఫ్రెంచి వక్కీలు ఈ విషయంలో ఎక్కువగా పోట్లాడుతూండేవాడు. ఒకనాడతను ఈ యుద్ధం ఎందుకు వచ్చింది చక్కగా విశదీకరించి చెప్పేడు, "జర్మనీ సామ్రాజ్య కాంక్షతో యుద్ధం లేవదీసింది. బ్రిటను ఫ్రాన్సులు తమ సామ్రాజ్యాలను కాపాడుకోవడానికి జర్మనీకి అడ్డుతగిలేరు. ఇదే ఘోర సంగ్రామంగా పరిణమించింది. ఈ సామ్రాజ్యవాదుల కోరికల నిమిత్తమే కోట్లకొలది మానవులు అహూతి చేయబడ్డారు. ఎన్నో పట్టణాలు పాడుపడినాయి, పరిశ్రమలు వెనకబడిపోయినాయి. పంటలు కూడా పాడయి ప్రపంచ క్షోభ బయలుదేరుతోంది." ఈ విధంగా చెప్పి ఉద్రేకంతో అతను మంచంమీద పడిపోయాడు.

పాటలు—పద్యాలు

రైతుబిడ్డ

(జి. కోటయ్య)

ఎండల కెండి
　　వానకు నాని
హలమును పట్టి
　　పొలమును దున్ని
నాట్లు పెంచి
　　నాట్లు వేసి
కోతలు కోసి
　　కుప్పలు నూర్చి
పండిన పంట
　　ప్రభువుల కిచ్చి
ఆకలితో నీ
　　పడుగి పోతావ్
....
వడ్లు—జొన్నలు
　　కందులు—మినుములు
ఎన్నో ధాన్యాల్
　　ఎన్నో అపరాల్
అనేక విధముల
　　అనేకరీతుల
పంటలు పండిస్తావ్
　　ఆకలితో నీ
పడుగి పోతావ్
....
దేశం కొరకు
　　సంఘం కొరకు
తోడి మానవుల
　　శ్రేయము కొరకు
ఆలు బిడ్డలు
　　అంతా కలసి
శరీర మర్పణ
　　చేస్తూ వున్నా
కాలం మారీ
　　కష్టా లొస్తే
ప్రభువులు
　　నిన్ను
కరుణిస్తారా?
....
అవసర మొచ్చి
　　అప్పులు తెస్తె
ఇచ్చిన డబ్బుకి
　　రెండింతలు వ్రాసి
కాంపౌండ్ వడ్డీతో
　　లెక్కలు కట్టి
నీవు
నమ్మిన ప్రభువులు
నిన్నే
పీల్చేస్తార్
నీవు
నమ్మిన దొరలు
నిన్నే
అణిచేస్తార్!
ప్రభువులు చెప్పే
　　కబుర్లు వింటూ
ధనికులు చేసే
　　బోధలు వింటూ
చీకట్లో—నీవు
　　బ్రతుకుటకెందె
కన్ను విప్పి
　　దేశం వైపు
చూడుము
　　ఒకసారి
....
హక్కులకై
　　పోరాడేవాళ్ళు
చెరసాలలలో
　　మ్రగ్గేవాళ్ళు
స్వేచ్ఛకై
　　ప్రాణా లిచ్చేవాళ్ళు
....
కాపున
　　రెగవోయ్
కర్షక వీరుడ
　　నడుం కట్టీ
పాగా చుట్టీ
　　నాగలి
భుజాన పెట్టీ
　　సామాన్యపు నీ
హక్కుల కొరకు
　　సంఘంలో నీ
స్థానం కొరకు
　　సమరములో
పాల్గొనవోయ్
....
జయ జయ
　　ధ్వానాల్తో
మింట చుక్కలు
　　ముద్దిడులాగున
కార్మిక—కర్షక
　　ఎర్రని జండా
అంబర వీధికి
　　ఎగరెయివోయ్
అట్లే అది
　　నిఆవాలోయ్.

స్పెయిన్ గగ్గోలు

(టి. వి. కృష్ణ)

స్పెయిను స్వాతంత్ర్యాన్నికి స్పెయిను యుద్ధానికై
కడుబీద కూలీలు నిరుపేద రైతులూ
ప్రాణాల నర్పించి జోహారులిస్తోంటె
　　చూచుచూనుంటావ! ఓ భారతీయా!
　　కన్నీటి బిందువే ప్రసరింపలేవా!
విద్రోహ బాంబులకు వికలాంగులై పోయి
మందుమాకులేక మరణ శయ్యలపైన
దొర్లుతూవున్నారు దౌర్భాగ్య సోదరుల్
　　తోటి సోదరులన్న గమనంబులేదా!
　　లేశమ్మె సాహాయ్య మొనరింపలేవా!
తల్లిదండ్రులబోయి దంటి బిక్షాలెల్ల
అమ్మ! నాటో! యనీ అలవటిస్తూవుంటె
లేత హృదయాలింత వెతజెందినాయో!
　　హృత్పిండ మొకమూరె ప్రయ్యలై పోదా!
　　మానవత్వములేదె! మనుజుడవుగావా!
జనకత్వములులేక చావుబ్రతుకూ మధ్య
ఊగులాడూచున్న వృద్ధ స్పెయినీయులా
దేశద్రోహుల అర్థనిహతులౌతూవుంటె
　　నీకు హృదయమె వుంటె వివశమైపోదా!
　　కన్నీరు కాల్వలై ప్రవహించిపోదా!
సుకుమార దేహాల సోదరీమణులెల్ల
మర ఫిరంగుల మ్రోల మ్రగ్గిపోతూవుంటె
మనుజ హృదయమెవుంటె మాడిపోకుండునా!
　　నీ రాతి గుండైన నీరుగాకుండునా!
　　ఆపాద మస్తకం అట్టుడికి పోవదా!
వేడి రక్తముగల్ల విద్యార్థులందరూ
విద్యాలయాన్ని విడిచేసి స్పెయినులో
స్వాతంత్ర్య సమరాగ్నికింద నాలౌతోంటె
　　చచ్చు పీనుగవోలె సాకులూ చెప్తావ!
　　వేడిరక్తాముంటె విరజిమ్మ లేవా!
కన్నైన చెరువనీ కనుగందులన్‌బట్టి
గొంతుకలనులిమేటి ఘోర దృశ్యముగాంచి
చపటవోలేనీవు జాలిగా చూస్తావ!
　　భరత పౌరుషమంచు బాకాలనూదేవు!
　　నీకు శౌర్యాముంటె లేచిరారమ్మోయి!
సామ్యవాదానికై సర్వస్వమర్పించు
"పాషియో నారియా" పటిమగాంచీమైన
నేను మనుజుండనంచు నడుమునూ బిగియించి
　　కష్ట జీవులమన్న గమనమే వుండేను
　　కష్ట జీవుల కండగా వుండరావోయి!
అదిగో! జహ్వారిలాలు ఆర్త హృదయపు పిల్పు
ఆ దీన గాధలన్ ఆలపిస్తూ వుంటె
హృదయ పేటికలన్ని వ్రయ్యలై పోతాయి
　　"సాహాయ్యమో" యను స్పెయిన్ సోదరులకూ
　　సాయంబు చేయరా, సాయంబు జేయరా!

యువకుడా!

(గుంటువల్లి వెంకటేశ్వరరావు)

భువన మంతా నీది
కవన మంతా నీది
అవనిలో నీకంటె అధికు లెవ్వరు లేరు
రావయ్య యువకుడా! రంగంబు మీదికి.
ఫెడరేషనొస్తుంది
హడలగొట్టాలని
జడిసికొని పడిపోక జాగేమి లేకనే
రావయ్య యువకుడా! రంగంబు మీదికి.
రాజులంతా కలసి
రాజ్యంబు చేస్తార?
పూజ్యుడవు గాకుండ, పురుషుడవు నీవుగా?
రావయ్య యువకుడా! రంగంబు మీదికి.
"ఆర్మీ"ల బిల్లులను
కార్మికుల కష్టాన్ని
కూర్మితో నీవునూ చూస్తు కూర్చున్నావ? ఎగసి
రావయ్య యువకుడా! రంగంబు మీదికి.
లేచిరా యువకుడా!
చూచుకొని నీ బొమ్మ
చూచుకొని నీ త్రోవ, పెటియుండిక, త్వరగ
రావయ్య యువకుడా! రంగంబు మీదికి.

ఆంధ్ర విశ్వవిద్యాలయ నూతన నిబంధనలు

విద్యార్థుల స్వాతంత్ర్యానికి భంగకరమైనవి

డిసెంబరు 3 వ తేదీన ఆంధ్ర యూనివర్సిటీ చర్రింది విద్యార్థుల శిక్షణ నిబంధనలను అంగీకరించింది:

1. అల్లరి జరుగుతుందని ప్రిన్సిపాలుకు తోచినప్పుడు, విద్యార్థులు రాజకీయ సభలకు వెళ్ళగూడదని కాలేజి ప్రిన్సిపాలు ఆజ్ఞాపించవచ్చును.

2. రాజకీయ సభలవద్ద సోషల్ సర్వీసు చేయుటానికి విద్యార్థులను వలంటీయలుగా నియమించవచ్చును. రాజకీయ సభలవద్ద వారు సోషలు సర్వీసు చేస్తే, అది రాజకీయ సభలో పాల్గొనడంగాదు. వలంటీయర్లైన విద్యార్థులను రాజకీయ కార్యాలకు నియమించగూడదు.

3. ఈ విశ్వ విద్యాలయానికి సంబంధించిన, లేక అనుబంధాలుగాయున్న, కళాశాలలలో చదువుకొన్న విద్యార్థులలో ఎవరయినా ఆ కాలేజీకి సంబంధించని క్లబ్బులోగాని, సంఘములోగాని చేరదలచిన యెడల, అవి గవర్నమెంటుచే ఆమోదింపబడినవి కాకపోతే, అలాగు చేరడానికి ముందుగా ప్రిన్సిపాలు అనుమతి పొందాలి. విద్యార్థి తండ్రిగాని, సంరక్షకుడుగాని వ్రాతమూలకంగా అనుమతిని కోరితే ప్రిన్సిపాలు సాధారణంగా తిరస్కరించడు.

4. సత్ప్రవర్తనాభావం కోసమున్నూ, విద్యార్థుల లాభం కోసమున్నూ, విద్యార్థులకు జుల్మానా వేయడం, అపెండెన్సును రద్దు చెయ్యడం, టెరము సర్టిఫికెట్లను రద్దు చెయ్యడం, సస్పెండు చెయ్యడం, వెళ్ళగొట్టడం మొదలయిన శిక్షలను వెయ్యడానికి ప్రిన్సిపాలుకున్నూ, కళాశాలాధికారికిన్ని, హాస్టలు అధికారికిన్నీ అధికారం ఉంటుంది.

5. ఈ విశ్వ విద్యాలయానికి సంబంధించిన కళాశాలలలో చదువుతూవున్న విద్యార్థులెవరైనా సమ్మె కట్టడం, మొదలయిన నేరాలను చేస్తే వెంటనే వారి స్కాలరుషిప్పులను, ఉచిత భోజన సౌకర్యాలను, తక్కువ జీతాల సహాయాలను రద్దు చెయ్యాలి. నిందితులు అనుమతి లేకుండా యీ సహాయములను నేరం చేసిన విద్యార్థులకు తిరిగి యివ్వగూడదు. వారు 12 గంటలలోగా హాస్టలులోనుంచి వెళ్ళిపోవాలని ఆజ్ఞాపించవచ్చును.

ఈ పై నిబంధనలు యూనివర్సిటీ విద్యార్థులను, విద్యాలయాధికారులకు బానిసలుగా తయారుచేయడము కోసము ఏర్పాటు చేయబడినవి. శ్రీ రాజగోపాలాచార్యులవారు ఆంధ్ర దేశములో పర్యటనము చేసినప్పుడు, విద్యార్థులు ప్రశ్నలు వేయగా, ఈ విధంగా చెప్పారు. "పార్టీ, కమ్యూనలు, రాజకీయములలో వప్ప, ఇతర అన్ని రాజకీయ విషయములలో పాల్గొనవచ్చును." మన ప్రధాని యిచ్చిన వాగ్దానాన్ని బట్టిచూస్తే, ఆంధ్ర విశ్వవిద్యాలయపు నిబంధనలు అతి ఘోరంగా యున్నవి. క్రమంగా అభివృద్ధి అగుచున్న విద్యార్థుల రాజకీయ చైతన్యమును అరికట్టడానికి క్రిందటి సంవత్సరము పోరాటమువల్ల విద్యార్థులు సంపాదించిన హక్కులను నాశనము చేయడానికి ఈ నిబంధనలు ఉద్దేశింపబడినవి. కాంగ్రెసు మంత్రులు అధికారములో ఉండగా, విద్యార్థులు రాజకీయ సభలకు కూడా ప్రిన్సిపాలు అనుమతి లేక హాజరు కాకూడదని నిషేధించుట ఆశ్చర్యము. బ్రిటిషు సామ్రాజ్య వాదాన్ని ఎదిరించుచున్న మిడ్నపూరు, చిట్టగాంగు విద్యార్థులపై, బ్రిటిషు సామ్రాజ్య వాదులు పెట్టిన నిబంధనలు మాదిరిగా ఉన్నవి యీ శిక్షణా నిబంధనలు.

విద్యార్థులు, ప్రిన్సిపాలు అనుమతిలేక యితర సంఘములలోగాని, క్లబ్బులలోగాని చేరరాదన్న నిషేధములన్ని విద్యార్థుల సంఘములను బ్రద్దలు కొట్టడానికి, విద్యార్థుల ఐకమత్యాన్ని నాశనము చేయడానికై, ఉద్దేశింపబడినది. ఒక వైపున సంయుక్తరాష్ట్రములలో కాంగ్రెసు ప్రభుత్వము విద్యార్థుల సంఘములను రికగ్నయిజు చేయగా మన రాష్ట్రములో కాంగ్రెసు మంత్రుల అధికారంలోనే, విద్యార్థులు ఇతర సంఘములలో చేరరాదని నిషేధించుటలో గల ఘోరము విద్యార్థులు, కాంగ్రెసు వాదులు, స్వాతంత్ర్యము రావాలని కోరే ప్రతివారు, గ్రహించాలి. ఇంతకంటె ఘోరమైన విషయం, కాంగ్రెసు టిక్కెటుమీద సెనేటు మెంబర్లయి, విద్యార్థులను బానిసలుగా చేయడానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటే, కాంగ్రెసు సెనేటుమెంబర్లు దానికి సహాయం చేయుట!

విద్యార్థులందరు, ఈ శిక్షణా నిబంధనల ఉద్దేశం గ్రహించాలి. అభివృద్ధి అగుచున్న విద్యార్థుల రాజకీయ చైతన్యమును, వారి సంఘాలను అరికట్టడమే వీని లక్ష్యము. ఈ నిబంధనలు మన ప్రధాని యిచ్చిన వాగ్దానానికి పూర్తిగా వ్యతిరేకము. అందువలన విద్యార్థులు విద్యార్థుల సంఘాలు తీవ్ర ఆందోళన బయలుదేర దీయాలి. కాంగ్రెసు సంఘముల సానుభూతి సంపాదించాలి.

క్రొత్త నిబంధనలు పోవాలి!

మద్రాసు రాష్ట్ర విద్యార్థి కేంద్రసంఘము.

విద్యార్థి సంఘములు

నవంబరు 29 వ తేదీ మంగళవారము సాయంత్రం 6 గంటలకు అమలాపురము హైస్కూలు భవనములో అమలాపురపు విద్యార్థులసభ కామ్రేడ్ పర్వతనేని వెంకటేశ్వరరావు గారిచే జరుపబడెను. శ్రీ దుప్పాటి కృష్ణారావు గారు బి. ఎ. బి. యల్. అధ్యక్షత వహించిరి. దుప్పాటి కృష్ణారావుగారు, యు. నరసింహారావుగారు, వి. రామచంద్రరావుగారు, బి.యన్. శాస్త్రిగారు బి. యె. బి. ఎల్. విద్యార్థి సంఘములో చేరవలని ప్రోత్సహించిరి. పర్వతనేని వెంకటేశ్వరరావుగారు విద్యార్థి సంఘావశ్యకతను గూర్చి మాట్లాడిరి. వెంటనే స్థాపింపబడిన అమలాపుర విద్యార్థి సంఘమునకు వి. నాగేశ్వరరావుగారు కార్యదర్శిగ ఎన్నుకొనబడిరి.

నవంబరు 30 వ తేదీ బుధవారం సాయంత్రం 4—30 గంటలకు రాజోలు హైస్కూలు భవనములోని విద్యార్థుల సభ పర్వతనేని వెంకటేశ్వరరావుగారిచే జరుపబడెను. సభకు శ్రీ డి. రామచంద్రరావు బి. ఎ. బి. యల్. గారు అధ్యక్షత వహించిరి. పర్వతనేని వెంకటేశ్వరరావుగారు విద్యార్థి సంఘావశ్యకతను గూర్చి మాట్లాడిరి. వెంటనే స్థాపించబడిన 'రాజోలు విద్యార్థి సంఘము'నకు యన్. కామేశ్వరరావుగారు కార్యదర్శిగా ఎన్నుకొనబడిరి.

డిసెంబరు 2 వ తేదీ సాయంత్రం 6 గంటలకు కొత్తపేట సత్రములో పర్వతనేని వెంకటేశ్వరరావుగారిచే కొత్తపేట విద్యార్థుల సభ జరుపబడెను. సభలో సంఘావశ్యకతను గూర్చి పర్వతనేని వెంకటేశ్వరరావు, వి. విశ్వేశ్వరరావు, వై సూర్యనారాయణ మొదలగువారు మాట్లాడిరి. వెంటనే కొత్తపేట విద్యార్థి సంఘము స్థాపించబడెను. సంఘమునకు కామ్రేడ్ వి. విశ్వేశ్వరరావు కార్యదర్శిగ ఎన్నుకొనబడిరి.

సంవత్సర చందా	3—0—0
అర్ధ సంవత్సర చందా	1—10—0
విడి ప్రతి [24 పేజీలు] అణా	

నవశక్తి కార్యాలయం,
గవర్నరు పేట, బెజవాడ.

నవశక్తి

ADVERTISE
IN
NAVASAKTI
The Leading Telugu
Socialist Weekly

Published by M. Chandrasekhara Rao } at Navasakti Press, Governorpet, Bezwada.
Printed by Tummala Venkata Ramiah }

END OF ISSUE